అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సోమవారం 14-8-2017

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 3 సంచిక : 227 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00



బ్లూ వేల్ డెత్‌గేమ్

- బెంగాల్‌లో పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య
- ఇప్పటికి 130 మందిని మింగిన ఆన్‌లైన్ ఆట

కోల్‌కతా: ఆన్‌లైన్ గేమ్ బ్లూవేల్ మరింత ప్రమాదకరంగా తయారవుతున్నది. ఆత్మహత్యకు ప్రేరేపించే ఈ ఆట.. దేశంలో మరొకరి ప్రాణాలను బలి తీసుకున్నది. బెంగాల్‌లో ఓ విద్యార్థి ఆన్‌లైన్‌లో బ్లూవేల్ చాలెంజింగ్ గేమ్ ఆడుతూ ఒక్కసారిగా ఆత్మహత్య చేసుకున్నాడు. మిడ్నాపోర్ ...9లో



మరో రెండు రోజుల్లో భారీ వర్షాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మరో రెండు రోజుల్లో రాష్ట్రంలో భారీ వర్షాలు కురవనున్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. కోస్తా నుంచి రాయలసీమ, తమిళనాడు మీదుగా ద్రోణి ఏర్పడిందని, దీని ప్రభావంతో రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని అధికారులు తెలిపారు. అదే విధంగా మరో వారం రోజుల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, దీంతో 16, 17 తేదీల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పలు చోట్ల ఓ మోస్తరు వర్షాలు కురిసే ...9లో

దళితురాలికి మద్దతు తెలిపినందుకు..

ఆమె బహిష్కరణ

ఫిర్యాదు చేసినా.. చర్యలు శూన్యం...

- అక్క ఇంట్లో ఫంక్షన్‌కూ అనుమతి నిరాకరణ
- తీవ్ర మనోవేదనతో మరోసారి ఫిర్యాదు
- ఆ కుటుంబంతో మాట్లాడితే రూ.20 వేల జరిమానా
- మల్లారంలో వెలుగుచూసిన పెత్తందార్ల అరాచకం



నవతెలంగాణ-వేములవాడరూరల్

దళిత మహిళకు జరిగిన అన్యాయాన్ని పోలీసుల ఎదుట ఓ మహిళ నిర్భయంగా చెప్పింది. దీంతో ఆ పెద్దింటి మహిళ అదే పెత్తందారీ సామాజిక తరగతి నుంచి బహిష్కరణకు గురైంది. దీనిపై ఆ మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ ఘటనలో తొమ్మిది మంది పెత్తందారులపై కేసు నమోదైంది తప్ప పోలీసులు తీసుకున్న చర్యలు శూన్యం. మరోవైపు ఆ మహిళ కుటుంబం ఊర్లో వెలివేయబడి ఒంటరిగానే ఉంటున్నది. తాజాగా రెండ్రోజుల కింద 'ఇంట్లో శుభకార్యం ఉంది అందరూ రావాలి' అంటూ హైదరాబాద్‌లో ఉండే ఆ మహిళ అక్క కార్డులు ...9లో

కోదండరామ్ దేశద్రోహి కాదు

అరెస్టుకు రాఘవులు ఖండన 3లో

వలసల బండి

కూలి రూ.300... మిగిలేది 150

- ఖమ్మం, భద్రాద్రి జిల్లాల నుంచి నిత్యం వేలాది మందికి తప్పని వలసలు
- ఆయకట్టుకు నీరు రాక..'ఉపాధి' లేక...

వనం నాగయ్య

పాడిపంటలతో కళకళలాడుతూ రాష్ట్రంలో వాణిజ్య పంటల రాజధానిగా ప్రసిద్ధి గాంచిన ఖమ్మం జిల్లాలో నేడు భూములు పడావుబడ్డాయి. ఏడేండ్లుగా సాగర్ ఆయకట్టుకు నీరు రాక సాగు సాగక...సర్కారు 'ఉపాధి' దొరకక నేడు వలసల నిలయంగా మారింది. ఖమ్మం ఉమ్మడి జిల్లా నుంచి నిత్యం పలుప్రాంతాలకు వేలాది మంది వలసబాట పడుతున్నారు. ప్రతిరోజూ జిల్లా కేంద్రమైన ఖమ్మం మీదుగా ఉదయం వెళ్లే ప్యాసింజర్ రైలులో ఆంధ్రప్రదేశ్‌కు ఆరువేల మంది కూలీలు పనికోసం వెళ్తున్నారు. సాయంత్రం సొంత ప్రాంతాలకు తిరిగొస్తున్నారు. ఉరుకులపరుగుల మీద ఉపాధి కోసం కృష్ణా జిల్లా కొండపల్లికి వెళ్తున్న కూలీలకు మిగిలేది అరకొరే. పనుల్లేక పొట్టకూటి కోసం ఇతర ప్రాంతాలకు వలసపోతున్న కూలీలపై కథనం.. 9లో

నవతెలంగాణ పరిశీలనాత్మక కథనం



ఖమ్మం రైల్వే స్టేషన్..



ముగిసిన తీజ్ ఉత్సవాలు

హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి హౌజింగ్ బోర్డు కాలనీలో గిరిజన సంస్కృతి ఉట్టి పడేలా తీజ్ ఉత్సవాలు నిర్వహించారు. గిరిజన యువతులు వరి మొలకల గంపలు నెత్తిన పెట్టుకొని ఊరేగింపు నిర్వహించారు. కూకట్‌పల్లి రంగదాముని చెరువులో వాటిని నిమజ్జనం చేశారు.

ఇది నర సంహారమే

యోగి సర్కార్‌పై జనాగ్రహం

- ఆస్పత్రికి వచ్చిన సీఎంకు నల్లజెండాలతో నిరసన ప్రదర్శన
- ఆందోళనకారులపై ఖాకీల దౌర్జన్యం
- తప్పిదాన్ని కప్పిపుచ్చేందుకు.. ఇద్దరు అధికారులపై వేటు





లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో చిన్నారుల మరణాలపై నిరసన సెగలు భగ్గుమన్నాయి. చిన్న పిల్లలను చిదిమేసిన ఘటనతో ఆదివారం ఉద్రిక్తతకు దారితీసింది. ఓవైపు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్.. బాబా రాఘవ్ దాస్(బీఆర్డీ) మెడికల్ కళాశాలను సందర్శనకు బయలుదేరారు. ఆయనతో పాటు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి నడ్డా కూడా ఉన్నారు. మరోవైపు గోరఖ్‌పూర్‌లో చిన్నారుల మరణాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. నిరసనలు మిన్నంటాయి. బాధిత కుటుంబాలతో పాటు భారీ సంఖ్యలో ప్రదర్శన నిర్వహించారు. ప్లకార్డులు చేతబట్టి నినాదాలతో హోరెత్తించారు. కాసేపట్లో యోగి ఆస్పత్రికి చేరుకుంటారనుకున్న దశలో.. అమాంతంగా కొందరు నల్లజెండాలతో నిరసనకు దిగారు. చిన్నారుల ప్రాణాలు పోవటానికి బీజేపీ సర్కారే కారణమంటూ నినాదాలు చేయటం ...9లో

యోగి సర్కారుదే బాధ్యత: సీపీఐ(ఎం) 9లో

వణుకుతున్న గుజరాత్...

స్వైన్‌ఫ్లూ బారిన 1,344 మంది

ఇప్పటివరకు138 మంది మృతి.. 2లో

అధికారమే లక్ష్యం...

కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సమావేశంలో తీర్మానం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలని కాంగ్రెస్‌పార్టీ తీర్మానం చేసింది. ఇందులో భాగంగా మిషన్-2019ను అమలు చేయాలని నిర్ణయించింది. ముఖ్య నాయకత్వం నిత్యం ప్రజల మధ్యే ఉండాలని, పార్టీని మరింత ప్రజలకు చేరువ చేయడానికి కార్యక్రమాలు చేపట్టాలని షెడ్యూల్ పెట్టుకుంది. ఇందులో భాగంగా గడప గడపకు పార్టీని తీసుకెళ్లాలన్న నిర్ణయానికి వచ్చింది. ఆదివారం గాంధీ భవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సమావేశం జరిగింది. ఇందులో ...9లో

ఖాకీలా..! భూ భక్షకులా!

భూ యజమానులకు బెదిరింపులు

- బలవంతంగా చెక్కులపై సంతకాలు
- సీపీని ఆశ్రయించిన బాధితులు
- కేసు నమోదుకు ఆదేశాలు

నవతెలంగాణ - హైదరాబాద్ సిటీబ్యూరో

ఓ పోలీసు కూతురు మరికొందరితో కలిసి భూమి కొన్నారు. ఆ తర్వాత డబ్బులు కట్టలేకపోయారు. దీంతో యజమాని మరొకరికి భూమిని అమ్మేశాడు. ఇది గిట్టని ఆ పోలీసు కూతురు తండ్రి అండతో భూమి కొన్నవారినీ, అంతకు ముందున్న యజమానినీ బెదిరించారు. బలవంతంగా చెక్కులపై సంతకాలు పెట్టించుకున్నారు. హైదరాబాద్‌లోని రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనపై బాధితులు సీపీ సందీప్ శాండిల్యాకు మొరపెట్టుకోగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. సీపీ ఆదేశాలతో రాచకొండ అదనపు డీసీపీ పులిందర్‌రెడ్డి, రాయదుర్గం సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ రాజశేఖర్‌లతో పాటు ఎనిమిది మందిపై కేసు నమోదైంది. ఈ భూ వివాదం కేసు విచారణ బాధ్యతను మాదాపూర్ ఏసీపీ రమణకుమార్‌కు అప్పగించారు. పోలీసుల వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం ప్రాంతంలోని రెండెకరాల భూమిపై రెండేండ్లుగా క్రయవిక్రయాల వివాదం కొనసాగుతున్నది. ఈ భూమికి యజమానిగా ఉన్న ఖాద్రీ నుంచి రాచకొండ అదనపు డీసీపీ పులిందర్‌రెడ్డి కుమార్తె ఐశ్వర్యరెడ్డి, అబూబకర్, అబ్దుల్లాలు రూ.1.10 కోట్లకు కొనుగోలు చేసి అడ్వాన్స్ ఇచ్చారు. అగ్రిమెంట్ రాయించుకున్నారు. నిర్దేశించిన సమయంలో ...9లో



కాలుష్యం కోరల్లో జనం

నిబంధనలు పాటించని పరిశ్రమల వల్ల తాగునీటి వనరులు కలుషితం

- కసది నదిలోని రసాయనిక నీటి మూలంగా నీలం రంగులో శునకాలు
- మెదక్, రంగారెడ్డి, హైదరాబాద్, నల్లగొండ, వరంగల్ జిల్లాలు: జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ సర్వేలో వెల్లడి

జలం + గరళం = ప్రాణసంకటం

మీ ఇల్లే కాకుండా, మీ చుట్టు పక్కల ప్రాంతాలను శుభ్రంగా చూసుకునే బాధ్యత మీపై ఎంతైనా ఉన్నది. గౌరవ ప్రధాని మోడీ 'స్వచ్ఛ్ భారత్' ప్రధాన లక్ష్యమూ అదే! అంటూ పదే పదే 'పాడిందే పాడరా పాచి పళ్ల దాసన్నా' అన్నట్టు పొద్దస్తమానమూ వల్లెవేస్తున్న అధికారులకు.. రాజకీయ అండదండలతో విర్రవీగుతూ, అక్రమంగా పెచ్చరిల్లుతూ.. రసాయనిక పరిశ్రమల యాజమానులు చేస్తోన్న ఆగడాలు మాత్రం కనిపించడం లేదు. ఫలితం.. మృత్యుకౌగిట్లోకి చేరుతోన్న మూగ జీవాలు, రోగాలబారిన పడుతోన్న అమాయక ప్రజలు. 9లో


(ఫైల్)

వణుకుతున్న గుజరాత్

- స్వైన్‌ఫ్లూ బారిన 1,344 మంది
- ఇప్పటివరకు 138 మంది మృతి



అహ్మదాబాద్ : గుజరాత్‌లో స్వైన్‌ఫ్లూ విజృంభిస్తోంది. యేడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఈ వైరస్ సోకి 138 మంది చనిపోయినట్టు ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి శంకర్ చౌదరీ వెల్లడించారు. జనవరి నుంచి ఈనెల 11 వరకు 1,344 మందికి స్వైన్‌ఫ్లూ సోకిందని, వీరిలో 138 మంది వ్యాధి తీవ్రతరమై మృతి చెందారని వివరించారు. 708 మంది ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, మిగిలిన 498 మందికి వ్యాధి పూర్తిగా నయమైందని ఆయన తెలిపారు. వైరస్ సోకి అహ్మదాబాద్‌లో అత్యధికంగా 37 మంది చనిపోగా..రాజ్‌కోట్‌లో 17 మంది మృతి చెందారు. స్వైన్‌ఫ్లూ కేసులు అంతకంతకూ పెరుగు తుండడంతో రాష్ట్ర సీఎం విజయ్ రూపానీ.. ఆరోగ్య శాఖ ఉన్నతాధికా రులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యాధి నివారణ కోసం తీసుకోవల్సిన జాగ్రత్తలపై, ఇప్పటికే సోకిన వారికి అందిస్తున్న చికిత్సపై ఈ సమావేశంలో సీఎం ఆరా తీశారు. తగు జాగ్రత్తలు తీసుకొ ని, వ్యాధి నివారణకు కృషి చేయాలని అధికారులను ఆయన ఆదేశిం చారు. అంతేకాక, దీనిపై అన్ని జిల్లా కలెక్టర్లు, ఆరోగ్య శాఖ అధికారులతో రూపానీ వీడియో కాన్ఫరెన్స్ కూడా నిర్వహించారు. స్వైన్‌ఫ్లూ నివారణపై రాష్ట్రంలో 17 వేల బృందాలు ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఈ బృందాల్లో 40 వేల మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 5 వేల మంది ఎంబీబీఎస్ డాక్టర్లు, 3 వేల మంది ఆయుష్ డాక్టర్లు ఉన్నట్టు వివరించింది.

ఢిల్లీ రైలులో దారుణం...

- ఇద్దరు ప్రయాణికులను బయటకు తోసేసిన తోటి ప్రయాణికులు
- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

న్యూఢిల్లీ : ఢిల్లీ నుంచి ఆగ్రా బయలుదేరిన ఇంటర్‌సిటీ రైలులో దారుణం చోటు చేసుకున్నది. రైల్లో ప్రయాణీకుల మధ్య సీట్ల కోసం ఘర్షణ జరిగింది. దీంతో, రెచ్చిపోయిన కొందరు ప్రయాణీకులు ఇద్దరు సహచర ప్రయాణికులను కదులుతున్న రైలు నుంచి కిందికి తోసేశారు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రున్ని రైల్వే ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అతని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

భార్యాపిల్లలను కాపాడి ఆహుతైన భర్త

- కారు ప్రమాదంలో సజీవదహనం

కోయంబత్తూరు : కారు ప్రమాదంలో భార్యాబిడ్డలను కాపాడిన ఓ వ్యక్తి తాను మాత్రం బయట పడలేకపోయాడు. మంటలు చుట్టు ముట్ట డంతో కారులోనే సజీవ దహనమయ్యాడు. ఈ ఘటన తమిళనాడులోని కోయంబత్తూరులో చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. బెంగళూరుకు చెందిన నగల వ్యాపారి దిలీప్‌కుమార్ తమిళనాడులో నివాసముంటున్నాడు. కాగా శనివారం ఉదయం తన భార్య, ఇద్దరు పిల్లలతో కొచ్చికి కారులో బయలు దేరాడు. కోయంబత్తూరులోని మధుక్కరైలో ఉన్న టోల్ గేటు సమీపంలోకి రాగానే కారు ఇంజన్‌లో మంటలు లేచి అంతటా వ్యాపించాయి. వెంటనే అప్రమత్తమైన దిలీప్.. తన భార్య, పిల్లలను వాహనంలోంచి బయటకు తోశాడు. కానీ, దిలీప్ పెట్టుకున్న సీటు బెల్టు సకాలంలో తీయలేకపోవడంతో అగ్నికి ఆహుతయ్యాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కార్గిల్ అమరవీరుల త్యాగాలపై బీజేపీ రాజకీయం

దేశభక్తి అంటే అదేనా..?

- వాజ్‌పేయి ప్రభుత్వం జాగరూకత వహిస్తే త్యాగాల అవసరమే ఉండేది కాదంటున్న నిపుణులు

నవతెలంగాణ, జనరల్ డెస్క్


ఫైల్

ప్రతిఏటా కార్గిల్ విజయ్ దినోత్సవం జులై 26న జరుపుకుంటాం. కార్గిల్ యుద్ధంలో భారత సైన్యం సాధించిన విజయానికి గుర్తుగా దీనికి ఎంతో ప్రాధాన్యత ఉన్నది. అయితే, ఆ విజయం వెనుక 474మంది సైనక అధికారులు, సైనికుల త్యాగాలున్నాయన్న విషయం మరిచిపోకూడదు. సరిహద్దులు దాటి భారత్‌లోకి చొచ్చుకువచ్చిన చొరబాటు దారుల్ని వెనక్కి నెట్టడంలో వారి త్యాగాలు ఎంతో విలువైనవి. అయితే, పాలకపార్టీ మాత్రం ఈ సందర్భాన్ని తమ రాజకీయ క్రీడకు అనుకూలంగా మలచుకునేందుకు యత్నిస్తోందన్న విమర్శలున్నాయి. దేశంలోని విశ్వవిద్యాలయాల్లో ఉదార భావాలు వ్యక్తం చేసే విద్యావంతులపై దాడికి ఈ సందర్భాన్ని ఉపయోగించుకోవాలని చూడటం విస్మయం కలిగిస్తోంది.

రాజకీయ ఎజెండా ఎందుకు..?

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా జేఎన్‌యూలో ఓ ప్రదర్శన నిర్వహించారు. జాతీయ జెండా చేబూనిన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆ ప్రదర్శనకు నేతృత్వం వహించారు. సైన్యం పట్ల అభిమానాన్ని చాటుకునేందుకు గుర్తుగా ఆర్మీ ట్యాంక్‌ను యూనివర్సిటీ పరిసరాల్లో ఏర్పాటు చేయాలని వైస్ చాన్సలర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా జేఎన్‌యూలోని ఉదారవాదులపై తాము పైచేయి సాధించినట్టుగా ఓ రిటైర్డ్ సైనికాధికారి టీవీ ఛానల్స్ ద్వారా చెప్పడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. జాదవ్‌పూర్ యూనివర్సిటీ, హైదరాబాద్ యూనివర్సిటీలోనూ ఇదే తరహాలో దూసుకుపోవాలంటూ ఆయన పిలుపునిచ్చారు. ఓ వారం తర్వాత బీజేపీ అనుబంధ విద్యార్థి సంఘం హెచ్‌సీయూలో కార్గిల్ స్మారకాన్ని ఏర్పాటు చేసింది. అయితే, ఈ స్మారకాన్ని రోహిత్ వేముల స్మారకం ముందు ఏర్పాటు చేయడం దేనికి సంకేతం..? 2016 జనవరిలో యూనివర్సిటీ హాస్టల్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డ దళిత విద్యార్థి రోహిత్ వేముల. అంటే అమర జవాన్ల స్మారకం రోహిత్ వేముల స్మారకానికి పోటీనా..? దేశభక్తి కొందరికి మాత్రమే గుత్త సొత్తా..? ఈ దేశంలోని దళితులూ, బహుజనులూ దేశ భక్తులు కాదా..? హిందుత్వ శక్తుల ఇటువంటి చర్యల వెనుక అమర జవాన్ల పట్ల ప్రేమ, దేశభక్తి కన్నా వేరే ఉద్దేశాలున్నాయన్నది స్పష్టమే ఆతర్వాత యూనివర్సిటీ అధికారులు ఆ స్మారకాన్ని తొలగించారు.

దేశభక్తి నిజమైందే అయితే..పాకిస్తాన్ సరిహద్దుల నుంచి చొరబాట్లు జరగకుండా కట్టడి చేయాలి. మరింత మంది మన జవాన్లు ఉగ్రవాదుల చేతుల్లో చనిపోకుండా చూడాలి..ఉగ్రవాదులను మన దేశంలోకి పంపకుండా పాకిస్తాన్‌ను వ్యూహాత్మకంగా కట్టడి చేయడంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం విఫలమవుతోందనేందుకు అనేక ఉదాహరణలున్నాయి. గతంలోనూ భారత సైన్యం వీరోచిత త్యాగాలు చేసింది. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో 1947, అక్టోబర్ 27న జరిగిన సంఘటనను ఓసారి గుర్తు చేసుకుందాం. భారత వైమానిక దళం రంగంలోకి దిగి కాశ్మీర్‌ను కాపాడిన సంఘటన అది. ఆ సందర్భంలోనూ భారత సైన్యం తెగించి పోరాడుతూ త్యాగాలకు సిద్ధపడింది. అయితే, అటువంటి చారిత్రక సందర్భాన్ని ఎవరూ రాజకీయంగా వాడుకోవాలని చూడలేదు. మరో సందర్భం కూడా గుర్తుంచుకోదగిందే. పాకిస్తాన్ నుంచి బంగ్లాదేశ్‌ను విడదీయటానికి జరిగిన యుద్ధం. ఆ సందర్భగా 1971 డిసెంబర్‌లో భారత సైన్యం ఢాకాను స్వాధీనం చేసుకున్నది. ఈ సంఘటనను కూడా ఎవరూ తమ రాజకీయాలకు వాడుకోవడంలేదు. అందుకు భిన్నంగా కార్గిల్ ఘటనలో సైనికుల త్యాగాలను ఏదో ఒక రాజకీయ పార్టీ వాడుకో చూడటం ఎంతవరకు సమంజసం..?

కార్గిల్ సంఘటన వెనుక కూడా అప్పటి బీజేపీ ప్రభుత్వ వైఫల్యమే కారణం. పాకిస్తాన్ నుంచి చొరబాట్లను కట్టడి చేయడంలో విఫలమైనందునే మనం మన సైనికుల్ని కోల్పోవాల్సి వచ్చింది. 1999 ఫిబ్రవరిలో నియంత్రణ రేఖ వద్ద చొరబాటుకు పాక్ సైన్యం ప్రణాళిక వేసింది. అప్పటి ప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పేయి ఆ సమయంలో పాకిస్తాన్‌తో చర్చల కోసం లాహోర్ యాత్ర చేపట్టారు. పాక్‌తో స్నేహాన్ని పెంపొందించాలన్నది యాత్ర ఉద్దేశం. కానీ, జరిగిందేమిటి..? చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు మనల్ని మోసం చేసిందంటూ పాక్‌ను నిందించడం వల్ల ప్రయోజనమేముంది..? ప్రభుత్వం తన జవాబుదారీ బాధ్యత నుంచి తప్పించుకోజూడటం తప్పు.

కార్గిల్ వైఫల్యాలు

పాక్ చొరబాటు గురించి మే 5న సమాచారమొచ్చింది. మే 25న రక్షణ వ్యవహారాలపై మొదటి క్యాబినెట్ భేటీ జరిగింది. వైమానిక దళాల్ని రంగంలోకి దించాలని నిర్ణయించారు. ఈ ఆలస్యానికి కిందిస్థాయి సైనికాధికారుల్నిగానీ, ఏదో ఒక సైనిక విభాగాన్నిగానీ మనం నిందించలేం. ఉన్నతాధికారులు, రీసెర్చ్ ఎనాలసిస్ వింగ్(దేశ అత్యున్నత నిఘా విభాగం), ప్రధాని కార్యాలయం, రక్షణ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ..ఇందుకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవడంలో కీలక పాత్ర వహిస్తాయన్నది గమనార్హం. పాక్ సైన్యం పకడ్బందీగా రూపొందించిన పథకానికి మన సైన్యం తమ ప్రాణాలను పణంగా పెట్టాల్సి వచ్చింది. గోటితో పోయేదాన్ని గొడ్డలిదాకా రానిచ్చినట్టు..ముందే మేల్కొంటే కార్గిల్‌లో యుద్ధ పరిస్థితే తలెత్తేది కాదు. సరిహద్దులో నెలకొన్న ఆనాటి ఉద్రిక్తత చివరికి అణు యుద్ధానికి దారితీస్తుందంటూ ఊహాగానాలు వ్యక్తమయ్యాయి. అయితే, అందుకు మనల్ని మనం నిందించుకోవాల్సిందేమీ లేదు. అటువంటిది జరగకుండా పాక్‌పైనా బాధ్యత ఉంటుంది.

సమీక్ష కోసం కమిటీ

కార్గిల్ సంఘటనకు దారితీసిన పరిస్థితులను సమీక్షించేందుకు వాజ్‌పేయి ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. పాక్ చొరబాటుకు అవకాశమిచ్చిన పరిస్థితులపై విశ్లేషించి, భవిష్యత్‌లో అలాంటివి జరగకుండా సూచనలు ఇవ్వాలని కమిటీకి నిర్దేశించారు. 'రా' పనితీరును కమిటీ విమర్శించింది. సైన్యంపైన ఎలాంటి విమర్శలూ చేయలేదు. అయితే, లాహోర్ పర్యటన అసందర్భమన్న అర్థం వచ్చేలా కమిటీ వ్యాఖ్యానించింది. సైనికుల ధైర్య సాహసాలు, వారి త్యాగాలే ప్రభుత్వంపై విమర్శలు రాకుండా కాపాడాయన్నది గమనార్హం. ప్రభుత్వం వైపు నుంచి కార్గిల్ పరిస్థితిపై తగిన సమయంలో మదింపు జరిగి ఉంటే జవాన్ల ప్రాణాలు బలిపెట్టాల్సిన అవసరమే ఉండేది కాదన్న అభిప్రాయాలు నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఆనాటి ప్రభుత్వ అలసత్వాన్ని విస్మరించి జవాన్ల బలిదానాలను రాజకీయంగా వాడుకోవడం ద్వారా వారి త్యాగాలకు విలువనిచ్చినట్టు అవుతుందా..?

(మెయిల్ టుడేలోని మనోజ్ జోషీ వ్యాసానికి స్వేచ్ఛానువాదం)

హిమాచల్‌ప్రదేశ్‌లో కొండ చరియలు విరిగిపడి 46మంది మృతి

- మృతులంతా రెండు బస్సుల్లోని ప్రయాణికులు

మండి: హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి జిల్లాలో కొండ చరియలు విరిగి పడిన ఘటనలో 46 మంది మృతి చెందారు. కొన్నిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఈ సంఘటన జరిగింది. ఆ రాష్ట్ర రవాణాశాఖకు చెందిన రెండు బస్సులపై మండి జిల్లా కోట్రుగల్ గ్రామం వద్ద ఆదివారం ఉదయం కొండ చరియలు విరిగి పడ్డాయి. ఈ ఘటనలో రెండు బస్సుల్లోని ప్రయాణికులు మృతి చెందారు. ఓ బస్సు దాదాపు కిలోమీటర్ దిగువన లోయలో పడి కొట్టుకుపోగా, మరో బస్సు శిథిలాల కింద పూర్తిగా చిక్కుకున్నది. రెండు బస్సుల్లో కలిపి మొత్తం 50మంది ప్రయాణికులు ఉన్నట్టు తెలుస్తోంది. ఘటనా స్థలానికి చేరుకున్న జాతీయ విపత్తు స్పందన దళాలు(ఎన్‌డీఆర్ఎఫ్) సహాయక చర్యలు చేపట్టాయి. శిథిలాల కింద నుంచి మృత దేహాలను వెలికి తీస్తుండగా, మరోసారి కొండ చరియలు విరిగి పడటంతో సహాయక చర్యలకు అంతరాయం కలిగింది. ఆ దారిలో దాదాపు 250 మీటర్లమేర రోడ్డు ధ్వంసమైంది. మరికొన్ని వాహనాలు కూడా కొండ చరియల కింద చిక్కుకున్నట్టు తెలుస్తోంది. ఈ ఘటనతో 21వ జాతీయ రహదారిలో ట్రాఫిక్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. మృతుల కుటుంబాలకు ఆ రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది.

రాజస్తాన్‌లో టవేరా, ట్రాలీ ఢీ..

- ఆరుగురి మృతి

జైసల్మేర్ : రాజస్తాన్‌లోని చిత్తోర్‌గఢ్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా, 8మంది తీవ్రంగా గాయపడ్డారు. చిత్తోర్‌గఢ్‌లోని బేగన్ ప్రాంతంలో 76వ జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి వేగంగా వెళ్తున్న టవేరా వాహనం ఎదురుగా వస్తున్న ట్రాలీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతులంతా టవేరాలో ప్రయాణిస్తున్న ఓ కుటుంబానికి చెందినవారుగా తెలుస్తోంది. టవేరాలో 14మంది కుటుంబసభ్యులు రాజస్తాన్‌లోని కోటా నుంచి జైసల్మేర్‌లో జరిగే రాందేవ్రా జాతరకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను బేగన్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

బ్యాంకులకు రూ.2500 కోట్లు బురిడీ

- వరుణ్ ఇండస్ట్రీస్ పార్ట్‌నర్‌ను అరెస్ట్ చేసిన సీబీఐ

న్యూఢిల్లీ : బ్యాంకు రుణాల ఎగవేత కేసులో వరుణ్ ఇండస్ట్రీస్ భాగస్వామి కైలాష్ అగర్వాల్‌ను ఎట్టకేలకు అరెస్ట్ చేసినట్టు సీబీఐ పేర్కొన్నది. కైలాష్, అతని పార్ట్‌నర్ కిరణ్ మెహతా వివిధ బ్యాంకుల నుంచి రూ.2500 కోట్ల రుణాలు అప్పుగా తీసుకున్నారని తెలిపింది. నిందితుల కోసం గత కొంతకాలం నుంచి గాలిస్తున్నామని తెలిపింది. ఈనెల5న ముంబయి విమానాశ్రయంలో కైలాష్‌ను అదుపులోకి తీసుకున్నట్టు సీబీఐ ధ్రువీకరించింది. నిందితున్ని కోర్టులో హాజరుపర్చగా జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. సీబీఐ అధికార ప్రతినిధి ఆర్‌కే గౌర్ తెలిపిన వివరాల ప్రకారం...కైలాష్ అగర్వాల్, కిరణ్ మెహతా జాతీయ బ్యాంకులను బురిడీ కొట్టించి రూ.2500 కోట్ల రూపాయలు అప్పుగా తీసుకున్నారు. అనంతరం దేశం వదిలి పారిపోయారు. కైలాష్‌ను అరెస్ట్ చేయగా కిరణ్ మెహతా కోసం గాలిస్తున్నట్టు గౌర్ తెలిపారు. నిందితులిద్దరిపై చీటింగ్ కేసు నమోదు చేశామన్నారు. నిందితులు 2007 నుంచి 2013 మధ్య కాలంలో ఇండియన్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సిండికేట్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అలహాబాద్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఆర్సిల్ (ఐడీబీఐ బ్యాంక్) తదితర బ్యాంకుల నుంచి రుణాలు పొందినట్టు ప్రాథమిక విచారణలో వెల్లడయిందన్నారు.


జోర్జే అర్రియాజా

లాటిన్ అమెరికానే దెబ్బతీస్తారు

- వెనెజులాతో ట్రంప్ ఆగిపోరు : వెనెజులా విదేశాంగ మంత్రి

కారకాస్ : లాటిన్ అమెరికాలో సంక్షోభం సృష్టించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నిస్తున్నాడని, తద్వారా లాటిన్ అమెరికా దేశాల్లో అస్థిరత ఏర్పడేలా చేయటమే ట్రంప్ లక్ష్యమని వెనెజులా విదేశాంగ మంత్రి జోర్జే అర్రియాజా విమర్శించారు. వెనెజులాపై సైనికచర్యకు దిగుతామని ట్రంప్ బెదిరింపులకు పాల్పడటం వెనుకున్న ఉద్దేశం అదేనని అర్రియాజా ఆగ్రహం వ్యక్తం చేశారు.

బెదిరింపు ధోరణి తో అమెరికా వ్యవహరిస్తున్న తీరును వెనెజులా తిరస్కరిస్తున్నదని అన్నా రు. మానవ హక్కుల పరిరక్షణ పేరుతో సైనిక చర్యకు దిగి...వెనెజులాను ఆక్రమించుకోవటమే అమెరికా లక్ష్యమని అన్నారు. వెనెజులాపై ట్రంప్ చేసిన వ్యాఖ్యల గురించి శనివారం 'జాతీయ టెలివిజన్' ఇంటర్వ్యూలో అర్రియాజా మాట్లాడుతూ..."డొనాల్డ్ ట్రంప్ నిజమైన లక్ష్యం వెనెజులా మాత్రమే కాదు.

మొత్తం లాటిన్ అమెరికా ఖండాన్నే వారు నిప్పుల్లోకి తోసేస్తారు. అస్థిర వాతావరణాన్ని ఏర్పరుస్తారు. ఈ ప్రాంతంలో శాంతి, సుస్థిరతలను దెబ్బతీయటమే అమెరికా నాయకత్వం అసలు లక్ష్య"మని అన్నారు. వెనెజులాపై సైనిక చర్యకు దిగుతామన్న ట్రంప్ వ్యాఖ్యల్ని బ్రెజిల్, అర్జెంటీనా, పరాగ్వే, ఉరుగ్వే సభ్య దేశాల కూటమి తీవ్రంగా ఖండించింది. చర్చలతో, దౌత్యమార్గంలో సమస్యలు పరిష్కరించవ చ్చునని ఈ కూటమి సూచించింది.



నేపాల్ భారీ వర్షాలు, వరదలు

- కొండచరియలు విరిగిపడి 47 మంది మృతి

కాట్మాండ్ : శుక్రవారం నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నేపాల్‌లో కొండచరియలు విరిగిపడి 47 మంది ప్రాణాలు కోల్పోయారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల తాకిడికి ఆగ్నేయ నేపాల్ అతలాకుతలమైంది. 31 వేలమంది తమ స్వస్థలాలను విడిచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. 9 జిల్లాల్లో వరదలు పోటెత్తాయి. మృతుల సంఖ్య మరింత పెరుగొచ్చునని అధికారులు భావిస్తున్నారు.

అమెరికాలో మళ్లీ అహంకార జ్వాలలు


'నయా నాజీ' తరహా ప్రదర్శనను చేపడుతున్న అతివాద శ్వేతజాతీయులు

అసలు..ఎందుకీ ప్రదర్శన ?

స్మారక చిహ్నం రాబర్ట్ ఇ.లీ విగ్రహాన్ని యూనివర్సిటీ ఆఫ్ వర్జీనియా నుంచి తొలగించాలని స్థానిక కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. తాము గర్వకారణంగా భావించే స్మారక చిహ్నాన్ని తొలగించవద్దంటూ శ్వేతజాతి దురహంకారులు 'యునైట్ ద రైట్' పేరిట భారీ ప్రదర్శన చేపట్టారు.

ఇది క్రమంగా యూరోపియన్, ఆఫ్రికన్ వలసదారులపై విద్వేషంగా మారింది. 'అమెరికాను తిరిగిచేజిక్కించుకుందాం' అంటూ నినాదాలు చేశారు. అదే సమయంలో వీరి నిరసనను వ్యతిరేకిస్తూ మరోవర్గం 'అమెరికన్లంతా ఒక్కటే' అనే నినాదంతో ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించింది.

ఫలితంగా రెండు గ్రూపుల మధ్య స్వల్ప స్థాయిలో ఘర్షణ వాతావరణం నెలకొన్నది. ఉద్రిక్త వాతావరణం తగ్గిందనుకున్న సమయంలో కారు ప్రమాదం చోటుచేసుకొని ఒక మహిళ మృతి చెందింది.

- దేశాన్ని చేజిక్కించుకుందామంటూ అతివాద శ్వేతజాతీయుల ర్యాలీ
- వర్జీనియాలో ఘర్షణలు.. ముగ్గురి మృతి
- రణరంగంలా చార్లెట్‌విల్ సిటీ
- ర్యాలీని పర్యవేక్షిస్తూ కూలిన పోలీస్ హెలికాప్టర్

చార్లెట్‌విల్ : అమెరికాలోని వర్జీనియాలో శ్వేతజాతి దురహంకారుల నిరసన ప్రదర్శన హింసాత్మకంగా మారింది. ఆ రాష్ట్రంలోని స్వతంత్ర నగరం చార్లెట్‌విల్‌లో శనివారం అతివాద శ్వేతజాతీయులకు, మరో గ్రూప్‌కు మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. దీంతో అక్కడ ఎమర్జెన్సీ ప్రకటించారు. 'యురోపియన్ వలసవాదుల నుంచి అమెరికాను చేజిక్కించుకుందాం..' అంటూ అతివాదులు నినాదాలు చేయగా, 'అమెరికన్లంతా ఒక్కటే'నని మరో గ్రూప్ తమ గళాన్ని వినిపించారు. శుక్ర, శనివారాల్లో చార్లెంట్‌విల్‌లోని పార్కులు, వీధులు అనుకూల, వ్యతిరేక నినాదాలతో మారుమోగిపోయాయి. ఈ ఘటనను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తోపాటు ఆ దేశానికి చెందిన పలువురు ప్రముఖ నేతలు తీవ్రంగా ఖండించారు.

ట్రంప్‌ను గెలిపించింది అతివాద శ్వేతజాతీయులే..

శ్వేతజాతీయుల నిరసన ర్యాలీకి నేతృత్వం వహించిన వారిలో ప్రముఖుడైన డేవిడ్ డ్యూక్(అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌కు మద్దతుగా ప్రచారం చేశాడు) అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'ట్రంప్.. ఒక్కసారి నీ ము ఖం అద్దంలో చూసుకో. నువ్వు గెలిచింది మా(శ్వేతజాతీయు ల) ఓట్లతోనేకానీ, ఆ మార్క్సిస్టు, లెఫ్టిస్టుల ఓట్లతో కాదన్న విషయం గుర్తుంచుకో' అని అన్నారు.

మనమంతా ఒక్కటే : ట్రంప్

చార్లెట్‌విల్‌లో విద్వేష ప్రదర్శనలు, హింస చోటుచేసుకోవడంపై అమెరికా ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. అధ్యక్షుడు ట్రంప్ శనివారం శ్వేతసౌధంలో మాట్లాడుతూ శాంతిని పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 'విద్వేష దాడులు ఖండిస్తున్నాను. మనమంతా ఒక్కటే. అమెరికన్లలో బేధాలు లేవు. సహనం పాటించండి. శాంతివహించండి..' అని వ్యాఖ్యానించారు.

హెలికాప్టర్ కూలి ఇద్దరు మృతి

ఆందోళనలను జరుగుతున్న ప్రాంతాలలో గగనతలం నుంచి గస్తీ కాస్తోన్న హెలికాప్టర్ ప్రమాదవశాత్తూ కూలిపోయింది. ఈఘటనలో పైలట్‌తోపాటు ఒక అధికారి దుర్మరణంచెందారు. కాగా,ఆందోళనకారులను అదుపుచేయడంలో పోలీసులు నిర్లిప్తత ప్రదర్శించారని పెద్ద ఎత్తున విమర్శలు చెలరేగుతున్నాయి. పరస్పరం రెండు గ్రూపులు ఘర్షణ పడకుండా పోలీసులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోనం దునే పరిస్థితి విషమించిందనే వాదనలు వినిపిస్తున్నాయి.

ర్యాలీలో కారు దాడి

ఘర్షణలు తగ్గుముఖం పట్టే సమయానికి మరో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. పట్టణం నడిబొడ్డున 'మనమంతా ఒక్కటే' అనే ప్రదర్శన చేపట్టిన గ్రూప్‌పైకి ఓ కారు వేగంగా దూసుకొచ్చింది.

విచక్షణారహితంగా అక్కడివారిపైకి తొక్కేసి వెళ్లిపోయింది. ఈ ఘటనలో ఒక మహిళ చనిపోగా, 50 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. దాడికి పాల్పడిన వ్యక్తి అతివాద శ్వేతజాతి బృంద సభ్యుడిని తేలింది. అతడ్ని పోలీసులు అరెస్ట్‌చేశారు.



ఒక్కడే 299 మంది ఆటకట్టించాడు!

హాంకాంగ్ : నేరస్థుల్ని ఆధారాలతో పట్టుకోవడానికి వారి మనిషిలాగే నేర ప్రపంచంలోకి అడుగుపెట్టే పోలీసులకు ఎంతో ధైర్యం కావాలి. వారిలో ఒకరిగా మెదులుతూ ఆధారాలు సేకరించగలగాలి. వారిపై కొంచెం అనుమానం వచ్చినా మాఫియా చేతుల్లో బలి కావాల్సిందే. అంతటి సాహసోపేతమైన పనిని ఇటీవల హాంకాంగ్‌లో ఒక పోలీసు విజయవంతంగా పూర్తిచేశాడు. 11 నెలలపాటు అండర్‌కవర్ ఆపరేషన్‌లో పాల్గొని వందల మంది నేరస్థుల్ని పోలీసులకు పట్టించాడు.




హాంకాంగ్‌లో రౌడీ మాఫియా ఆగడాలు రోజురోజుకి పెరిగిపోతుండటంతో వారిని ఎలాగైన పట్టుకోవాలని అక్కడి పోలీసులు నిర్ణయించుకు న్నారు. ముఖ్యంగా వొ షింగ్ వొ అనే మాఫియాను పట్టుకోవడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఓ పోలీసు ఆఫీసర్ 'అండర్‌కవర్ ఆపరేషన్' చేసేందుకు సిద్ధపడ్డాడు. తన పేరు.. వూరు మార్చుకొని.. కుటుంబం.. బంధువులు.. స్నేహితులతో బంధాలు తెంచుకొని ఒక అనామ కుడిగా అక్కడి నేర ప్రపంచంలోకి అడుగుపెట్టాడు.

అతన్ని ఎవరూ గుర్తుపట్టకూడదని ఆపరేషన్ ప్రారంభానికి ముందే 13కిలోల బరువు తగ్గి సన్నబడ్డాడు. ఎలాగో అలా అక్కడి మాఫియాలో ఒక సభ్యుడిగా చేరాడు. వారిని నమ్మించేందుకు ప్రయత్నం చేశాడు. అయితే.. కొందరు అతడిని చాలా అనుమనించారట. అండర్ కవర్ ఆపరేషన్ నేపథ్యంలో తెరకెక్కిన 'ఇన్‌ఫెర్నల్ ఎఫైర్స్' చిత్రంలోని పాటలు ఆయన ముందు పాడుతూ తను ఎలా స్పందిస్తున్నాడో గమనించేవారట. అయినా ఆ పోలీసు ధైర్యం కోల్పోకుండా ఎంతో చాకచక్యంగా నడుచుకుంటూ ఆ మాఫియా పెద్దలకు తనపై నమ్మకం కలిగేలా చేసుకున్నాడు. ఇందుకోసం ఆ పోలీసుకు 11నెలల సమయం పట్టింది.

తనపై వారికి పూర్తిగా నమ్మకం కలిగిన తర్వాత నెమ్మదిగా మాఫియా స్థావరాలు.. నేరస్థుల నివా సాల వివరాలు సేరించాడు. దీంతో అండర్‌కవర్ ఆపరేషన్ వల్ల పలు మాఫియా గ్రూపులకు చెందిన 299 సభ్యులను పోలీసులు గత సోమవారం అరెస్టు చేయగలిగారు. దీంతో ఆ పోలీసు ఆఫీసర్ రియల్ హీరోగా మారిపోయారు.

ఇండోనేషియాలో భూకంపం



జకార్తా: ఇండోనేషియాలోని సుమత్రా దీవుల్లో ఆదివారం భూకంపం సంభవించింది. భూకంప లేఖినిపై 6.5 తీవ్రత నమోదైంది. అయితే ఎటువంటి సునామీ హెచ్చరికలు జారీచేయలేదని యూఎస్ జియోలాజికల్ సర్వే అధికారులు తెలిపారు. ప్రాణ, ఆస్తి నష్టం సంభవించినట్టు సమాచారం రాలేదు. బెంగ్‌కులు ప్రాంతానికి 73 కిమీ దూరంలో 35కి.మీ లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. సుమత్రా దీవుల్లో సంభవించిన భూకంపం కారణంగా సింగపూర్‌లోనూ అక్కడకక్కడా ప్రకంపనలు వచ్చాయి. దాంతో ప్రజలందరూ ఇండ్లలోంచి బయటకు పరుగులు తీశారు. ఈ విషయాన్ని పలువురు ట్విటర్ ద్వారా తెలియజేశారు.

'ఒక్కసారిగా ప్రకంపనలు రావడంతో నేను నా ఏడు నెలల మనవడిని తీసుకొని బయటకు పరిగెత్తాను. నాతో పాటు చుట్టుపక్కల ఇండ్లల్లోని ప్రజలు కూడా బయటకు పరుగులు పెట్టారు' అని ప్రత్యక్ష సాక్షి హసన్ తెలిపారు. గతేడాది డిసెంబరులో ఇండోనేషియాలోని ఏస్ ప్రావిన్స్‌లో సంభవించిన భూకంపం కారణంగా దాదాపు 100 మంది ప్రాణాలు కోల్పోగా.. వేల సంఖ్యలో ప్రజలు ఇండ్లను కోల్పోయి నిరాశ్రయులయ్యారు.

రాష్ట్రంలో ఫ్యామిలీ ప్యాక్ పాలన

అసైన్డ్ భూములు లాక్కుంటున్న టీఆర్ఎస్

- కొనసాగుతున్న కుల బహిష్కరణలు
- నేరేళ్ల ఘటనలో ఎస్పీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి
- టీ-మాస్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు


వేదికపై అభివాదం చేస్తున్న టీ-మాస్ ఫోరం నాయకులు

నవతెలంగాణ - సంగారెడ్డి ప్రతినిధి

ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కుటుంబంలోని నలుగురి వ్యక్తులతో తెలంగాణ పాలన సాగుతోందని, ఇది కేసీఆర్ ఫ్యామిలీ ప్యాక్ పాలన అని టీ-మాస్ ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు విమర్శించారు. ప్రభుత్వ ఆధీనంలో, కబ్జాదారుల చెరలో ఉన్న భూములను పేదలకు ఇవ్వాల్సింది పోయి ప్రాజెక్టుల పేరుతో అసైన్డ్ భూములు లాక్కుంటున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని బాలాజీ గార్డెన్‌లో సామాజిక ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వ ర్యంలో టీమాస్ ఫోరం జిల్లా ఆవిర్భావ సదస్సు ఆదివారం జరిగింది. ఇందులో 185 ప్రజాసంఘాలు పాల్గొన్నాయి. అంతకు ముందు సంగారెడ్డిలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్టీరింగ్ కమిటీ సభ్యులు గద్దర్ మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రివర్గంలో ఒక్క మహిళ కూడా లేదని, బంగారు తెలంగాణలో మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా అని కేసీఆర్‌ను ప్రశ్నించారు. ప్రజాసమస్యలపై రెండొందలకు పైగా సంఘాలు ఒకే వేదికపైకి వచ్చాయని, వారంతా తమ లక్ష్యం నెరవేరే వరకూ పోరాడాలని సూచించారు. పసిపిల్లలను చంపిన హంతక ప్రభుత్వం ఉత్తరప్రదేశ్‌ను పాలిస్తోందన్నారు. జర్నలిస్టులు రాత్రనకా, పగలనకా కష్టపడుతున్నారని, వారి జీవనం రోజురోజుకూ దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్త చేశారు. టీమాస్ అధికారంలోకి వస్తే జర్నలిస్టుల కనీస వేతనం రూ.30వేలు ఇస్తామన్నారు. ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ మాట్లాడుతూ పుట్టిన రోజు, శుభకార్యాల్లో బంగారం, నగదుకు బదులు రాజ్యాంగాన్ని బహుమతిగా ఇవ్వాలని, తద్వారా రాజ్యాధికారం ఎలా వస్తుందో, సామా జిక హక్కులు ఏమిటో తెలుసుకోవచ్చన్నారు. స్టీరింగ్ కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ...ప్రభుత్వం ప్రాజెక్టుల పేరు చెప్పి అసైన్డ్ భూములను లాక్కుంటోందన్నారు. ఇది చట్ట ప్రకారం చెల్లదన్నారు. ప్రతి రోజూ కోదండరామ్‌ను అరెస్ట్ చేస్తున్నారని, ఆయన చేసిన అసాంఘిక కార్యకలాపాలేంటని ప్రశ్నించారు. సంగారెడ్డి జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందని, కానీ సమస్యలు అలాగే కొనసాగుతున్నాయ న్నారు. నేరెళ్ల ఘటనలో కిందిస్థాయి ఎస్ఐని సస్పెండ్ చేశారని, ఆ జిల్లా ఎస్పీపైనా ఎస్సీ, ఎస్టీ అట్రా సిటీ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు.. టీఆర్ఎస్ పాలనలో కులదురహంకార హత్యలు పెరిగాయన్నారు. ఎంబీసీలకు బడ్జెట్ కేటాయిస్తామన్న ప్రభుత్వం ఇంతవరకు ఎవరు ఎంబీసీలనేది వివరణినివ్వలేదని చెప్పారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక గోరక్షణ పేరుతో దాడులు పెచ్చరిల్లుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సరళీకరణ, ప్రయివేటీకరణ విధానాల వల్ల కార్మికులు, రైతులు తీవ్రస్థాయిలో నష్టపోతున్నారని వాపోయారు. స్టీరింగ్ కమిటీ సభ్యులు, జేబీ రాజు మాట్లాడుతూ.. కేసీఆర్ ఒక్కరి వల్లే తెలంగాణ రాష్ట్రం రాలేదని, ఆయన ఉద్యమాన్ని తన చేతుల్లోకి తీసుకుని పేరు తెచ్చుకున్నారని చెప్పారు. స్టీరింగ్ కమిటీ సభ్యులు జాన్‌వెస్లీ మాట్లాడుతూ అన్ని జిల్లా, మండలాల్లో టీమాస్ ఫోరం కమిటీలు వేస్తున్నట్టు చెప్పారు. వివిధ వర్గాల వారికి న్యాయం జరిగే వరకూ కలిసే పోరాడుతామని స్పష్టం చేశారు.

జనాన్ని కదిలించాలి

అలాంటి సమస్యలు గుర్తించండి :

కార్యకర్తలకు రాఘవులు సూచన

- పట్టణ అభివృద్ధిపై ప్రభుత్వ విధానం ప్రకటించాలి


మాట్లాడుతున్న సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పట్టణాల్లో జనాన్ని కదిలించే సమ స్యలను గుర్తించాలని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యుడు బివి రాఘవులు సూచించారు. ఆదివారం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పట్టణాల్లో పనిపై వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో 38 శాతం పట్టణాల్లో నివసిస్తున్నారని చెప్పారు. నిరుపేదలుండే మురికివాడలు, ఎగువ మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి, సంపన్నుల వారీగా విభజించి సమస్యలను అధ్యయనం చేయాలని సూచించారు. సామాజిక తరగతుల ఆధారంగా మైనార్టీలు, దళితులు, వెనుకబడిన తరగతులు ఇలా వారి వృత్తులు, ఇతర పనివిధానం ఆధారంగా వారి జీవన స్థితిగతులను పరిశీలించాలని కోరారు. క్షేత్రస్థాయిలో జనం ఎదుర్కొనే సమస్యలను గుర్తించాలని, అవి పరిష్కారమయ్యేలా పోరాట రూపాన్ని తీసుకోవాలని సూచించారు. సమస్యలను గుర్తించడంలోనే ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. నివాస ప్రాంతాల్లో వివిధ వృత్తులు చేసుకునే వారిని సంఘటితం చేయాలన్నారు. సాంస్కృతికంగా వారి జీవన పద్ధతులను పరిశీలించాలని కోరారు. ప్రత్యామ్నాయ సంస్కృతిని పెంచడానికి కృషి చేయాలన్నారు. వినాయకచవితి సందర్భంగా భక్తి ఉండే వారి కోసం మట్టి వినాయకులను పెట్టి పర్యావరణం, కాలుష్యం గురించి అవగాహన కలిగించాలని సూచించారు. పట్టణ జనాభా పెరుగుదలలో వేగం పుంజుకుందని చెప్పారు. అయినా తెలంగాణ ప్రభుత్వం పట్టణ అభివృద్ధిపై స్పష్టమైన విధానం ప్రకటించలేదని అన్నారు. రకరకాల పథకాలు ప్రకటించడం తప్ప పట్టణ జనాభాను ఆదుకునే ప్రయత్నం చేయలేదన్నారు. పెరుగుతున్న మురికివాడల సంఖ్య, అసంఘటిత కార్మికుల సమస్యలు, ప్రజల కష్టసుఖాలను పట్టించుకోవడం లేదని చెప్పారు. పట్టణాల్లో జనాభా పెరుగుతున్నది కానీ మౌలిక సదుపాయాలు కుదించుకుపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణ అభివృద్ధిపై తెలంగాణ ప్రభుత్వం పట్టణ విధానం ప్రకటించాలని డిమాండ్ చేశారు. విధాన రూపకల్పనకు అందరితో చర్చించాలని సూచించారు. కానీ పాలకులు మూసి అభివృద్ధి అంటున్నారని చెప్పారు. ఇది చాలా కాలంగా సమస్య ఉందన్నారు. మూసీ అభివృద్ధి చేయొచ్చని, అంతకంటే ముఖ్యంగా ప్రజలకు మౌలికమైన, ప్రధానమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. మురికివాడలు, పేదలు నివసించే ప్రాంతాలు, అసంఘటిత కార్మికులు, చిన్న వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరించడంపై దృష్టిపెట్టాలని చెప్పారు. నోట్ల రద్దు, జీఎస్టీ, స్మార్ట్ సిటీ పథకం వల్ల మురికివాడలు, పేదలు నివసించే ప్రాంతాల్లోని సమస్యలు అశ్రద్ధకు గురవుతున్నాయని అన్నారు. పట్టణ ప్రజల సమస్యలమీద సీపీ(ఐ)ఎం ప్రత్యేకంగా చర్చించి విధాన పత్రం రూపొందిస్తుందని చెప్పారు. సమస్యల పరిష్కారానికి కార్యక్రమం రూపొందిస్తుందని అన్నారు. ప్రభుత్వానికి సూచనలు తెలియజేస్తామని చెప్పారు. ప్రభుత్వ స్పందనను బట్టి పరిష్కరించకపోతే పోరాట కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డిజి నర్సింహారావు మాట్లాడుతూ పట్టణాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, తాగునీటి సమస్య, బస్టాండ్ల వద్ద మౌలిక వసతులు, పర్యావరణ సమస్యలపై అధ్యయనం చేయాలని కోరారు. రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, నిజమైన లబ్ధిదారులకు అం దుతున్నాయా? లేదా చూడాలన్నారు. స్థానికంగా పౌర సమస్యలు, విద్యా వైద్యం వంటి సమస్యలపై పనిచేస్తున్న ఇతర సంఘాలతో కలిసి పనిచేయాలని కోరారు. సీపీఐ(ఎం) హైదరాబాద్ నగర కమిటీ కార్యదర్శి ఎం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు జి.రావు తదితరులు పాల్గొన్నారు.

కోదండరామ్ దేశద్రోహి కాదు : రాఘవులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమావేశంలో పాల్గొనడానికి వెళ్తున్న కోదండరామ్‌ను అర్ధంతరంగా అరెస్టు చేసి హైదరాబాద్‌కు తరలించడం అన్యాయమని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు బివి రాఘవులు విమర్శించారు. ఆయన దేశద్రోహి కాదని, సంఘవ్యతిరేక శక్తి కాదని తనను కలిసిన విలేకరులతో ఆదివారం హైదరాబాద్‌లో చెప్పారు. ఆయనకు ప్రజాస్వామిక హక్కుందని అన్నారు. ప్రజాసమస్యల మీద ఈమధ్య అనేక చోట్ల కృషి చేస్తున్నారని చెప్పారు. అలాంటి వారు చెప్పినదాంట్లో న్యాయముంటే ప్రభుత్వం పరిష్కరించాలని సూచించారు. ప్రజాతంత్ర హక్కులను కాలరాయడం గర్హనీయమని విమర్శించారు. కోదండరామ్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం మేల్కోవాలని సూచించారు. ప్రాథమిక, ప్రజాస్వామిక హక్కులను కాలరాయడం పాలకులకు ఆనవాయితీగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ శక్తులను, నిరసన వ్యక్తం చేసే వారిని నివారించాలి, అరెస్టు చేసి నోరు నొక్కాలని ప్రయత్నిస్తే టీఆర్ఎస్ పార్టీ, తెలంగాణ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లిం చుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాంటి స్థితి తెచ్చుకోవద్దని సూచించారు. ప్రజాస్వామ్యంలో అందరికీ స్వేచ్ఛగా మాట్లాడేలా అనుమ తించాలని కోరారు. తప్పుంటే విమర్శించాలనీ, ఒప్పుంటే సరిదిద్దుకోవాలనీ అనే వైఖరి టీఆర్ఎస్ నాయకులు తీసుకోవాలని సూచించారు.

ఇంటర్ బోర్డుకు బెస్ట్ డిజిటల్ అవార్డు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ఇంటర్ బోర్డుకు బెస్ట్ డిజిటల్ ఇనిషియేటివ్ ఇన్ గవర్నమెంట్ అవార్డు లభించింది. ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎ అశోక్ ఢిల్లీలో జరిగిన వరల్డ్ ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో శ్రీలంక విద్యాశాఖ మంత్రి వివిస్ రాధాకృష్ణన్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ మేరకు ఆదివారం అశోక్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ విద్యాసంవత్సరంలో ఆన్‌లైన్ అఫిలియేషన్ విధానాన్ని ప్రవేశపెట్టామని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే ఆన్‌లైన్‌లోనే అనుబంధ గుర్తింపు జారీ చేస్తామని పేర్కొన్నారు. జియో ట్యాగింగ్ ద్వారా పరీక్షలు అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పరీక్షల మూల్యాంకనాన్ని ఆధార్ ఆధారంగా చేపడుతున్నామని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా షార్ట్ టర్మ్ ఒకేషనల్ కోర్సులను ప్రవేశపెట్టామని తెలిపారు. కాలేజీలకు, విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా మెరుగైన సేవలు అందించడం కోసం కృషి చేస్తున్న ఇంటర్ బోర్డుకు ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-మల్లాపూర్

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేం ద్రంలో ఆదివారం జరిగింది. పోలీసులు వివరాల ప్రకారం...గుజ్జుల కాసిం (48) తన మూడెకరాల్లో వ్యవసాయం చేసుకుని కుటుంబాన్ని పోషించు కునేవాడు. గతంలో కూతురు పెండ్లికి రూ. ఐదు లక్షల అప్పు చేశాడు. కొడుకును ఉపాధి నిమిత్తం ఆరు నెలల కిందట అప్పు చేసి గల్ఫ్‌దేశానికి పంపించాడు. అక్కడ పనిలేక వెంటనే తిరిగి స్వగ్రామానికి వచ్చాడు. సాగు, కుటుంబ అవసరాల నిమిత్తం చేసిన అప్పులు రూ.10లక్షల వరకు ఉన్నాయి. ఒకవైపు వర్షాల్లేక, పంటలు ఎదగక అప్పులు తీర్చలేనని మనస్తాపానికి గురైన కాసిం తన చేనులోనే పురుగుల మందుతాగాడు.

జన జీవనంతో మమేకమవ్వాలి

"సార్, ఎవరు సార్ మీరు! ఇదిగోండి సార్ నా దెబ్బలు కనపడకుండ వున్నయి సార్. ఒక్క రెండు నిమిషాలు కూడా నిలబడలేకపోతున్నా సార్, నేను బి.కాం కంప్యూటర్స్ చేశాను సార్. ఇంటి దగ్గర చిన్న కూతురుంది సార్. లారీ తగలబెట్టిన సంఘటనకూ నాకూ ఏ సంబంధమూ లేదు సార్. ఒట్టు సార్! నేను ఇక ఏ పనీ చేయలేనేమో సార్, ఎలాగైనా మా పిల్లలకు నాకు సాయం జరిగేలా, న్యాయం అందేలా చూడండి సార్" అంటూ గుండెల నుండి ఉప్పొంగి వస్తున్న కన్నీళ్ళతో పాతిక సంవత్సరాల కోలా హరీష్ వేడుకుంటున్న తీరు చూస్తున్న నాకు కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. గాయపడిన వారిని పరామర్శించి, వారి గాయాల గురించి అడుగుతుంటే వాళ్ళు మాత్రం వారి మొత్తం జీవితాల గురించే వివరించారు.

నేరెళ్ళ మాజీ సర్పంచ్ దానయ్య మాట్లాడుతూ "ఇదిగోండి సార్, నా చాతీపై నల్లగా కమిలిన భాగమంతా ఎస్సీ బూటుకాలు పెట్టి ఎట్ల తన్నాడో చూడండి, నడుము దగ్గర వడిలిన గాయం ఎలా పుండులా మారిందో చూడండి. నీళ్ళు పోసుకుంటూ, గోలీలు వేస్తూ, రాత్రి పది, పదకొండు గంటల నుండి తెల్లారి నాలిగింటి దాకా కొడతనే ఉన్నరు సార్! టైరు బెల్టుతో, చెప్పులతో పద్దెనిమిది మంది పోలీసులు మూడు రోజులూ కొట్టారు. ఇనుపనట్లు బిగించీ కొట్టారు. అంతేకాద్సార్, మాదిగ లంజకొడుకులారా అని తిడ్తూ కొట్టారు సార్" అని ఏడుస్తూ ఆయన చెబుతున్నది వింటుంటే ఒళ్ళంతా గగుర్పొడిచింది. తీవ్ర ఆవేదన మొదలయింది.

"సార్, నా పొత్తికడుపుకూ, మర్మాంగానికి కరెంటు పెట్టి చిత్రవధకు గురిచేశారు సార్, తీవ్రవాదులని చెప్పి ఎన్‌కౌంటర్ చేసేస్తా కొడుకుల్లారా! అంటూ బూతులు తిడుతూ గొడ్డును కొట్టినట్టు కొట్టారు సార్" అని గంధం గోపాల్ చెపుతుంటే ఎక్కడున్నాం మనం అనే అనుమానం వచ్చింది. ఇంకా ఈశ్వర్, మహేశ్, రామచంద్ర వీళ్ళందరూ ఆ నరకయాతనను కళ్ళకు కట్టినట్టు చెప్పారు. ఇంత బాధ కన్నా ఒకేసారి ఉరివేస్తే బాగుండనిపించిందని, ఎవరో ఒకరు వచ్చి కాపాడ్తరని ఎంతో ఎదురు చూశామని వారి గుండెల్లో వున్న బాధనంతా మా ముందు కుమ్మరించారు. 'మీ పెళ్ళాలను వేశ్యల కింద కేసులు బుక్ చేస్తామని' బెదిరిస్తూ ఎందుకూ పనికిరాని విధంగా జీవచ్ఛవాలుగా మమ్మల్ని చేశార"ని మా ముందు బాధితులు దు:ఖించారు.

ఈ నెల ఆరున తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో కవులు, రచయితలు, కళాకారులు కలిసి నేరెళ్ళ బాధితులను ఓదార్చి, మానసిక ధైర్యాన్ని ఇచ్చేందుకని వేములవాడకు వెళ్ళాం. నేరెళ్ళలో జరుగుతున్న ఇసుక వ్యాపారం, లారీల రద్దీ, అందులో వున్న లాభాల వేట, అవినీతి, బంధుప్రీతి, రాజకీయాలూ వాటి పర్యవసానాలూ వేటినీ అంటుకోకుండానే అక్కడ సామాన్యులు అన్యాయానికి గురయ్యారని, మానవ హక్కులు హరించబడ్డాయని, ప్రజాస్వామిక హక్కులు కాలరాయబడ్డాయని, దళితులు, వెనుకబడిన వర్గాల ప్రజలు దు:ఖంలో మునిగారని, వారిని ఓదార్చి, కన్నీళ్ళను తుడిచి వద్దామని ఇరవై మందిమి బృందంగా వెళ్ళాము. ఆ ఎనిమిది మంది వెనకాల వున్న కుటుంబాలు, పెళ్ళాంపిల్లలు, తల్లులు, తండ్రులు పడుతున్న వేదన అక్షరాలకు అందేట్టులా లేదు. ఒక భయంకర బీభత్స నియంతృత్వ సంఘటనగా దాన్ని పేర్కొనవచ్చు. ఇలాంటి సంఘటన ఇప్పుడు, ఆత్మాభిమానం కోసం వేయిమంది ప్రాణత్యాగం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న నేలపై జరగడం ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన విషయం. అంతకంటే ఘోరమైన, దారుణమైన విషయమేమంటే ఇది చాలా చిన్న విషయమని, ఇంతకంటే ఘోరాలు ఇంతకుముందు చాలా జరిగాయని, ఇందులో దళితకోణం లేదని చెప్పి బాధించినవారిని వెనకేసుకురావడం.

ఇసుక లారీలు వారి ఊరి గుండా ఎడతెరపి లేకుండా తిరగడం వల్ల నేరెళ్ళ ప్రజలు నానా ఇబ్బందులూ పడుతున్నారు. అనారోగ్యాల పాలవుతున్నారు. లారీలు ఢీ కొట్టి అనేకమంది మరణించారు. లారీలు గుద్దిపోతే ఇంత వరకు పట్టించుకున్న నాధులూ లేరు. ఇవన్నీ ఎప్పటి నుండో భరిస్తున్న ఊరిజనం కోపంతో ఇసుక లారీని ఒకదాన్ని తగులబెట్టారు. ఇదీ సంఘటన. తగులబెడితే ఊరుకుంటారా? అని అడగొచ్చు. మరి ప్రాణాలు తీస్తే, ప్రాణాలు పోతే చూస్తూ వుంటారా? అయితే కేసులు పెట్టు. ఇంత అనాగరిక చిత్రహింసలేంటి?



నేరెళ్ళ ఘటనలో బాధితులని పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న తెలంగాణ సాహితీ నాయకులు భూపతి వెంకటేశ్వర్లు, రాంపల్లి రమేష్, కె.ఆనందాచారి తదితరులు

కొంతమంది అలగాజనాన్ని ఎంచుకుని భయకంపితుల్ని చేసి ఇదొక మచ్చుతునకలా వుండాలని భావించి, దాని ఫలితమే ఈ హింస అనుకోవచ్చు. ఇందులో కీలకమైన ఆర్థికాంశ ప్రధానమైనది, ఇసుక వ్యాపారం, లారీల ప్రయాణం ఆగిపోతే అక్కడి వ్యాపారులకు, వారిపై ఆధారపడేవారికి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. అందుకే ఇలాంటి తిరుగుబాట్లు మళ్ళీ రాకుండా తీవ్రంగా ప్రవర్తించారని భావించవచ్చు.

ఇక ఇందులో దళిత కోణం లేదని వాదిస్తున్నారు. దళితులు చిత్రహింసలకు గురైన వాళ్ళలో వున్నారు. కులం పేరుతో కూడా దూషించబడ్డారు. వాళ్ళే సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడీ వున్నారు. ఈ వాదనలో వున్న దుర్మార్గమేమంటే దళితులు కాకుంటే ఎంత క్రూరంగానైనా హింసించవచ్చా? ఎవరి ప్రజాస్వామిక, ఎవ్వరి మానవ హక్కులైనా హరించకూడదు. భార్యలపై వేశ్యానేరం మోపుతామని బెదిరించడం ఎంత దుర్మార్గమైన చర్య. దళిత, వెనుకబడిన వర్గాల వారు కాబట్టే అలా మాట్లాడగలిగారు. బాధితులంతా చిన్న చిన్న వ్యవసాయ దారులు, శ్రామికులు. నేడు వీరి పక్షం వహిస్తున్న వారికి రాజకీయాలు అంటగట్టవచ్చునేమో గానీ, అధికారం ఎవరిపక్షం వహిస్తున్నదనేది ముఖ్యాంశం.

మానవ విలువలు వున్న ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన విషయమిది. మానవతా హృదయమున్న ప్రతి మనిషినీ కదిలించే సంఘటన ఇది. మానవ విలువలకు విఘాతం ఎక్కడ జరిగినా, అమానుషత్వం ఎక్కడ తలెత్తినా రచయిత, కవి కలం కదలకుండా ఉండగలదా? ఉండలేదు. అందుకనే వారి కన్నీటిని తుడిచాం. మీకు జరిగిన అన్యాయాన్ని లోకానికి చాటుతామని వాళ్ళకు మాటిచ్చాం.

ఇంతటితో మా పని అయిపోలేదు. అన్యాయానికి గురౌతున్న వాళ్ళ గుండెకు గుండెను చేర్చగల చైతన్యాన్ని ఇంకా రాజేయాల్సిన అవసరం పెరుగుతున్నది. దుర్మార్గం జరిగినప్పుడు గొంతు విప్పకుండా మౌనంగా ఉండడమంటే దాన్ని సమర్థించడమే అవుతుంది.

రచయితకూ, కళాకారుడికి మానవీయ సమాజ నిర్మాణమే ధ్యేయం. ఆ ప్రయాణానికి, లక్ష్యానికి ఏ ఆటంకమెదురైనా గొంతులు విప్పుతూనే ఉండాలి. ఈ రోజు వాళ్ళకు జరిగిన అన్యాయమే రేపు మన వైపుకూ ఎక్కుపెట్టబడుతుంది. ఎంతో చైతన్యానికి వారసులంగా వున్న తెలంగాణ సమాజంలోని రచయితలందరూ ప్రతిస్పందించాలి.

రచయితలే కాదు, సమాజంలోని ప్రతి సమూహం తమకెందుకులే అనే భావన నుండి బయటపడి నిస్సహాయులకు, దు:ఖితులకు భరోసాగా నిలవాలి. వారికి న్యాయం జరగాలి. మరోసారి ఇలాంటి ఘోరం జరగకుండా కాపు కాయాలి.

ఈ ప్రత్యక్ష పరామర్శ పర్యటన వల్ల కవులకు, రచయితలకు మరో మారు తెలిసొచ్చిన విషయమేమంటే రచనల్లో వుండే జీవితాలకన్నా వాస్తవిక జీవన చిత్రం, వాస్తవిక హింస ఎంతో భయానకంగా వుందని హృదయ విదారకంగా వుందని అవగతమౌతుంది. అందుకనే జన జీవనంతో కవి మమేకమవ్వాలి. కలం అప్పుడే పదునుదేరుతుంది. కర్తవ్యం బోధపడుతుంది.

కుల దురహంకారం, మత మౌఢ్యం పెరుగుతున్న సంఘటనలు మనం గమనిస్తున్నాం. అంతే కాకుండా నియంతృత్వ పోకడలూ పెరుగుతున్నాయి. ఇవన్నీ రచయితకూ, స్వేచ్ఛకు శత్రువు వంటివి. అందుకనే వీటిని తీవ్రంగా ఖండిస్తున్నాం. బాధితులకు నైతిక మద్దతును తెలుపుతున్నాం. బాధ్యతగల కవులూ, కళాకారులూ నేరెళ్ళ బాధితుల పక్షాన గొంతు విప్పాలని కోరుతున్నాం.

– కె.ఆనందాచారి, 9948787660

అక్షర సేనాని

అతడు....
నిరంతరం కవితా సేద్యాన్ని
పండించే కవి
కాలాన్ని నిద్రపోకుండా చేసే
కవితారవి
కలానికి విశ్రాంతి లేకుండా
కాలంతో పయనించే కవి

అతని కంటికి
ఏ వస్తువు తగలినా
అది కవిత్వమై వెలగాల్సిందే
అతని కలానికి అందనిది ఏదైనా
అది సాహిత్యమై వికసించాల్సిందే

కవిత్వమే శ్వాసగా
బతుకుతున్నవాడు
కవిత్వమే ప్రపంచమని
నమ్మినవాడు

కాలంతో పరుగెడుతూ
పచ్చని కవిత్వాన్ని ఆవిష్కరిస్తున్నాడు
ఎన్ని కవితలు రాసినా
తడి ఆరని కవిత్వం
అతని సొంతం
ఎన్ని కావ్యాలు వెలువరించినా
తీరని దాహం అతని కవిత్వం

కవిత్వమై ఎదిగినవాడు
కవిత్వమై బతుకుతున్నవాడు
కలంతో కరచాలనం చేస్తూ
కొత్త పాదులను వేస్తున్నవాడు
మట్టికి, ఆకాశానికి వంతెన వేసి
కవితను శిఖరాయమానం
చేసినవాడు

నిత్యం పెదవిపై చిరునవ్వును
మొలిపించే కవితా వర్షం అతడు
కవిత్వంలో ఆర్ద్రత
ముఖంలో తాదాత్మ్యత
అతడి సొంతం

ఏ వస్తువైనా... ఏ దృశ్యమైనా
అతని కవిత్వంలో ఒదిగి
పోవాల్సిందే
వస్తువు అతడికి నిత్యనూతనం
దృశ్యం అతడికి అక్షరనైవేద్యం

అతడి కంటికి
తాకని వస్తువు లేదు
రాయని కవిత్వం లేదు
అది అణువు కావచ్చు
పరమాణువు కావచ్చు

అది ఏదైనా ఆకాశమంతా కవిత్వం
మట్టి మనిషంతా స్వచ్ఛం
చీకటిదారులను వెతికే వెలుగు
అతని కవిత్వం
గడ్డిపరకలో లాలిత్యాన్ని చూసే
చూపు అతడి కవిత్వం
అందుకే.....
అది కవిత్వమై ప్రకాశించింది
అతడు కవియై వెలుగొందాడు

(డా॥ఎన్.గోపి గారికి అభివందనాలతో)

– డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, 9032844017

దర్వాజ పేజీపై మీ అభిప్రాయాలను, సూచనలను, సలహాలను, రచనలను darwajapage@ gmail.com కు పంపించగలరు. చిరునామా : దర్వాజ, నవతెలంగాణ, ప్లాట్‌నెం. 21/1, అజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్– 500020

పోతుకూచి సాహిత్య కృషి ఆదర్శప్రాయం

ఎక్కడో గోదావరి జిల్లాలోని ఆలమూరు పల్లెటూళ్ళో పుట్టి (1925, జనవరి 27) బి.ఎ.బిఎల్. చదివి కార్మిక మంత్రి వద్ద స్టెనోగా పనిచేస్తూ, లేబర్ కోర్టులోను ఉద్యోగం చేసి 1950 ప్రాంతం నుండి బోయిగూడ – హైదరాబాద్‌లో నివసించి, సాహిత్యాభిలాషతో వివాహం కూడా చేసుకోకుండా బ్రహ్మచారిగానే జీవించి గత ఆదివారం 6వ తేదీ, ఆగస్టున క(పె)న్ను మూసిన డాక్టర్ పోతుకూచి సాంబశివరావు (92) మన కాలం గొప్ప సాహిత్యవేత్త. గొప్ప నాటకకర్త. రచయిత, కవి. 1960లో ఆంధ్రపత్రిక నవలల పోటీలో ఆయన రాసిన "ఉదయ కిరణాలు" నవలకు ప్రథమ బహుమతి వచ్చింది. రెండవ నవలగా హైదరాబాద్ పరిసర ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించే "అన్వేషణ"నవల, ఆ క్రమంలో చలమయ్య షష్టిపూర్తి, ఏడు రోజుల మజిలి, జీవనయానం లాంటి నవలలు డా॥ పోతుకూచి రాశారు. 1958లో నవ్య సాహితి సంస్థ కార్యదర్శిగా పనిచేస్తున్న కాలంలో పోతుకూచి తొట్టతొలిగా సినారె రాసిన తొలి గ్రంథం "నవ్వని పువ్వు"ను ఉత్తమ గ్రంథ పురస్కారంతో రూ. 116/– నగదులో సత్కరించారని ఓ సభలో సి.నా.రే.నే చెప్పారు. కథా రచయితగా దాదాపు 300 కథలు రాసిన పోతుకూచి 'కలిసుంటే కలదు సుఖం', 'తండ్రీ కొడుకులు' వంటి సినిమా వెండితెర నవలలూ రాశారు.



1962లో విశ్వసాహితి సంస్థ – విశ్వ రచన పక్ష పత్రిక స్థాపించడమే గాక, నాటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి సంజీవయ్య, బూర్గుల రామకృష్ణారావు, బెజవాడ గోపాలరెడ్డిలాంటి హేమాహేమీల్ని హైదరాబాద్‌కు రప్పించి అఖిల భారత తెలుగు రచయితల మహాసభల్ని పెద్ద ఎత్తున నిర్వహించిన దీక్షాదక్షుడు డా॥ పోతుకూచి. ఆ సభల్ని తిరుపతి, రాజమండ్రి, విశాఖపట్నం, హైదరాబాద్‌లలో ఏర్పాటు చేయడం, శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి, చలం, శ్రీపాద, విశ్వనాథుల్ని ఆహ్వానించడం, ఔత్సాహికుల్ని ప్రోత్సహించడం 'పోతుకూచి' వ్యాపకంగా సాగింది. ప్రాంతాలుగా, పార్టీ భజన సంఘాలుగా, వ్యక్తి సంఘాలుగా, కార్పొరేట్ కల్చరల్ సంస్థలున్న నేటి కాలంలో విశ్వసాహితి ఓ దిక్సూచి.

ఆయన రచనలు ఆంగ్లం, రష్యన్, జపాన్, హిందీ, జర్మనీ, కన్నడ, తమిళ భాషల్లో అనువాదాలయ్యాయి. ఆయన రాసిన 'హంతకులు' నాటకం ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు అందుకుంది. పల్లె కదిలింది, దొంగ దొర, ఏడు సున్నాలు, ఇది తంతు, పెళ్ళి పిలుపు, ప్రతిధ్వనులు... నాటకాలు నాటక కర్తగా ప్రఖ్యాతి నొందేలా చేశాయి. కేంద్ర సాహిత్య అకాడమీకి 20 సం॥లు తెలుగు సలహా సంఘ సభ్యులుగా పనిచేశారు పోతుకూచి. ఎన్నో సెమినార్లు, సదస్సులు, శిక్షణా శిబిరాలు, పలు పోటీలు... సంగీత, సాహిత్య, నృత్య, గాన కళా పోటీలు నిర్వహించారు. ఔత్సాహికుల్ని ప్రోత్సహించారు. 2017 ఆగస్టు 2వ తేదీ గానసభలో తన ఆత్మకథా తరంగాలు మొదటి భాగం ఆవిష్కరింపచేశారు. ప్రఖ్యాత సినీ దర్శకుడు గోపాలకృష్ణ ఆయనపై డాక్యుమెంటరీ నిర్మించే యత్నాలు జరుపుతున్న వేళ పోతుకూచి మృతి చెందారు. భోపాల్ కేంద్రంగా అఖిల భారతీయ భాషా సమ్మేళన్ సంస్థకు దక్షిణ భారత కో–ఆర్డినేటర్‌గా వున్న పోతుకూచి ఆ సంస్థ ద్వారా ఎన్నో సభలు దేశం అంతా నిర్వహించారు. ఆయన నాటకాలపై ఎస్. విజయభాస్కర్, ఆయన రచనలపై వెంకటేశ్వర్లు (వరంగల్) పి.హెచ్.డి.లు చేశారు. విజయలక్ష్మి ఎం.ఫిల్. చేసింది. దాదాపు 7 దశాబ్దాలుగా సారస్వత సేవ చేశారు డా॥ పోతుకూచి.


యువజన కాంగ్రెస్ కార్యకర్తగా, ప్రకాశంగారి అనుచరుడిగా ఎదిగిన పోతుకూచి పల్లవాధరరావు రాసిన 'ఆత్మార్పణ' నాటకంలో రైతు పాత్రలో అద్భుతంగా నటించి గాంధీగారి ప్రశంసలొందారు (మద్రాస్‌లో). 1975 ప్రపంచ తెలుగు మహాసభలకు సంధానకర్తగా పోతుకూచి పనిచేశారు. ఆ సభకు తెలుగు కవులందర్నీ ఆహ్వానించారు. 90 సంవత్సరాల వయస్సులోను త్యాగరాయ గానసభ, సుందరయ్య విజ్ఞానకేంద్రం, శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం, రవీంద్రభారతిలలో కార్యక్రమాలు చేస్తూ... ఔత్సాహికుల్ని ప్రోత్సహించడం, ద్విభాషా పత్రికలు, యునిలిట్, విశ్వ రచన పత్రికలు నిర్వహించడం సాహిత్యకృషికి నిదర్శనం. ఔత్సాహిక కవుల్ని ప్రోత్సహించి వారికి 'వేదిక' కల్పించడం, వారి రచనలు అచ్చువేయడం, జిల్లా, రాష్ట్ర స్థాయి సభలు జరపడం... లాంటి సాహితీ – సాంస్కృతిక కార్యక్రమాలు చేయడమే వారికి అర్పించే నిజ నివాళి.

– తంగిరాల చక్రవర్తి, 9393804472

సమాజ పరిశీలనాశక్తికి సాక్ష్యాలు

ఏ భాషకు చెందిన మహాకవులైనా ఒకే రకంగా ఆలోచించినట్లుగానే, ఏ భాషకు చెందిన మనుషులైనా ఒకేరకంగా స్పందిస్తారు. 'quotable quotes' అనిపించే సామెతలు కూడా అన్ని ప్రపంచ భాషల్లో వున్నాయి. కష్టసుఖాల జీవిత ముఖద్వారం దగ్గర అనుభవాన్ని ఒడిసిపట్టుకోవడానికి ఎప్పుడూ నిర్నిద్రంగా వుండే సామాన్యులు, మరీ ముఖ్యంగా గ్రామీణులు ఈ సామెతల ఆవిష్కర్తలు. అట్లా సామెత అనుభవజ్ఞాన గుళిక. సామెతను కొన్ని ప్రాంతాల్లో శాస్త్రం అని కూడా అంటారు. భాష ఒక పెద్ద సాంకేతిక వ్యవస్థ అన్న సత్యం విద్యాధికులకు తెలుసు. కాని సామాన్యులు మాత్రం భాషను తమకు సహజంగా అబ్బిన శక్తిగానే భావిస్తారు. తమకు, తమవారికి మాటిమాటికి ఎదురయ్యే జీవితానుభవాలను అనేకసార్లు వ్యక్తం చేసే క్రమంలో ఆ వ్యక్తీకరణ రాటుదేలి సామెతగా రూపొందుతుంది. తాత్వికత, సార్వత్రికత, సంప్రదాయకత, తులనాత్మకత వంటివి ఇందుకు తోడ్పడతాయి. యతిప్రాసలు, క్లుప్తత వంటివి దాన్ని గుర్తుంచుకోవడానికి తోడ్పడతాయి. వ్యంగ్య హాస్యాలు దాని చెలామణిని మరింత పెంచుతాయి. పైకి అమాయకంగా కనిపించే గ్రామీణ సమాజం పరిశీలనాశక్తికి ఈ శాస్త్రాలు మంచి సాక్ష్యాలు.

నిజామాబాద్ ప్రాంతానికి చెందిన సామెతలను సేకరించి 'తెలంగాణ శాస్త్రాలు' అన్న గ్రంథాన్ని రూపొందించినవారు సీనియర్ పరిశోధకులు డా॥కె.ముత్యం. తాము పనిచేసే శాతవాహన విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో కూర్చుని ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారానో, ఫోన్ సంభాషణల సహాయంతోనో, పరిశోధక విద్యార్థులకు ఒక ప్రశ్నావళి ఇచ్చి పంపో వారు ఈ సేకరణ పనిని చేయలేదు. స్వయంగా క్షేత్ర పర్యటనలో పాల్గొని, నిజామాబాద్ జిల్లాలో పర్యటించి, గ్రామీణ స్త్రీ పురుషుల ద్వారా సేకరించిన సామెతలే ఇవన్నీ. అనుబంధంలో తాము పర్యటించిన గ్రామాలు అక్కడి వ్యవహర్తల, సేకర్తల వివరాలు పొందుపరచడం ద్వారా డా॥ముత్యం తమ పరిశోధన విశ్వసనీయతను నిరూపించుకున్నారు.



2131 తెలంగాణ సామెతలను సేకరించి వాటిని ప్రకృతి, సంచార, పశుపాలన, ఆహార సేకరణ దశ, స్థిర నివాసం, వృత్తి, కుల, సముదాయాలు, జీవితం – నడవడి; వివిధ పార్శ్వాలు, స్త్రీ పురుషులు, నిజామాబాద్ ప్రాంత భౌగోళికత, ఇటీవలి శాస్త్రాలు, వంటి ఎనిమిది విభాగాల్లో వింగడించి చూపారు. ఇదే ప్రశంసనీయమైన పని అనుకుంటే, తులనాత్మక రంగంలోకి ధైర్యంగా అడుగుపెట్టి – మరాఠీ, కన్నడ, లంబాడీ, ఉర్దూ భాషా శాస్త్రాలను క్రోడీకరించి, వాటి తెలుగు అనువాదాలను కూడా పొందుపరిచారు. దీంతో ఈ గ్రంథానికి బహుభాషా స్వభావం అలవడి పాఠకులకు మరింత జ్ఞానదాయకంగా రూపొందింది.

'హర్ చమక్‌దార్ చీజ్ సోనా నహీ హక్తీ' అని ఉర్దూలో వున్న సామెత – 'మెరిసేదంతా మేలిమి బంగారం కాదు' అని తెలుగులో 'all that glitters is not gold' అని ఆంగ్లంలో కనిపిస్తాయి. వెతికితే ఇతర భాషల్లోనూ కనిపించవచ్చు. ఇవి అనువాదాలు కావు. ఆయా భాషా సమాజాల వాళ్ళు తమ భాషల్లో వ్యక్తం చేసుకున్న సార్వత్రిక అనుభవాలు. సంక్షిప్తంగా వుండటం, ఇతర అనేక సందర్భాలకు అన్వయించేటట్లుగా అతి వ్యాప్తి లక్షణం కలిగి వుండటం, మార్పుటానికి వీలులేకుండా ఉండటం సామెత లక్షణాలు. పురుషుల కంటే స్త్రీలే సామెతలను విరివిగా వాడుతారన్నది డా॥ముత్యం పరిశోధనలో తేలిన సత్యం. ఇది స్త్రీ జాతి అనుభవాధిక్యాన్ని, వ్యక్తీకరణ సామర్థ్యాన్ని, పరిశీలనాశక్తిని వెల్లండిచే అంశం.

బహుముఖాల పరిశోధనతో ముందుకు పోతున్న డాక్రి (DACRI) సంస్థ సంచాలకులు కె. జితేంద్ర బాబు తమ 'మా మాట'లో తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ భాషలలో అనువాదాలా అనిపించే సమాన భావార్థాలున్న సామెతలను పేర్కొన్నారు. ఇది సామెతల సర్వవ్యాపకతను సూచిస్తున్నాయి. విలువైన ఈ గ్రంథానికి బహుభాషావేత్త నలిమెల భాస్కర్ మంచి ముందుమాటను రాశారు. సమాజంలో అంతరాత్మ పాత్రను, విమర్శకుని పాత్రను నిర్వహించే సామెతలతో ఈ గ్రంథాన్ని రూపొందించినందుకు డా॥కె.ముత్యం అభినందనీయులు.


– అమ్మంగి వేణుగోపాల్, 9441054637

పచ్చల పిడిబాకు

కవిత్వం లేదు
కవిత్వం కాదు
కవిత్వం రాదు
ఇలా చెప్పడంలో కవిత్వముంది
కనిపించని కోపంలో
శిరసావహించే బాధ్యతుంది
అర్థం చేసుకుంటే ఎంతో బరువైంది

నిన్ను పొగుడుతూ
నేను వెంట తిరగడం అవసరం లేదు
నన్ను విమర్శిస్తూ
నువ్వు జబ్బుపడడం మంచిది కాదు
శాడిజాలు పక్కన పడేసి
కవిత్వం రాయడం అభ్యసిద్దాము
కావలసిన పుస్తకాలు చదివి
చూడాల్సిన సమాజాన్ని చూసి
కవిత్వం పలికే పట్టును పట్టుకొందాము
ప్రజలను చేరే దారిని వెదుక్కుందాము

పసలేని పుట్టి వచనం రాసి
పచ్చని కవిత్వమనడం మానుకొందాము
ప్రచారం చేసుకొని
కవిగా ముద్రేసుకోవడం ఆపేద్దాము
కవిత్వాన్ని కవిత్వంలాగే రాద్దాము
కాలమెంతైనా సరే
కవిత్వం అబ్బేదాకా తపస్సు చేద్దాము



రాసింది బాగా లేదంటే
కోపం వద్దు
అద్భుతంగా వుందంటే
మోసపోవద్దు
కొన్ని ముందు మాటలు ముంచుతాయి
రాసేవాళ్ళ ఉనికి కోసం
నేర్చుకునే కవిని ఉరితీస్తాయి
ఏమి రాశావో పక్కన పెడితే
ఎలా రాశావో తర్వాత తెలుస్తుంది
తప్పు తెలిశాక సవరించుకుంటే
గొప్ప కవితను వాగ్దానం చేస్తావు
పూసిన పువ్వుకు
పరిమళముండాలి
పాకే తీగకు
తిరిగిన వొంపులుండాలి
చేసిన తల్వార్‌కు
బురుజును ఎగరేసే పదునుండాలి
పట్టుకునే పిడికిలికి
ఆకట్టుకునే నగిషీలుండాలి
వేలు చూపి అడిగే ప్రశ్నకు
ఎదురు కుర్చీ వొణికిపోవాలి
మొత్తంమీద చెప్పిన దానిలో
ఇంద్రధనుస్సు సౌందర్యముండాలి
అన్నిటికన్నా ముఖ్యంగా
రాసింది వచనానికి భిన్నంగా వుండాలి
నిజం చెప్పాలంటే
రాసిన వాడు మనిషై ఉండాలి
రాసిందంతా ప్రేమై బతకాలి.

(తమ్ముడు కవి యాకూబ్‌కు కృతజ్ఞతలతో)
(పచ్చల పిడిబాకు' పదాన్ని సినారె ఒక పాటలో వాడారు)

– ఆశారాజు, 9392302245

'అద్దంలో ఆభరణం' ఆవిష్కరణ

కవన వేదిక, తెలంగాణ భాష, సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పెద్దనోట్ల రద్దుపై తొలి తెలుగు కవితా సంకలనం 'అద్దంలో ఆభరణం' ఆవిష్కరణ ఈ నెల 18వ తేదీన జరుగుతుంది. హైదరాబాద్, రవీంద్రభారతి సభామందిరంలో సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో డా॥కె.వి.రమణాచారి, డా॥నందిని సిధారెడ్డి, మామిడి హరికృష్ణ, డా॥పత్తిపాక మోహన్, డా॥కేతవరపు రాజశ్రీ పాల్గొంటారు.

ఆహ్వానం

శైలజ బండారి రచించిన 'మన సంస్కృతి – చరిత్ర; భిన్నకోణాలు' పుస్తకావిష్కరణ సభ ఈ నెల 18వ తేదీన సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్, బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరుగుతుంది. ఇందులో జె.వి.వి.రమేష్, పాశం యాదగిరి, శిలాలోలిత, కొండవీటి సత్యవతి, కాసుల ప్రతాప్‌రెడ్డి పాల్గొంటారు.

'దిమాక్ ఖరాబ్' ఆవిష్కరణ

మోహన్ రుషి పుస్తకం "దిమాక్ ఖరాబ్" ఆవిష్కరణ ఆగస్టు 20 ఉదయం 10 గంటలకు మిర్యాలగూడలోని ఎన్.ఎస్.పి. క్యాంప్ గ్రౌండ్ పక్కన వున్న మేరెడ్డి రామచంద్రారెడ్డి స్మారక గ్రంథాలయంలో జరుగుతుంది. కట్టా శేఖర్ రెడ్డి, సుబ్బారావు, అంబటి సురేంద్రరాజు, గోరేటి వెంకన్న, శంకర్ కార్టూనిస్ట్, సంగిశెట్టి శ్రీనివాస్, పసునూరి రవీందర్, వేనేపల్లి పాండురంగారావు, పున్నా కృష్ణమూర్తి పాల్గొంటారు.

మూడుతరాల కవిసంగమం

హైదరాబాద్, అబిడ్స్‌లోని గోల్డెన్ త్రెషోల్డ్ నందు ఈ నెల 20వ తేదీన సాయంత్రం 6 గంటలకు కవిసంగమం సిరీస్ – 34లో భాగంగా అశోక్ ఆవారి కవితా సంపుటి 'సహజవాక్యం' ఆవిష్కరణ వుంటుంది. జూపల్లి ప్రేంచంద్, వనపట్ల సుబ్బయ్య, ధర్‌మురళి, రజిత కొమ్ము, గరిగె రాజేష్ పాల్గొంటారు.

రష్యన్ జానపద కథల అనువాదం

ఈ నెల 19వ తేదీ ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్, సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రష్యన్ జానపద కథలకు అనిల్ బత్తుల స్వేచ్ఛానువాదం ఆవిష్కరణ సభ జరుగుతుంది. ఆరిస్ట్ మోహన్, కుమార్ కూనపరాజు, చైతన్య పింగళి పాల్గొంటారు.





**ఒక సమస్యపై పోరాటం చేయాలంటే...
దానిని ఎదుర్కొని ఉండాల్సిన అవసరం లేదు... సహానుభూతి చాలు!
మూడు తరాలుగా కుటుంబంలో వ్యవసాయంతో సంబంధం లేదు..
కానీ చిరుధాన్యాలను పండిస్తున్న మహిళా రైతులు ప్రేరణనిచ్చారు
వారితో కలిసి పనిచేయడం మొదలుపెట్టింది...
ఆ క్రమంలో వ్యవసాయంలో వస్తున్న సంక్షోభం ఆమెను కదిలించింది
అందుకే రైతుల హక్కుకోసం పోరాటం మొదలుపెట్టింది
ఎంత చేసినా భూమి హక్కులు లేకపోవడం...
రోజంతా రెక్కలు ముక్కలు చేసుకున్నా...
మహిళలను రైతులుగానే గుర్తించకపోవడం ఆమెను బాధించింది
అందుకే మహిళా రైతుల సాధికారతకోసం కృషి చేస్తున్నది! ఆమె...
కవిత కురుగంటి. ఆ ఉద్యమకారిణి మానవితో పంచుకున్న ముచ్చట్లు..**

ఆకాశంలో సగం..
భూమి తొమ్మిది శాతమే

మీ కుటుంబ నేపథ్యం ఏమిటి? రైతులతో, ప్రత్యేకించి మహిళా రైతులతో పని చేయాలన్న ఆలోచన ఎట్లా వచ్చింది?

అమ్మానాన్న, ముగ్గురం అక్కాచెల్లెళ్లం. అమ్మానాన్నలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు. మూడు తరాల నుంచి కుటుంబంలో వ్యవసాయం లేదు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కమ్యూనికేషన్‌లో ఎమ్మే చేశాను. అప్పుడు పి.వి.సతీష్‌గారు మాకు ఫిల్మ్ మేకింగ్ టీచ్ చేశారు. ఆయన అప్పటికే డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్. సెకండియర్‌లో ఉండగా 'ఏ కమ్యూనికేషన్ ఛానల్' రైతులు, ప్రజలను ఎక్కువ ప్రభావితం చేస్తుందని అధ్యయనం కోసం గ్రామాలకు వెళ్లాం. భూమి లేని నిరుపేద దళిత మహిళలతో ఇంటర్వ్యూలు చేశాను. పేద దళిత మహిళల్లో ఉన్న ధైర్యం, జ్ఞానం దగ్గరుండి చూశాను. వ్యవసాయం, ఆరోగ్యం, వాతావరణం గురించి వాళ్లకు తెలిసిన విషయాలు విని ఇన్‌స్పైర్ అయ్యాను. పీజీ అయిపోగానే 'ఉద్యోగం ఇస్తారో ఇవ్వరో నాకు తెలియదు కానీ... నేను మహిళా రైతులతో పనిచేయడానికి వస్తున్నా' అని చెప్పి వెళ్లిపోయాను. అదే నా ఫౌండేషన్. తెలంగాణ డెక్కనీ వ్యవసాయం గురించి, చిరుధాన్యాలతో జీవ వైవిధ్యం గురించి, మహిళా రైతుల గురించి చాలా తెలుసుకున్నా ఆ ఆరేండ్లలో. ఆ తరువాత కొన్నాళ్లు ఢిల్లీలో ఉన్నాను, పంజాబ్‌లో పనిచేశాను. ఇప్పుడు 13 ఏండ్లుగా బెంగళూరులో ఉంటున్నాను. ప్రస్తుతం ఆశా కిసాన్ స్వరాజ్‌కి నేషనల్ కన్వీనర్‌గా ఉన్నాను.

మహిళలకు భూమి హక్కు లేకుండా పోవడానికి ప్రధాన కారణాలేంటి? దానిని ఎట్లా అధిగమించొచ్చు?

మహిళలు తమను తాము రైతులుగా గుర్తించాలి. బయటి సమాజం కూడా గుర్తించాలి. అప్పుడు వాళ్లు పోరాటం చేయడానికి, వాళ్లకోసం ఇతరులు పోరాటం చేయడానికి అవకాశం ఉంటుంది. ప్రాంతం ఏదయినా వ్యవసాయంలో 70శాతానికి పైగా శ్రమ చేసేది మహిళలు. కానీ అన్నదాత అనగానే నాగలిపట్టుకుని దున్నే రైతు కనబడతాడు. ఆ వెనకాలే గొర్రు పట్టకుని విత్తనాలు చల్లే మహిళా రైతు కనిపించదు. మహిళలకే కాదు... కౌలుదారులను కూడా రైతులుగా గుర్తించరు. పట్టాదారులు మాత్రమే రైతులుగా గుర్తించబడుతున్న పరిస్థితి. భూమి తమ పేరు మీద ఉన్న మహిళలు సైతం... తమను రైతులుగా గుర్తించుకోరు. రైతులతో డీల్ చేసే వ్యవస్థలు కూడా వారిని గుర్తించవు. అందుకే 2014లో వివిధ సంస్థలు, రైతు సంఘాల మహిళా నాయకులతో చర్చించి 'మహిళా కిసాన్ అధికార్ మంచ్' ఏర్పాటు చేశాం. దాని ప్రధాన ఉద్దేశాలు... మహిళలకు రైతులుగా గుర్తింపు ఉండాలి. భూమి హక్కులు, అన్ని వనరుల మీద హక్కులుండాలి. వ్యవసాయ సంబంధిత ప్రభుత్వ పథకాలన్నింటిలో మహిళలకు సమాన హక్కు ఉండాలి. వ్యవసాయ నిర్ణయాధికారాల్లో 50శాతం మహిళా భాగస్వామ్యం ఉండాలి.

దేశవ్యాప్తంగా మహిళలకు భూమి మీద హక్కు ఎట్లా ఉంది?

రెవిన్యూ డిపార్ట్‌మెంట్ ల్యాండ్ రికార్డుల్లో మహిళల భూమి మీద వివరాలు లేవు. ఎందుకంటే పట్టా రికార్డుల్లో సెక్స్‌కి సంబంధించిన కాలమ్ ఉండదు. అదే ఉంటే సులభంగా తెలిసేది. చిన్నచిన్న అధ్యయనాల ఆధారంగా ఇప్పటిదాకా మన దేశంలో 9శాతం మాత్రమే మహిళలకు భూమి మీద హక్కు ఉంది. చాలా రాష్ట్రాల్లో అది కూడా లేదు. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లాంటి రాష్ట్రాల్లో అధికంగా ఉండటం వల్ల సగటు 9కి చేరింది. కేంద్ర వ్యవసాయ శాఖ ప్రతి ఏటా తీసే గణాంకాల్లో మాత్రం దాదాపు 12 శాతం భూమి మహిళలు సాగు చేస్తున్నట్టు ఉంది. 2005లో మహిళలకు సమాన ఆస్తి హక్కు వచ్చి ఇప్పటికి పన్నెండు ఏండ్లు అయినా... మహిళల పేరు మీద ఉన్న భూమి చాలా తక్కువ. పైన ఉన్న 9శాతం కూడా మహిళలు వితంతువులు అయ్యాక వాళ్ల చేతుల్లోకి వచ్చిందే. వారసత్వ హక్కును సరిగ్గా అమలు చేయకపోవడం పెద్ద లోపం.

తెలంగాణలో మహిళలకు భూమి హక్కు ఏ మేరకు అమలువుతోంది?

ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మహిళల భూమి హక్కు విషయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కొంత మెరుగుగా ఉన్నాయి. ప్రభుత్వం కొత్తగా భూమిని మహిళల పేరుమీదే ఇస్తున్నారు. అయితే అందులో చాలా లోపాలున్నాయి. భూమి కొనుగోలు, భూ పంపిణీని మొక్కుబడిగా చేస్తున్నారు. అసలా భూమి మహిళ పేరుమీదకి వచ్చిందా లేదా చూడటం లేదు. పట్టా రాసివ్వడం.. భూమి చూపెట్టకపోవడం, వీరికిచ్చిన భూమి ఇంకెవరి కబ్జాలో ఉండటం.. సాగు చేసుకునే భూమికి టైటిల్ రాకపోవడం వంటి ప్రధాన సమస్యలు ఉంటున్నాయి. ఇక ప్రభుత్వం కల్పిస్తున్న కొన్ని పథకాల వల్ల భర్తలే స్వయంగా మహిళల పేరుమీదకు మారుస్తున్నారు. కారణం... ఐదెకరాలకన్నా ఎక్కువ ఉంటే పథకాలు తమకు వర్తించవన్న భయం. కరీంనగర్ జిల్లాలోని ఒక గ్రామంలో పట్వారీ దగ్గర కూర్చుని రికార్డ్స్ తీస్తే... ఆ ఊరిలోని 32శాతం భూమి యాజమాన్యం మహిళల చేతుల్లో ఉంది. చాలా ఆశ్చర్యం అనిపించింది. మహిళలకు భూమి హక్కు ఉండటం వల్ల వారిపై హింస తగ్గింది. తాగుడు అలవాట్లున్న పురుషుడు ఉంటే... భూమిని కూడా అమ్మేస్తాడన్న భయంతో కుటుంబాలే అతని భార్య పేరుమీద రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఇలా రకరకాల కారణాల కొంత మార్పు కనిపిస్తోంది. రావాల్సినంత మార్పు రాలేదు. అది చాలా దూరంలో ఉంది.

వ్యవసాయ రంగంలో వస్తున్న సంక్షోభం మహిళల మీద ప్రభావం చూపుతోంది?

రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న కుటుంబాల్లో మహిళల మీద పడుతున్న ప్రభావం అంతా ఇంతా కాదు. పిల్లల చదువు, వ్యవసాయం, అప్పుభారం వదలడం లేదు. రైతు ఆత్మహత్య చేసుకున్నాక రుణాలకోసం భార్యలను బ్యాంకులు ఇబ్బంది పెడుతున్నాయి. అలాంటి కుటుంబాల్లో భద్రతో, ఆర్థికమో కానీ.. అమ్మాయిల డ్రాపవుట్స్ పెరుగుతున్నాయి. వితంతువుమీద, అమ్మాయిల మీద. పదడుగులు వెనక్కి వెళ్లిపోతున్నారు. ఇంకొన్ని ప్రాంతాల్లో పురుషులు గ్రామాలు వదిలి వలస వెళ్లిపోతున్నారు. దాంతో కుటుంబాన్ని నడిపే బాధ్యత, వ్యవసాయ సాగు మహిళలపైనే పడుతోంది. వ్యవసాయ సంక్షోభం ఎక్కువగా ఉన్నది వాణిజ్య పంటలు అధికంగా సాగు చేస్తున్న చోట. వ్యవసాయంలోకి మార్కెట్ ఎక్కువగా చొచ్చుకొచ్చిన చోట. వాణిజ్య పంటలే మహిళను వ్యవసాయానికి దూరం పెట్టాయి. సంక్షోభాన్ని తయారు చేసే ఈ వ్యవస్థలో మహిళలను పక్కన పెట్టడం మరింత సంక్షోభాన్ని పెంచుతోంది.

వీటన్నింటి నుంచి బయటపడటం ఎలా?

సేంద్రియ వ్యవసాయం, ఆహారపు పంటల సాగు పెరగాలి. చిరుధాన్యాల సాగు పెరగాలి. మార్కెటింగ్ వ్యవస్థ మహిళలకు అనుగుణంగా ఉండాలి. తెలంగాణ వ్యవసాయం చాలా సుసంపన్నమైనది. ఈ ప్రాంతంలో ఉన్న భూమి, విత్తన సంపద, వైవిధ్యం వేరే ఎక్కడా లేదు. అలాంటి వ్యవసాయాన్ని రక్షించాల్సింది పోయి... ప్రభుత్వం విత్తనకేంద్రం అయిపోవాలని జన్యుమార్పిడి విత్తనాలను పట్టుకొస్తున్నది. పెద్ద పెద్ద కంపెనీలకు రెడ్ కార్పెట్ పరుస్తున్నది. సుసంపన్నమైన రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టే నిర్ణయాలు, విధివిధానాలు తీసుకుంటున్నది. అన్నింటికీ మించి సెజ్‌లు, బహుళజాతి కంపెనీలకు సాగు భూములను కట్టబెడుతున్నది. ప్రాజెక్టుల పేరుతో రైతులను నిర్వాసితులను చేస్తున్నది. అసలు భూమే లేనప్పుడు... మీరు ఎన్ని నీళ్లిస్తే ఏం లాభం? వ్యవసాయదారులకు, గ్రామీణ ప్రజలకు వ్యతిరేకమైన విధానాలు తెలంగాణలో ఉన్నాయి. ఇది దురదృష్టకరం.

కట్ట కవిత

చేయాల్సింది ఎంతో ఉంది...

మెదక్ జిల్లా జహీరాబాద్‌లోని కృష్ణాపురంలో ఎన్నో పోరాటాల తరువాత మహిళలందరికీ భూమి ఇచ్చింది. అందులో బావి తవ్వి కలిసికట్టుగా వ్యవసాయం చేసుకునే వ్యవస్థ ఏర్పాటు చేసుకున్నారు. దాని అధ్యయనం కోసం తమిళనాడు నుంచి మహిళా రైతులు వచ్చారు. 'మీకైతే భూమి వచ్చింది కదా... మీ తరువాత ఈ భూమి ఎవరికి వెళ్తుంది?' అంటే.. వాళ్లు చెప్పిన సమాధానం 'ఏముంది మా కొడుకులకే' అని. మహిళలు ఎంతో పోరాటం చేసి సంపాదించుకున్న భూమిని... తిరిగి కొడుకుకే ఇస్తాను అని చెప్తారంటే... వందల ఏళ్లుగా వేళ్లూనుకుపోయిన పితృస్వామ్యం పోగొట్టడం ఎట్లా? ఈ మాత్రం పనిచేస్తే సరిపోదు... చేయాల్సింది ఎంతో ఉంది అనిపించింది.

మార్పు సాధ్యం...

నేను చిన్నతనం నుంచే ఫెమినిస్టును. ఎప్పుడూ లింగపరమైన వివక్ష ఎదుర్కోలేదు. వివక్ష చూపే అవకాశాన్ని ఇవ్వలేదు. చిన్నవయసులో రైతు ఆత్మహత్య చేసుకుంటే... అతని భార్య భూమిలో హక్కు అడుగుతుందేమోనని చెప్పి అత్తింటివారు ఇబ్బందులు పెట్టి బయటికి తరిమికొట్టిన ఘటనలు చాలా. ఎవ్వరి సపోర్టు లేకపోయినా.. కిరాయి ఇంట్లో ఉంటూ అనేకపాట్లు పడుతున్న అలాంటి మహిళలను చూస్తున్నాను. మహిళలకున్న అతిపెద్ద పేదరికం... టైమ్ లేకపోవడం. ముఖ్యంగా గ్రామీణ మహిళల్లో ఈ సమస్య ఎక్కువ. వంట, అంట్లు తోమడం, బట్టలు ఉతకడం వంటి పనులు మాత్రం ఎప్పుడూ మహిళలే చేస్తున్నారు. బయట పని, ఇంట్లో పనితో... తమకోసం తాము సమయం కేటాయించుకోరు. మహిళలు తమ హక్కులు తాము తెలుసుకోవాలి. శక్తిని తెలుసుకోవాలి. ఒక్కరుగా పోరాడటం కష్టం. సంఘటితంగా చేస్తే సాధించలేనిదేదీ లేదు. దాన్ని గుర్తించాలి. అలాగే వివిధ విభాగాల్లోని ప్రభుత్వ వ్యవస్థల్లో, అధికారంలో ఉన్న మహిళల చేతుల్లో సమాజాన్ని మార్చే శక్తి ఉంది. మిగిలిన ప్రభుత్వ అధికారుల్లా కాకుండా ఓ మహిళగా వ్యవస్థను మార్చగలుగుతామని వాళ్లు గుర్తిస్తే మార్పు తొందరలోనే సాధ్యం అవుతుంది.

హుందాగా ఉపాధి...

కేరళలో భూమిలేని మహిళలు ప్రభుత్వ సహకారంతో కో-ఆపరేటివ్ సొసైటీ (గ్రీన్ ఆర్మీ) పేరుతో ఏర్పాటు చేసుకున్నారు. ఈ మహిళల దగ్గరే ట్రాక్టర్లు, ట్రాన్స్‌ప్లాంటర్లు, ప్రాసెసర్స్, కట్ చేసే మెషీన్స్ ఉంటాయి. వాటిని రిపేర్ కూడా ఆ మహిళలే చేస్తారు. వాళ్లంతా కలిసి కాల్ సెంటర్ ఓపెన్ చేశారు. రైతులు వీళ్లకు ఫోన్ చేస్తే వెళ్లి సేవలందిస్తున్నారు. భూమి దున్నడం దగ్గర నుంచి పంటచేతికి వచ్చేదాకా ఏపనైనా ఇట్టే చేయగలుగుతారు. 'గ్రీన్‌ఆర్మీని పిలిస్తే పని బాగా, సులభంగా అయిపోతుంది' అన్నంత మంచి పేరు తెచ్చుకుంటున్నారు. ఇందులో పనిచేస్తున్న మహిళలు నెలకు రైతుల కన్నా ఎక్కువ సంపాదిస్తున్నారు. కూలీల కొరత ఉన్న దగ్గర ఇలా ఏర్పాటు చేయగలిగితే మహిళలు హుందాగా ఉపాధి పొందగలుగుతారు.

స్విస్ స్త్రీవాద రచయిత



ఆలిస్ రివాజ్
(ఆగష్టు 14, 1901 - ఫిబ్రవరి 27, 1998)

అనునిత్యం తన జీవితంలో కనిపించే వ్యక్తులే ఆమె నవలలో పాత్రలుగా మారారు. విభిన్న మనస్తత్వాలతో కూడిన వ్యక్తుల మధ్య అనుబంధాలను, ఆప్యాయతలను ఒకవైపు చెబుతూ... స్త్రీవాదాన్ని మరోవైపు అంతర్లీనంగా తన నవలలో ప్రతిబింబించారు స్విస్ రచయిత ఆలిస్ రివాజ్.

స్విస్ మునిసిపాలిటీలో ఆలిస్ జన్మించారు. పాల్ గోల్, ఇడా ఎట్టర్ దంపతుల ఏకైక సంతానం ఆమె. తండ్రి ఉపాధ్యాయుడిగా పనిచేసేవాడు. సోషలిజంపై ఆసక్తి పెరగడంతో ఉపాధ్యాయ వృత్తిని విడిచిపెట్టి రచయితగా మారారు. వామపక్ష పత్రిక 'లె గ్రూట్‌లీన్' కు రాసేవారు. దాంతో వారి కుటుంబం లాసాన్నేకి వెళ్లింది. అలిస్ రచనల్లో భిన్నమైన అభిప్రాయాలలో ఉండే ఆమె తల్లిదండ్రులను పోలిన పాత్రలు కనిపిస్తాయంటారు.

ఆలిస్‌కు సంగీతం అంటే చిన్నతనం నుంచే చాలా ఇష్టం. ఆమె మొదట సంగీతం నేర్చుకున్నారు.. పియానిస్టుగా శిక్షణ పొందారు. ఆ తర్వాత ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్‌లో చేరారు. ఇక్కడ అనేక సంవత్సరాలు పనిచేసిన తర్వాత ఆమె రాయడం మొదలుపెట్టారు. క్రమంగా ఆమె కలం నుంచి వెలువడే రచనలు ఆమెకు మంచి గుర్తింపును తీసుకొచ్చాయి. స్విట్జర్లాండ్‌కు చెందిన ఫ్రెంచ్ భాషా రచయితలలో ఒకరుగా పేరుగడించారు.

WOMEN of the day

1937లో ప్రచురితమయిన 'నౌజేస్ డాన్స్ లా మెయిన్' (క్లౌడ్స్ ఇన్ యువర్ హ్యాండ్స్) అలిస్ మొదటి నవల. 1979 లో ప్రచురితమయ్యిన మరో నవల 'జెట్టీ టోన్ పెయిన్ (కాస్ట్ యువర్ బ్రెడ్). ఆమె నవలలో ఇతివృత్తాలు, పాత్రల స్వభావాలు ఎక్కువగా కళారంగంలో మహిళలు, కుటుంబంలో మహిళల పాత్రలతో పాటు ఫెమినిస్ట్ ధోరణి కనిపిస్తాయి. నవలలతో పాటు చిన్నచిన్న కథలు, వ్యాసాలు కూడా ఆమె రాశారు. స్త్రీవాద నేపథ్యాలతో వచ్చిన ఆమె రచనలు ప్రసిద్ధి చెందాయి. ప్రముఖ కవి జీన్-జార్జెస్ లూసియర్ జీవితాన్ని అధ్యయనం చేశారు.

25 ఏళ్ళ వయసులో జెనీవాకు వెళ్లిన ఆలిస్ తన జీవితచరమాంకం వరకు అక్కడే ఉన్నారు. స్విస్ జాతీయ గ్రంథాలయంలో ఆమె రాసిన పుస్తకాలు అందుబాటులో ఉంచారు. ❄

ఇట్ల చేద్దాం

అన్నం వండేటప్పుడు... రెండు మూడు చుక్కల నిమ్మరసం పిండండి. రైస్ పువ్వుల్లా విడివిడిగా, మెరిసిపోతూ ఉంటుంది.


15 నిమిషాల్లో రెడీ...



చాలా తక్కువ సమయంలో చర్మాన్ని అందంగా, సహజ సిద్ధంగా తయారు చేసుకోవచ్చు. 15 నిమిషాలు కేటాయిస్తే చాలు చర్మం మృదువుగా, తాజాదనంగా కనిపిస్తుంది. దాని కోసం కొన్ని చిట్కాలను పాటిస్తే సరిపోతుంది.

- చర్మతత్వాన్ని బట్టి క్లెన్సర్‌ను ఉపయోగించి ముఖాన్ని శుభ్రంగా కడగాలి. అయితే క్లెన్సర్‌ను ముఖానికి, మెడకు రాసుకొని బాగా కడుక్కోవాలి. ఇలా చేయడం వల్ల దుమ్ము, ధూళి, క్రిములు, బ్యాక్టీరియా తొలగిపోతాయి.
- ముఖాన్ని శుభ్రంగా కడిగిన తర్వాత చర్మానికి మాయిశ్చరైజర్ లేదా స్కిన్ టోనర్‌ను చేతులకు, ముఖానికి, మెడకు రాసుకోవాలి. మాయిశ్చరైజర్ రాసుకోవడం వల్ల చర్మం హైడ్రేట్ అవడంతో పాటు మృదువుగా, కాంతివంతంగా తయారవుతుంది. మాయిశ్చరైజర్‌గా తాజాగా ఉన్న కలబంద గుజ్జును వాడవచ్చు. స్వచ్ఛమైన కలబంద గుజ్జు చర్మ సంరక్షణకు దోహదపడుతుంది. అలాగే కలబంద స్కిన్ ఎలర్జీ వంటి సమస్యలను దూరం చేస్తుంది.
- మాయిశ్చరైజర్ రాసుకున్న తర్వాత పెదాలకు లిప్ బామ్ చాలా అవసరం. పెదాలకు లిప్ బామ్ పెట్టుకోవడం వల్ల మృదువుగా, అందంగా కనిపిస్తాయి. అయితే ఎక్కడికి వెళ్లినా లిప్ బామ్‌ను బ్యాగులో పెట్టుకుంటే సరిపోతుంది.
- అలాగే రాత్రి పడుకునే ముందు మాత్రం మేకప్ తొలగించుకోవాలి. దాంతో పాటు రాత్రి భోజనంలో విటమిన్స్ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలి. ఇవి మంచి యాంటీ ఆక్సిడెంట్స్‌గా పని చేయడం తో పాటు చర్మాన్ని హైడ్రేట్ చేసి ముడతలను తగ్గిస్తాయి. ❄

ఇది కాదు జీవితం !



కొన్ని ఆలోచనలు జీవితాన్ని నాశనం చేస్తాయి. మరీ కొన్ని ఆలోచనలు జీవితాన్ని విజయానికి చేరువ చేస్తాయి. అయితే ఇప్పటీ వరకు విజయానికి చేరువయ్యే అంశాలను ఎన్నో సార్లు చదివి ఉంటారు. అయితే మనలో వచ్చే కొన్ని ఆలోచనలు మాత్రం తీవ్రమైన డిప్రెషన్‌కు, ఒత్తిడికి, భయంకరకమైన మానసిక రుగ్మతలకు గురి చేస్తాయి. వాటిలో కొన్నింటి గురించి తెలుసుకుందాం !

- ప్రతికూల ఆలోచనలు మెదడు పని విధానం పై చాలా ప్రభావాన్ని చూపుతాయి. ఏ పని చేసినా సంతృప్తి ఉండదు. ఉన్న దాంట్లో ఆనందంగా జీవించలేరు. ప్రతికూల ఆలోచనలు అనేవి ఆరోగ్యాన్ని, జీవితాన్ని నాశనం చేస్తాయి. కాబట్టి వీలైనంత వరకు ఈ ఆలోచనలకు దూరంగా ఉండటం మంచిది.
- ఎప్పుడైతే సానుకూలంగా ఆలోచిస్తారో అప్పుడే ప్రతికూల ఆలోచనలు దరి చేరకుండా ఉంటాయి. సానుకూలంగా ఆలోచిస్తేనే మెదడు ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా బాగా పని చేస్తుంది.
- ఇంటి పనులు, ఆఫీసు పనుల్లో ఎదురయ్యే సమస్యలను అధిగమించడం తెలియక చాలా మంది చేసే పనుల్లో ఓటమి పాలు అవుతుంటారు. ఇలాంటి వారు ఒక్కసారి ఓడిపోతే చాలు మళ్లీ తిరిగి ప్రయత్నించరు. మరో సారి ప్రయత్నిస్తే తప్పక విజయం వరిస్తుంది.
- కొంత మంది ఇతరులతో పోల్చుకొని లోపలే కుమిలిపోతుంటారు. ఈ ప్రభావం కారణంగా తమలో దాగి ఉన్న నైపుణ్యాన్ని, ఏకాగ్రతను కోల్పోతారు. ఇతరులతో పోల్చుకోవడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు. పైగా ఆరోగ్య, మానసిక ఒత్తిళ్ళకు గురికావల్సి వస్తుంది. కాబట్టి ఆత్మ విశ్వాసంతో ముందుకు వెళ్లడం సరైన మార్గం. ❄

పేస్టు చాలా బెస్టు



టూత్‌పేస్టు.. కేవలం దంతశుభ్రతకే కాదు... చాలా రకాలుగా ఉపయోగపడుతుంది.

- ఇప్పుడు ప్రతి ఇంట్లో రెండుమూడు స్మార్ట్ ఫోన్స్ ఉంటున్నాయి. వాటిమీద గీతలుపడటం కూడా సాధారణమైపోయింది. మీ ఫోన్‌కు అలా జరిగితే... కొద్దిగా టూత్‌పేస్టును ఒక బట్ట మీద పెట్టండి. దాంతో... నెమ్మదిగా ఆ గీతల మీద రుద్దండి. పూర్తిగా ఆరేదాక వదిలేయండి. తరువాత తుడిచి చూడండి... ఫోన్ కొత్తదానిమాదిరిగా వెలిగిపోతుంది.
- గోళ్ల ఎంత శుభ్రంగా ఉంటే... చెయ్యి చూడటానికి అంత అందంగా ఉంటుంది. అందమైన గోళ్ల మీ సొంతమవ్వాలంటే... గోళ్లపై టూత్‌పేస్ట్‌ను అప్లై చేయండి. కొన్ని నిమిషాల తరువాత నీటితో కడిగేయండి. మీ గోళ్ల మెరిసిపోతాయి. అలాగే ఎలాంటి హానీ ఉండదు.
- ప్రతి ఇంట్లో చెక్క వస్తువులు ఉంటాయి. టేబుల్స్, చైర్స్, టీపాయ్స్. వాటిమీద పడిన మరకలు ఎంత రుద్దినా వదలకపోతే కాస్త.. టూత్‌పేస్టును వాటిమీద రుద్దండి. కొద్దిసేపు వదిలేసి... స్పాంజీని నీటిలో ముంచి దాంతో తుడిచేయండి. మరకలు వెంటనే మాయమైపోతాయి.
- దోమకాటు ఎంత ఇబ్బంది పెడుతుందో అందరికీ అనుభవమే. దానితో వచ్చే దద్దుర్లు, దురద ఇబ్బందిగా ఉంటుంది. అలాంటప్పుడు దోమ కరవగానే దానిమీద టూత్‌పేస్టును అప్లై చేయండి. దురద వెంటనే తగ్గిపోతుంది.



- చాలాసార్లు అద్దాలు ఆవిరి పట్టినట్టుగా ఉంటాయి. అలా అవ్వకుండా ఉండాలంటే వాటిమీద టూత్‌పేస్ట్‌ను రాసి కొద్దిసేపటి తరువాత కడిగేయండి. మళ్లీ ఎప్పుడూ ఆవిరి పట్టవు.
- కప్పులో అయినా, బట్టల మీద అయినా కాఫీ లేదా టీ మరకలను తొలగించడంలో టూత్‌పేస్టును మించింది లేదు.
- ఇస్త్రీ చేసేటప్పుడు బట్టలు కాలితే... ఐరన్‌బాక్స్‌కు నల్లని మచ్చలు ఏర్పడతాయి. వాటిని తొలగించడానికి నానాయాతన పడాల్సి వస్తుంది. అలాంటప్పుడు టూత్‌పేస్టును రాసి చూడండి. మరకలు సులభంగా వదులుతాయి.
- షూ కొద్దిరోజులు వాడగానే నల్లగా అయిపోతాయి. డిటర్జెంట్‌తో ఎంత ఉతికినా ఆ నల్లదనం పోదు. అలాంటప్పుడు కొద్దిగా టూత్‌పేస్టును పాత బ్రష్‌కు పెట్టి దాంతో రుద్ది చూడండి. షూ కొత్తవాటిలా మెరిసిపోతాయి.
- పిల్లలు అల్లరి చేస్తారు. వాళ్ల చేతికి క్రేయాన్స్, పేస్టల్స్ ఇస్తే గోడలను రంగులమయం చేస్తారు. అలాంటి గోడలను శుభ్రం చేయలేక తల్లిదండ్రులు ఇబ్బందిపడుతుంటారు. అలా బాధపడాల్సిన అవసరం లేదు. గోడలకు కాస్త టూత్‌పేస్టును రుద్ది బ్రష్‌తో కడిగేయండి. గోడలు మామూలుగా మారిపోతాయి. ❄



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

పోలీసుల ఆంక్షల మధ్య తెలంగాణ బందీ

- కేసీఆర్ పాలన ప్రజాస్వామ్య ఉనికికే ప్రమాదం : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ-హుజురాబాద్

పోలీసుల ఆంక్షల మధ్య తెలంగాణ బందీగా మారిపోయిందని, సీఎం కేసీఆర్ పాలన ప్రజాస్వామ్య ఉనికికే ప్రమాదంగా మారిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. ప్రతిపక్షాలను నిర్వీర్యం చేస్తూ ప్రజాస్వామ్య గొంతు నొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లాలోని హుజురాబాద్ పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్ఫూర్తియాత్ర చేస్తున్న కోదండరామ్‌ను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కామారెడ్డిలో కోదండరామ్ సభపై టీఆర్ఎస్ కార్యకర్తల దాడి దారుణమని, దీనిపై పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. నీళ్లు, నిధులు, నియమాకాలు అనే నినాదంపై ఏర్పడ్డ తెలంగాణలో అణచివేతలే ప్రధాన లక్ష్యంగా సాగుతున్నాయని వాపోయారు. రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా నోటిఫికేషన్ ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రతిపక్షాలపై సీఎం దుష్ప్రచారం చేస్తున్నారని, ప్రాజెక్టులను ఏ రాజకీయ పార్టీ అడ్డుకోవడం లేదని తెలిపారు. ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టును ఎందుకు ప్రారంభించడం లేదో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. భూ రికార్డులు తప్పుల తడకగా మారాయని సీపీఐ ఆధ్వర్యంలో 2014 సెప్టెంబర్‌లోనే వినతిపత్రం ఇచ్చినట్టు గుర్తుచేశారు. ఈ సీజన్‌లో 24 వేల కోట్లు రుణాల లక్ష్యం కాగా ఇప్పటివరకు 11వేల కోట్ల రూపాయలు మాత్రమే మంజూరు చేశారన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, జగిత్యాల జిల్లా కార్యదర్శి బోయిన అశోక్, రాష్ట్ర సమితి సభ్యులు కర్రె బిక్షపతి, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మారుపాక అనిల్, నాయకులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవాల్లో పాల్గొనే ప్రముఖులు వీరే

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

స్వాతంత్రదిన వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ తెలిపారు. జిల్లాల వారీగా స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో పాల్గొనే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ ఉన్నతాధికారులల పేర్లను ఆయన ఆదివారం విడుదల చేశారు. జయశంకర్ భూపాలపల్లికి స్పీకర్ మధుసూధనాచారీ, మహబూబాబాద్ : ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి బీపీ ఆచార్య, వరంగల్ అర్బన్ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, వరంగల్ రూరల్‌కు ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగాంకు ఎమ్మెల్సీ వెంకటేశ్వర్లు, రాజన్న సిరిసిల్లకు మంత్రి కె తారకరామారావు, కరీంనగర్‌కు మంత్రి ఈటల రాజేందర్, జగిత్యాల ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి ఎమ్మెల్సీ పాటూరి సుధాకర్‌రెడ్డి, ఆదిలాబాద్ మంత్రి జోగు రామన్న, నిర్మల్‌కు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మంచిర్యాలకు ఎమ్మెల్యే నల్లా ఓదేలు, ఆసీఫాబాద్ శాసనమండలి చైర్మెన్ కె స్వామిగౌడ్, సంగారెడ్డికి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీఆర్ మీనా, నిజామాబాద్‌కు మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కామారెడ్డికి గంప గోవర్ధన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తికి ప్రణాళిక సంఘం వైస్ చైర్మెన్ నిరంజన్‌రెడ్డి, జోగులాంబ గద్వాలకు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ నల్లగొండకు శాసనమండలి వైఎస్ చైర్మెన్ నేతి విద్యాసాగర్, సూర్యాపేట మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, యాదాద్రి భువనగిరి ఎమ్మెల్యే గొంగడి సునీత, వికారాబాద్‌కు మంత్రి మహేందర్‌రెడ్డి, రంగారెడ్డి ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, మేడ్చల్ మంత్రి నాయిని నర్సింహరెడ్డి, మహబూ బ్‌నగర్‌కు మంత్రి లక్ష్మారెడ్డి, కొత్తగూడెంకు మంత్రి టి పద్మారావు, సిద్దిపేటకు మంత్రి హరీశ్‌రావు, మెదక్‌కు పద్మాదేవేందర్‌రెడ్డి పాల్గొంటారు.

హీరోగా టర్నింగ్ పాయింట్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్

- సూర్యాపేటలో సందడి చేసిన జయ జానకి నాయక చిత్ర బృందం
- బోయపాటితో మరో చిత్రం : నిర్మాత రవీందర్ రెడ్డి



నవతెలంగాణ - సూర్యాపేట

'జయ జానకి నాయక' చిత్రం విజయవంతంతో హీరోగా తనకు టర్నింగ్ పాయింట్ లభించిందని చిత్ర హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అన్నారు. సినిమా యూనిట్ బృందం చిత్ర విజయోత్సవం సందర్భంగా సూర్యాపేటలోని తేజమూవీ మ్యాక్స్ థియేటర్‌లో ఆదివారం సందడి చేసింది. ఈ సందర్భంగా హీరో మాట్లాడుతూ తన మొదటి సినిమా అల్లుడు శ్రీను అయినప్పటికీ.. తనకు జయ జానకి నాయక చిత్రంతోనే హీరోగా గుర్తింపు వచ్చిందన్నారు. తనకు ఆవకాశం ఇచ్చిన నిర్మాత మిర్యాల రవీందర్‌రెడ్డి, దర్శకులు బోయపాటి శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. దర్శకులు బోయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ నిర్మాతగా రవీందర్‌రెడ్డి ఈ చిత్రానికి 100శాతం న్యాయం చేశారని కొనియాడారు. ఆయన సహకారంతోనే రూ. 50 కోట్లతో ఈ చిత్రాన్ని నిర్మించామన్నారు. ఈ చిత్రం విజయవంతంతో తమ శ్రమకు దగ్గ ఫలితం లభించిందన్నారు. సూర్యాపేటజిల్లాకు చెందిన చిత్ర నిర్మాత మిర్యాల రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఖర్చుకు రాజీపడకుండా చిత్రాన్ని క్వాలిటీగా తీశామన్నారు. ప్రేక్షకులు ఆదరిస్తున్న తీరు చూస్తుంటే చిత్రం కచ్చితంగా 100 రోజులు ఆడుతుందనే నమ్మకం కల్గిందన్నారు. తాను పుట్టి పేరిగిన జిల్లాలో విజయోత్సవ యాత్రలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ చిత్రం ఇచ్చిన ఉత్సాహంతో బోయపాటి శ్రీనుతో మరో చిత్రాన్ని నిర్మించనున్నట్టు ప్రకటించారు. హీరో చిత్రంలోని పలు డైలాగ్‌లతో ప్రేక్షకులను అలరిం చారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ ప్రజ్ఞాజైస్వాల్, పెద్దగట్టు మాజీచైర్మెన్ మద్ది శ్రీనివాస్‌యాదవ్, టీడీపీ జిల్లా ఆధ్యక్షులు పటేల్ రమేష్‌రెడ్డి, రాచర్ల కమాలాకర్, దీలిప్‌రెడ్డి, పెద్దిరెడ్డి గణేష్, రఫీ పాల్గొన్నారు.

పోరాడితేనే సమస్యలు పరిష్కారం

మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.18వేల వేతనం ఇవ్వాలి

యూనియన్ ప్రథమ మహాసభల్లో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్

- ఏజెన్సీలను తొలగిస్తే ఊరుకోం: ఎస్ రమ



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో బతిమిలాడితే సమస్యలు పరిష్కారం కావడం లేదనీ సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. సమస్యల పరిష్కారానికి మధ్యాహ్నభోజన కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అంగన్‌వాడీలు, ఆశాలు, విద్యుత్‌కార్మికులు, కాంట్రాక్టు లెక్చరర్లు, 104, 108 లాంటి అనేక సంఘాలు పోరాటాలతోనే వేతనాలు పెంచుకున్నారనీ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రథమ మహాసభ ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చక్రపాణి, రాష్ట్ర నాయకులు కె. వరలక్ష్మి, నిర్మల అధ్యక్షతన జరిగింది. మహాసభలో పాలడుగు భాస్కర్ ప్రారంభోపాన్యాసం చేశారు. తెలంగాణ వచ్చి మూడేండ్లు దాటినా మధ్యాహ్నభోజన కార్మికుల బతుకుల్లో ఎలాంటి మార్పులేదన్నారు. గత పాలకులు అమలు చేసిన విధానాలే, తెలంగాణ ప్రభుత్వం కూడా అమలు చేస్తుందని మండిపడ్డారు. పిల్లలు లేరనే పేరుతో, పాఠశాలల విలీనం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం బడులను మూసివేస్తుందని, దీంతో వేలాది మంది కార్మికులు రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో చిన్నచిన్న కారణాలతో కార్మికులను తొలగిస్తున్నారనీ, రాజకీయ నాయకుల వేధింపులు ఎక్కువయ్యాయని అన్నారు. కేసీఆర్ పాలనలో అనేక కుంభకోణాలు బయట పడుతున్నాయని తెలిపారు. నేరెళ్ల ఇసుకమాఫియా, మియాపూర్ భూములు, ఎంసెట్ పేపర్ లీక్ తదితర అన్నీ స్కాముల్లో ప్రభుత్వం పాత్ర ఉందని ఆరోపించారు. వీటి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే డ్రగ్స్‌కేసును ప్రభుత్వం తెరమీదికి తెచ్చిందని అన్నారు.మధ్యాహ్నభోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ రమ మాట్లాడుతూ... 15 ఏండ్లుగా పనిచేస్తున్న కార్మికులకు నెలకు కేవలం రూ.వెయ్యి మాత్రమే ఇస్తున్నారని, అదీ పదినెలలకేనని అన్నారు. కేంద్రీకృత వంటశాలల పేరుతో మధ్యాహ్నభోజన కార్మికుల ఏజెన్సీలను తొలగించేందుకు ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని అన్నారు. ఇలాంటి విధానాలను ఐక్యంగా పోరాడి తిప్పికొట్టాలని కోరారు. నిత్యవసర ధరలు పెరుగుతున్న వాటికి అనుగుణంగా మధ్యాహ్నభోజన స్లాబ్‌రేట్లను మాత్రం ప్రభుత్వం పెంచడం లేదన్నారు. పథకాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు అధిక నిధులు కేటాయించాలని ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘం మూడేండ్ల కార్యకలాపాలపై నివేదికను ఆమె పెట్టారు. ఏపీ మధ్యాహ్నభోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వరలక్ష్మి మాట్లాడుతూ... తెలుగు రాష్ట్రాల్లో కార్మిక వ్యతిరేకులు ముఖ్యమంత్రులుగా ఉన్నారని తెలిపారు. ఏపీలోనూ వేలాది మంది కార్మికులను రోడ్డున పడేసేందుకు ఏపీ ప్రభుత్వం కూడా ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. ఆర్ఎస్ఎస్ సంస్థకు మధ్యాహ్నభోజన పథకం అప్పగించేందుకు కేంద్రప్రభుత్వం పన్నాగం పన్నుతోందని మండిపడ్డారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే వెంకటేశ్, వర్కింగ్ ఉమెన్స్ కో కన్వీనర్ పద్మశ్రీ తదితరులు మాట్లాడారు.

జంతు కళేబరాలతో కోళ్ల దాణా తయారీ

- 210 బస్తాల బొక్కల పొడి, వెయ్యి లీటర్ల నూనె, 150 కిలోల డాల్డా పట్టివేత
- మరియా ఫీడ్ ఇండస్ట్రీ పేరిట అక్రమ దందా
- దుర్గంధంతో పరిసరాల రైతులకు అస్వస్థత
- కంపెనీపై పోలీసుల దాడి, కేసు నమోదు



నవతెలంగాణ-ధారూర్

వికారాబాద్ జిల్లా ధరూర్ మండలం దోర్నాల్‌లో జంతువుల ఎముకల పొడితో కోళ్ల దాణా తయారు చేస్తున్న ఓ కంపెనీపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. 210 బస్తాల బొక్కలపొడిని, వెయ్యి లీటర్ల నూనెను, 150 కిలోల డాల్డాను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం...దోర్నాల్ గ్రామం రెవెన్యూ పరిధిలోని సర్వేనం 113, 114లో నాలుగెకరాల్లో మరియా ఫీడ్ ఇండస్ట్రీ పేరిట కోళ్లదాణా తయారు చేసేందుకు కంపెనీ ఏర్పాటుకు గ్రామ పంచాయతీ నుంచి అనుమతులు తీసుకుని, కంపెనీ నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు. సదరు కంపెనీలో కొత్తగా యంత్రాలను అమర్చి వాటి పనితీరును పరిశీలించేందుకు శనివారం డీసీఎం నిండా పశువుల బొక్కలను తీసుకొచ్చి యంత్రాల ద్వారా వాటిని పోడి చేస్తుండగా పరిసరాల పంట పొలాల్లో పని చేస్తున్న రైతులకు దుర్గంధం వాసన రావటంతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో రెండు మూడు గ్రామాల రైతులు శనివారం రాత్రి కంపెనీలోకి వెళ్లి చూడగా బొక్కలను పొడి చేసున్న క్రమంలో దుర్గంధం వెదజల్లి భరించలేని వాసనతో ఉక్కిరిబిక్కి రయ్యారు.

పరిసరాలలో కంపెనీని నడపరాదని ఆందోళన చేశారు. కంపెనీపై ధారూర్ సీఐ ఉపేందర్, రెవెన్యూ ఆర్ఐ యాదయ్యకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు దాడులు చేశారు. కంపెనీలో ఎముకలతో తయారు చేసిన పొడి, నూనె, డాల్డాలను పరిశీలించి పరీక్షల నిమిత్తం నమూనాలను ల్యాబ్‌కు పంపించారు. బొక్కలతో తయారు చేసి ఉంచిన 210 బస్తాల పొడి, వెయ్యి లీటర్ల నూనె, 150 కిలోల డాల్డా వంటి పదార్థాలపై అధికారుల అనుమతులు వచ్చే వరకు అలానే ఉంచాలని, కంపెనీ పరిధిలో ఎలాంటి నిర్మాణాలనూ చేపట్టవద్దని ఆదేశించారు.

కేసు వీగిపోవడానికి కారకులైన

ఐఓలపై చర్యలుంటాయా?

ఈ విషయమై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు అమలయ్యేనా?

- ఎటూ తేల్చి చెప్పలేని ఉన్నతాధికారులు

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో దర్యాప్తు అధికారుల నిర్లక్ష్యం, నిస్సహాయత కారణంగా కోర్టులలో వీగిపోతున్న కేసుల పరంపరకు పోలీసు ఉన్నతాధికారులు ఎప్పుడు బ్రేకు వేస్తారో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి నుంచి పోలీసు శాఖను బయటపడేయడానికి దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలనూ ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదనే విమర్శలు వస్తున్నాయి. నగర టాస్క్‌ఫోర్సు కార్యాలయంపై ఉగ్రవాది ఆత్మాహుతి దాడి కేసులో తాజాగా పది మంది నిందితులను నాంపల్లి ప్రత్యేక కోర్టు నిర్దోషులుగా విడుదల చేయడంపై పోలీసు ఉన్నతాధికారులలో అంతర్మథనం సాగుతున్నది. ఇందులో దాడికి పాల్పడింది బంగ్లాదేశ్ నుంచి వచ్చిన హుజి ఉగ్రవాది కాగా దీనికి ప్రేరణ, స్కెచ్ వేసింది హైదరాబాద్‌కు చెందిన ఉగ్రవాదులని దర్యాప్తు సమయంలో సిట్ తేల్చిన విషయం తెలిసిందే. దానికి అనుగుణంగా అవసరమైన పక్కాగా ఆధారాలను సేకరించి కోర్టులో ప్రవేశపెట్టామని కూడా ఇన్‌వెస్టిగేషన్ ఆఫీసర్(ఐఓ)లు ఆ సమయంలో తెలిపారు. కాని సాక్ష్యాలు లేవంటూ కోర్టు నిందితులపై కేసునుకొట్టి వేయడం సీనియర్ పోలీసు అధికారులకు మింగుడు పడటం లేదు. ఈ విధంగా గతంలోనూ అనేక కీలకమైన కేసులలో కోర్టుకు వచ్చే సరికి ఐఓ అధికారులు బోల్తాపడిన ఘటనలు అనేకం ఉన్నాయి. సంచలనాత్మక కేసులు జరిగినప్పుడల్లా లక్షల రూపాయల వ్యయంతో దర్యాప్తును సాగిస్తున్న అధికారులు చివరకుపట్టుకున్న నిందితులపై నేరాన్ని నిరూపించడంలో విఫలం కావడం ఆ శాఖ పని తీరుపైనా అనుమానాలకు తావిస్తోంది. అయితే ఈ విధమైన ఫలితాలు రావడానికి గల కారణాలపైనా నిశితంగా పరిశీలన జరపడం, అందుకు కారకులైన అధికారులపై తగిన చర్యలు తీసుకునే విషయంలోను పోలీసు ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి స్థితి లో తగిన మార్పును తీసుకు రాకపోతే న్యాయ నిర్ణయ వ్యవస్థ వైఫల్యంగా మారే ప్రమాదం ఉన్నదని దేశ అత్యున్నత న్యాయస్థానం సైతం 2014లో ఒక కేసు విచారణ సందర్భంగా వ్యాఖ్యానించింది. అంతేగాక ధీర్ఘ కాలంగా ఒక కేసు విచారణ జరిగాక చివరికి నిందితుడు నిరపరాధిగా తేలడం అనేది దర్యాప్తు అధికారి వైఫల్యం కిందకే వస్తుందని స్పష్టం చేసింది. ఈ పరిస్థితిని మార్చడానికి దర్యాప్తు, ప్రాసిక్యూషన్ వ్యవస్థల్లో ఉన్న లోపాలను సవరించాలన్నది. ముఖ్యంగా దర్యాప్తు వైఫల్యం చెందడానికి కారకులైన అధికారులపై శాఖాపరమైన చర్యలను తీసుకోవాలని, ఒక వేళ వారు తీవ్రమైన కేసుల దర్యాప్తుల్లో వైఫల్యం చెందిన పక్షంలో సదరు అధికారులను దర్యాప్తు నుంచి దూరం పెట్టాలని కూడా సుప్రీంకోర్టు ఆ సమయంలో ఆదేశించింది. క్షుణ్ణంగా దర్యాప్తు జరిపి కోర్టులో చార్జిషీటు వేశామనే కేసుల్లో సైతం నిందితులు అక్విట్(నిరపరాధిగా) కావడానికి గల మూల కారణాలపై విచారణ జరపడానికి ఒక సీనియర్ పోలీసు అధికారి, మరో సీనియర్ ప్రాసిక్యూషన్ అధికారులతో కమిటీని వేసి విచారణ జరిపించాలని సూచించింది. ఈ విధంగా వీగిపోయిన కేసులు, దానికి గల కారణాలు, అలా జరగకుండా ఉండటానికి తీసుకోవాల్సిన దర్యాప్తు తీరు తెన్నులలో మార్పుల గురించి కొత్తగా రిక్రూట్ అయ్యే పోలీసు అధికారులకు శిక్షణ నివ్వాలని సుప్రీంకోర్టు సూచించింది. అంతేగాక తామిచ్చిన ఆదేశాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నది తెలుపుతు తమకు నివేదికలు సమర్పించాలని కూడా అన్ని రాష్ట్రాలకు అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలు జారీ అయి మూడేండ్లు గడిచినా ఇప్పటి వరకు అటు ఉమ్మడి ఏపీలో కానీ, విభజన జరిగాక తెలంగాణ రాష్ట్రంలో కానీ అమలుకు నోచుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కనీసం ఆ దిశగా తగిన చర్యలు కూడా తీసుకోలేదనే విమర్శలు ఉన్నాయి. ప్రతి ఏటా రాష్ట్రంలో శిక్షల రేటును పెంచాల్సిన ఆవశ్యకత ఉందని, అప్పుడే మనం జరిపే దర్యాప్తునకు సార్థకత ఏర్పడుతుందని, ప్రజల్లో విశ్వాసం పోలీసుల పట్ల మరింతగా పెరుగుతుందని పోలీసు బాస్ అనురాగ్‌శర్మ తమ అధికారులకు చెబుతూనే ఉన్నారు. కాని పరిస్థితి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన మారిందని పోలీసు శాఖకు చెందిన కొందరు అధికారులే వ్యాఖ్యానిస్తున్నారు. నేరానికి పాల్పడిన వారికి శిక్షలు పడక పోతే మరో విధంగా బాధితులకు అన్యాయం చేసిన వారిమే అవుతామని మాజీ డీజీపీ ఒకరు అన్నారు. అదే సమయంలో సుప్రీంకోర్టు ఈ విషయమై ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలను ఇప్పటికైనా రాష్ట్రంలో అమలు చేస్తే నేరాలు మరింతగా తగ్గి గుణాత్మకమైన మార్పులు వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

ఉత్సాహంగా త్రిపుల్ ఐటీ స్నాతకోత్సవం


- 473 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

త్రిపుల్‌ఐటీ హైదరాబాద్ 16వ స్నాతకోత్సవం ఆదివారం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో 473 మంది విద్యార్థులకు, 84 మంది పరిశోధన విద్యార్థులకు, 16 మందికి పీహెచ్‌డీ పట్టాలు ప్రదానం చేశారు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ)కి చెందిన గౌతం వేప బంగారు పురస్కారాన్ని అందుకున్నారు. బీటెక్‌లో ఆల్‌రౌండర్ పురస్కారాలు అభినీత్‌జైన్, సౌజన్య పొన్నపల్లి పొందారు. త్రిపుల్‌ఐటీ హైదరాబాద్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మెన్ రాజ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డాక్టర్ రెడ్డీస్ ల్యాబోరేటరీస్ సీఈవో జివి ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- డిప్యూటీ సీఎం కడియం శ్రీహరికి ఎస్ఎఫ్ఐ వినతి



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

రాష్ట్రంలోని పాఠశాలలు, కాలేజీల్లోని సమస్యలను పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని డిప్యూటీసీఎం కడియం శ్రీహరిని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ బృందం డిప్యూటీసీఎంను కలిసి వినతిపత్రం అందించింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎం నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ...రాష్ట్రంలోని ప్రయివేటు పాఠశాలల్లో ఫీజులను వెంటనే నియంత్రించాలని కోరారు. విద్యార్థులు లేరనే సాకుతో పాఠశాలలను విలీనం చేయడం సరికాదని అన్నారు. అనేక పాఠశాలలు, కాలేజీలు శిథిలావస్థకు చేరుకున్నాయనీ, వెంటనే నిధులు కేటాయించి నూతన భవనాలను నిర్మించాలని కోరారు. మేడ్చల్, దోమకొండ, వైరాలో కొత్తగా డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయాలని, నిజామాబాద్‌లో మహిళ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకానికి నిత్యవసర ధరలకు అనుగుణంగా మెనూచార్జీలను పెంచాలని కోరారు. స్వచ్ఛంద సంస్థల ద్వారా భోజనం తయారు చేస్తున్న చోట భోజనం నాణ్యతగా ఉండటం లేదని డిప్యూటీసీఎం దృషికి తీసుకుపోయారు. కాలేజీ, పాఠశాల విద్యార్థినులకు సానిటరీ న్యాప్‌కిన్స్ ఉచితంగా అందించాలన్నారు. కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో నిత్యవసర ధరలు పెరగడంతో మెనూ సక్రమంగా అమలు కావడం లేదన్నారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అనంతరం డిప్యూటీసీఎం కడియం శ్రీహరి మాట్లాడుతూ... స్కూల్స్ విలీనం చేయాలని ప్రభుత్వం ఎవ్వరికీ చెప్పలేదనీ, జిల్లా కలెక్టర్లు అక్కడి పరిస్థితులకు అనుగుణంగా మారుస్తున్నారని చెప్పారు. కొత్త డిగ్రీ కాలేజీలు ఈ సంవత్సరం ఇవ్వడం లేదని, వచ్చే విద్యాసంవత్సరం ఆలోచిస్తామని చెప్పారు. పాఠశాలల నిర్వహణ కోసం ఈ ఏడాది ఎక్కువ నిధులు కేటాయించామని తెలిపారు. విద్యారంగంలో ఏ సమస్య ఉన్నా వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ నాయకులకు కడియం సూచించారు. మంత్రిని కలిసిన వారిలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ రజిని, రాష్ట్ర ఉపాధ్యక్షులు నరేశ్, జావిద్, రాష్ట్ర నాయకులు సంతోష్, బుచ్చిరెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదే అసలైన జేడీ(యూ)

- నితీశ్ వేరే పేరుతో ప్రాంతీయ పార్టీ పెట్టుకోవచ్చు : శరద్‌యాదవ్ వర్గం

న్యూఢిల్లీ : అధికారికంగా జేడీ(యూ) తమకే చెందుతుందని ఆ పార్టీ సీనియర్ నేత శరద్‌యాదవ్ నేతృత్వంలోని వర్గం చెబుతోంది. పార్టీకి చెందిన 14 రాష్ట్రశాఖలు తమతోనే ఉన్నట్టు శరద్‌యాదవ్ సన్నిహితుడు అరుణ్ శ్రీవాస్తవ తెలిపారు. తమది జాతీయ పార్టీ అని, నితీశ్‌కుమార్ బీహార్‌కు మాత్రమే పరిమితమని శ్రీవాస్తవ అన్నారు. ఆయన సొంతంగా మరో పేరుతో ప్రాంతీయ పార్టీ పెట్టుకోవచ్చునని శ్రీవాస్తవ సూచించారు. శరద్‌యాదవ్ నేతృత్వంలోని జేడీ(యూ)లో నితీశ్‌కుమార్‌కు చెందిన సమతా పార్టీని విలీనం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా శ్రీవాస్తవ గుర్తు చేశారు.

శ్రీవాస్తవను నితీశ్ వర్గం ఇటీవలే ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తొలగించింది. శరద్‌యాదవ్ వర్గానికి ఇద్దరు రాజ్యసభ ఎంపీలు మద్దతు ఇస్తున్నట్టు తెలుస్తోంది. వారిలో ఒకరైన అలీఅన్వర్ అన్సారీని నితీశ్ వర్గం సస్పెండ్ చేసింది. మరో రాజ్యసభ సభ్యుడు వీరేంద్రకుమార్ కూడా యాదవ్ వర్గం వెంటే ఉన్నట్టు తెలుస్తోంది. కాగా, శరద్‌యాదవ్ కూడా రాజ్యసభ సభ్యుడే కావడంతో ఈ వర్గానికి ముగ్గురు ఎంపీల బలం ఉన్నట్టే.

వందేమాతరం పాడలేకపోయిన యూపీ మంత్రి

- ఇతరులకు చెప్పేంత వరకే బీజేపీ పాలకుల నీతులు

లక్నో: స్వాతంత్ర్య దినోత్సవంలో వందేమాతరం గీతాన్ని ఆలపించాలని మదరసాలకు ఆదేశాలు జారీచేసింది ఉత్తరప్రదేశ్ సర్కారు.అయితే ఆ రాష్ట్ర మంత్రే పాడలేక చేతులెత్తేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌కి చెందిన మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి బల్దేవ్ సింగ్ ఓ టీవీ ఛానెల్ నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని అన్ని పాఠశాలల్లో వందేమాతరం గీతాన్ని ఆలపించాలని మంత్రి కోరారు. అదే సమయంలో ఆయన్ని ఇంటర్వ్యూ చేస్తున్న టీవీ యాంకర్ వందేమాతరం పాడాలని కోరారు. కానీ బల్దేవ్ సింగ్ రెండు లైన్లు కూడా పాడలేకపోయారు. అంతటితో గమ్మునుండకుండా..ఇంటికెళ్లాక తానే ఫోన్ చేసి మరీ మొత్తం గీతం పాడి చూపిస్తానని చెప్పుకున్నారు. లైవ్‌లో మాత్రం నావల్ల కాదని చేతులు జోడించారు. వందేమాతరం పాడలేని బీజేపీ మంత్రిపై పలువురు సామాజికమాధ్యమాల్లో విమర్శలు గుప్పిస్తున్నారు.

కాశ్మీర్ వదిలి పారిపోతున్న ఉగ్రవాదులు : జైట్లీ

శ్రీనగర్ : కాశ్మీర్‌లో తలదాచుకున్న ఉగ్రవాదులు పారిపోతున్నారని కేంద్ర ఆర్థిక, రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. వారిపై ఒత్తిళ్లు పెరిగిపోయాయని అన్నారు. కాశ్మీర్ లోయలో దశాబ్దాల నుంచి ఉగ్ర కార్యకలాపాలు కొనసాగిస్తున్న మిలిటెంట్లు ప్రస్తుతం ఆత్మరక్షణలో పడ్డారని అన్నారు. ఆదివారం ఓ మీడియా సంస్థతో ఆయన మాట్లాడారు. పెద్ద నోట్ల రద్దు ప్రభావంతో ఉగ్ర కార్యకలాపాలకు అవసరమైన డబ్బులు సమకూర్చుకోలేకపోతున్నారని అన్నారు. విదేశాల నుంచి వచ్చే అక్రమ నిధులపై నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) కొరఢా ఝుళిపిస్తోందన్నారు. దీంతో, జమ్ము కాశ్మీర్ రాష్ట్రానికి విదేశాల నుంచి వచ్చే నిధులు క్రమక్రమంగా తగ్గిపోయాయని అన్నారు.

గ్యాస్ బండ రాయితీ

సబ్సిడీ రద్దైతే ఏడాదికి రూ.39.24 కోట్ల భారం

మోడీ 'మన్ కీ బాత్' సబ్సిడీ రద్దు చేయడమేనా ?

ప్రజాపంపిణీ నిర్వీర్యంపై వినియోగదారుల ఆగ్రహం

నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

ప్రధానమంత్రి మోడీ 'మన్ కీ బాత్' ఆలస్యంగా వెలుగులోకి వస్తున్నది. ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం ఆలోచన ఒక్కొక్కటిగా బయటపడుతున్నది. అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ధరలు తగ్గిస్తామన్న బీజేపీ, తగ్గించడం సంగతి పక్కకు పెట్టి.. ధరలను మరింత పెంచే చర్యలకు ఉపక్రమిస్తున్నది. ధరలపై పరోక్షంగా ప్రభావం చూపే పెట్రోల్, డీజిల్ ధరలను నెలవారి నుంచి ప్రతి రోజు సమీక్షించేందుకు అనుమతించింది. నిత్యావసర వస్తువుల ధరలపై దీని ప్రభావం పడుతున్నది. తాజాగా గ్యాస్‌పై సబ్సిడీని క్రమంగా ఎత్తివేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ పార్లమెంట్‌లో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆయన ప్రకటన ప్రకారం సిలిండర్‌పై ప్రతి నెల రూ.4 చొప్పున పెంచనున్నారు. వచ్చే ఏడాది మార్చి వరకు లేదా సబ్సిడీ పూర్తయ్యే వరకు ఏది ముందు అయితే అప్పటి వరకు ఈ పెంపు ఉండనుంది. సబ్సిడీ రద్దైతే వినియోగదారులపై ఏడాదికి రూ.39.24 కోట్ల వరకు భారం పడనుంది. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో సతమవుతున్న వినియోగదారుడి ఇది అదనపు భారం కానుంది. ఇక చౌక దుకాణాల్లో సరుకుల సంగతి చెప్పనక్కర్లేదు. బియ్యం, కిరోసిన్ మినహా మరేవి పంపిణీ కావడంలేదు. ఇందులో కిరోసిన్ ఎత్తివేసేందుకు కేంద్రం శరవేగంగా పావులు కదుపుతున్నది. బియ్యాన్ని నగదు బదిలీ కిందకు మార్చేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. కాగా, గతేడాది జూలై 1 నుంచి ప్రభుత్వ పరంగా ఆయిల్ కంపెనీలు ఒక్కో సిలిండర్‌పై నెలకు రూ.2 చొప్పున (విలువ ఆధారిత పన్నును కాకుండా) పెంచాయి. గత నెల 1న ఒకేసారి రూ.32 ధర వడ్డించాయి. మళ్లీ నెలకింత పెంచేందుకు రంగం సిద్ధమైంది. మార్చి నుంచి గ్యాస్ సబ్సిడీ ఉండదని ఇటీవలే ఆయిల్ కంపెనీలకు కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది.

భారం ఏడాదికి రూ.39.24 కోట్లు

రాష్ట్రంలో ఇండెన్, హెచ్‌పీ, భారత్ గ్యాస్ కంపెనీలు సేవలు అందిస్తున్నాయి. వీటిలో ఇండెన్‌కు 35.28 లక్షలు, భారత్‌కు 29.50 లక్షలు, హెచ్‌పీ గ్యాస్‌కు 20.74 లక్షల మంది వినియోగదారులున్నారు. మొత్తంగా గ్యాస్ వినియోగదారుదల సంఖ్య 85.52 లక్షల మంది ఉన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఇచ్చిన 'గివ్ ఇట్ అప్' పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 3.85 లక్షల మంది తమ సబ్సిడీని ఉపసంహరించుకోగా 81.67 లక్షల మంది సబ్సిడీని పొందుతున్నారు. వీరిలో డ్వాక్రా సంఘాల ద్వారా గ్యాస్ కనెక్షన్లు పొందిన పేద కుటుంబాలు ఎక్కువగానే ఉన్నాయి. ఈ లెక్కన 81.67 లక్షల మంది వినియోగదారులకు రూ.4 చొప్పున నెలకు రూ.3.27 కోట్ల భారం పడుతుంది. ఒక్కో వినియోగదారుడు ఏడాదికి 12 సిలిండర్లను వినియోగించుకోవచ్చు. అంటే 12 సిలిండర్లు వినియోగించుకుంటే ఏడాదికి రూ.39.24 కోట్లు అవుతుంది. రాష్ట్రంలో ప్రస్తుతం 14.2 కేజీల గ్యాస్ సిలిండర్‌ను రూ.572 .25 (ఈ నెల 1వ తేదీ ధర) అందిస్తున్నారు. (గత నెల 29న ధర రూ.613.50గా ఉంది.) దీంట్లో వినియోగదారుడి ఖాతాకు సబ్సిడీ మొత్తం రూ.85.75 జమ చేయగా రూ.486.50 సిలిండర్ వాస్తవ ధరగా ఉంది.



సబ్సిడీ కొనసాగించాలి

కుటుంబానికి అందించే వంటగ్యాస్ సిలిండర్‌పై భారం మోపడం అన్యాయం. సబ్సిడీని పూర్తిగా రద్దు చేయాలని నిర్ణయం తీసుకోవడం దారుణం. ప్రజాపంపిణీ వ్యవస్థలో సరుకులపై సబ్సిడీని రద్దు చేస్తూ పోతే ప్రభుత్వాలు ఎందుకు? ప్రజా వ్యతిరకేంగా పనిచేయకూడదు. ఎప్పటిలాగే సబ్సిడీ కొనసాగించి అన్నింటినీ పునరుద్ధరించాలి.

- మేఘన, గృహిణి, రంగారెడ్డి జిల్లా

నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

నెలలో పలుమార్లు గ్యాస్ ధరలను పెంచుతున్న కేంద్రం ఇలా సబ్సిడీని దూరం చేయడం సరికాదు. గత నెలలోనే రూ.32 పెంచారు. ఇప్పుడు సబ్సిడీ మొత్తం తొలగిస్తామంటున్నారు. దీనిని బట్టి సామాన్యులపై కేంద్ర వైఖరి స్పష్టంగా తెలుస్తున్నది. ప్రజలతో పెట్టుకున్న ప్రభుత్వాలు గంగలో కలిసిపోయాయి. బీజేపీకి అదే గతి పడుతుంది.

-ప్రజా సంఘాలు

పెట్టుబడి గ్రంథం ప్రాధాన్యత




బి.వి. రాఘవులు

- 7-

(గురువారం తరువాయి భాగం)

గతితార్కిక పద్ధతిని మనం అర్థం చేసుకోవడం, ఆ పద్ధతులను వినియోగించడం ముఖ్యమైన విషయం. పెట్టుబడి గ్రంథం చదువుతూ అటువంటి గతితార్కిక పద్ధతిని ఎక్కడ ఉపయోగించి వాటిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేశాడో దాన్ని మనం పరిశీలన చేస్తే పెట్టుబడి గ్రంథం అర్థమవుతుంది.. డబ్బుకీ పెట్టుబడికీ ఎంటీ తేడా.? నేనేదైనా వ్యాపారం పెట్టడానికొస్తే నీ దగ్గర ఎంత డబ్బుంద ని అడగవు. ఎంత పెట్టుబడి ఉందని అడుగుతావు. ఏంటి పెట్టబడి అంటే. అవే కాగితాలను ఒక చోట డబ్బుంటున్నాము. ఒక చోట పెట్టుబడి అంటున్నాము. మరోచోట అప్పంటున్నావు. డబ్బుకు ఈ లక్షణాలున్నాయా.? లేదా సమాజం కొన్ని లక్షణాలు ఇస్తుందా.? ఏంటి డబ్బుకీ పెట్టుబడికే తేడా. దాన్ని మనం అర్థం చేసుకోవాలి. డబ్బు పిల్లలు పెట్టదు. కానీ పెట్టుబడి పిల్లలు పెడ్తది. మీరు ఒక వంద రూపాయలు తీసుకెళ్లి బీర్వాలో పెట్టి 10 సంవత్సరాల తర్వాత చూశార నుకోండి.. ఏ చెమట్లో, గిమట్లో పడితే ఆ పది రూపాయలు కూడా ఉండదు. డీమానిటైజేషన్ వచ్చి దాన్ని రద్దు చేస్తే అది కూడా ఉండదు. కానీ అదే 100 రూపాయలు మీకు పెట్టుబడిగా ఇచ్చాననుకోండి. దాన్ని పిల్లలు పుట్టించేదానికి నీవు ప్రయత్నం చేస్తావు. 'సెల్ఫ్ ఎక్స్‌ప్యాండింగ్ మనీ ఈజ్ క్యాపిటల్' దానంతట అది పెరుగుతూ పోయే డబ్బుని పెట్టుబడి అంటాం. అట్లా పెరగడానికి పూనుకోని డబ్బు పెట్టుబడి కాదు. పెరగుతూ అన్నా పోవాలి. లేకపోతె తరుగుతూ అన్నా పోవాలి. నువు రెండొందల రూపాయలు పెట్టి ఫ్యాక్టరీ పెట్టేసి మరుసటి సంవత్సరం ఆ డబ్బులన్నీ అయిపోయాక తాళమేసేసినవంటే పెరగదు. కాబట్టి సెల్ఫ్ ఎక్స్‌ప్యాండింగ్ మనీ ఈజ్ క్యాపిటల్. డబ్బుకు కొన్ని సందర్భాల్లో అటువంటి లక్షణం వస్తది. ఆ లక్షణం డబ్బుకు ఎట్లా వస్తుంది. ఎవరైనా రెండు జంతువులు పెంచుకున్నారనుకో పిల్లలు పెట్టేదానికి అవకాశముంటది. కానీ డబ్బు అలా కాదు. ఆ డబ్బుని అదనంగా డబ్బు తయారు చేయాలంటే ఆ డబ్బులో లేదు. అది సామాజిక సంబంధాల్లో ఉంది. ఆ సామాజిక సంబంధమేంటో మనం పరిశీలన చేస్తే అప్పుడు పెట్టుబడి, ఆర్థిక శాస్త్రం అర్థమవుతుంది. కానీ అటువంటి సంబంధం డబ్బుకే శక్తేదో ఉన్నట్టు పెట్టుబడిదారులు చెప్తారు. ఇదిగో ఈ డబ్బును తీసుకెళ్లి సరుకుని రూపాయలకు కొని 12 రూపాయలకు అమ్మావనుకో అదనపు డబ్బు వచ్చేస్తుంది. అదీ పెట్టుబడిదారులు చెప్పేది. వాస్తవం 10 రూపాయల సరుకును 12 రూపాయలకు అమ్మితే వస్తుంది కదా లాభం. ఆ డబ్బును పెట్టుబడి అనొచ్చు కదా.? అనొచ్చు. కానీ నేను పది రూపాయల సరుకుని మీకు 12 రూపాయలకు అమ్మితే వాస్తవంగా అది పుట్టడం కాదు. ఈ మధ్య ఆస్పత్రుల్లో దొంగతనంగా పిల్లల్ని ఎత్తుకెళుతున్నారు. అదనంగా పిల్లలేమీ పుట్టరు. ఈ పిల్లలను వాడు దొంగతనం చేయడం వాళ్ల పిల్లలను వీడు దొంగతనం చేయడం అది. 10 రూపాయల సరుకుని 12 రూపాయలకు అమ్మడమంటే అమ్మక ముందు ఇద్దరి దగ్గరా కలిపి 22 రూపాయలు ఉన్నాయి. అమ్మిన తర్వాత కడా ఇద్దరి దగ్గర కలిపి 22 రూపాయలున్నాయి. అదనపు డబ్బునేమీ పుట్టియ్యలేదు. నేను పది రూపాయల సరుకుని 12 రూపాయలకు అమ్మానంటే అమ్మినోడు లాభ పడ్డాడు. కొన్నోడు నష్టపోయాడు. నేను ఇంకోసారి కొంటాననుకో అప్పుడు నేను నష్టపోతాను. ప్రతీ మనిషీ ఆర్థిక వ్యవస్థలో బతకాలంటే వాడు అమ్మకం దారు, కొనుగోలు దారుగా ఉండాల్సిందే. కొనుగోలు దారునిగా మోసపోతే అమ్మకందారునిగా లాభపడుతాడు. అమ్మకం ద్వారా లాభపడితే కొనడం ద్వారా నష్టపోతడు. ఈ మోసాల ద్వారా డబ్బులేమీ పిల్లలు పెట్టవు. మార్క్స్ ఇవన్నీ చెబుతూ ఆఖరికి ఈ వ్యాపారం ద్వారా డబ్బులు రావు. దొంగతనాల ద్వారా డబ్బులు రావు. వ్యాపారాల ద్వారా సంపద మార్పిడవుతుంది. ఒకచోటి నుండి ఇంకో చోటికి. కానీ సంపద మాత్రం ఉత్పత్తి కాదు. సంపద ఉత్పత్తి కావడానికి మార్గమెక్కడున్నదో అక్కడికి పోవాలి. అందుకని దొంగతనాలు, దోపిడీలు, వ్యాపారాలు సమాజం యొక్క ఉపరితలంలో జరుగుతాయి. ఉత్పత్తి కర్టెన్ వెనక జరుగుతుంది. ఉత్పత్తి ఫ్యాక్టరీలో జరుగుతుంది. కాబట్టి ఈ మార్కెట్‌లను ఒదిలేసి, బజార్లనొదిలేసి ఫ్యాక్టరీ దగ్గరకెళితేనే మనకు సంపదకు మూలమెక్కడో అర్థమవుతుంది అనీ చెబుతాడు. ఫ్యాక్టరీలో అంటే



యంత్రము, కార్మికుడు, పనీ, పెట్టుబడిదారుడు అక్కడ ఉత్పత్తి చేసే దాంట్లోంచి ..అందుకని ఇక్కడ నేను చెప్పదల్చుకున్నదొకటే. మనం పెట్టుబడిదారీ వ్యవస్థను పైపైన చూస్తే అర్థం కాదు. లోపలికెళ్లి చూడాలి. ఇదీ ఒక అంశం. అందుకని పెట్టుబడి గ్రంధాన్ని అధ్యయనం చేయాలంటే ఒక ముఖ్యమైన విషయం. ఇదీ అన్నిటికంటే ముఖ్యమైనది. పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క ముఖ్యమైన స్వభావమేంటంటే.. దీన్ని మోసం చేయడం అని అనలేముగానీ మిస్టిఫికేషన్ అంటాం. మరుగున పర్చడం అంటాం. ఉన్నది ఉన్నట్టు మనకు తెలియకుండా ఆ వాస్తవాలను మరుగుపర్చే స్వభావం పెట్టుబడిదారీ వ్యవస్థకి ఉన్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క ముఖ్యమైన స్వభావం అదే. ఇందాక చెప్పాను కదా సూర్యుని కథ. ఎప్పుడూ ఇది మనల్ని మభ్యపెడతా ఉంటది. వాస్తవాలను చూడనీయదు. దీని వాస్తవాల్ని చూడాలంటే ఒక శాస్త్ర పద్ధతిలో చూస్తేనే మనకు అర్థమవుతుంది. గురుత్వాకర్షణ శక్తిని మనం చూడలేము. కానీ శాస్త్ర పద్ధతిలో చూస్తే, ప్రయోగాలు చేస్తే మనకు గురత్వాకర్షణ శక్తి అర్థమవుతుంది. అలాగే సూర్యుడు పొడవడం లేదు. కుంగడం లేదు అని అర్థం కావాలంటే. మనకు చిన్నపుడు కథలు చెప్పేది. మీరు సముద్రం ఒడ్డు దగ్గరకు వెళ్లండి ఒక పడవను చూడండి ఆ పడవను దూరం నుండి చూసినపుడు ఒక గొట్టం మాత్రమే కనబడుతుంది. దగ్గరకొచ్చే కొద్దీ మీకు కొద్ది కొద్దిగా ఎక్కువ కనబడుతుంది. దగ్గరకొస్తే ఫుల్‌గా కనబడుతుంది. ఎందుకంటే భూమి గుండ్రంగా ఉంది కాబట్టి దూరంగా ఉన్నపుడు పొగ్గొట్టమే కనబడుతుంది అని మనకు చెబుతారు. కానీ ప్రయోగం చేసే వరకు మనకు భూమి గుండ్రంగా ఉందని అర్థంకాదు. మనకు సూర్యుడే తిరుగుతున్నట్టు భూమి స్థిరంగా ఉన్నట్టు అర్థమవుతుంది. అందుకని పెట్టుబడి గ్రంథంలో ఉపోద్ఘాతం రాస్తారు. ఈ పెట్టుబడి గ్రంథం అంత సులభంగా లేదే అని చాలా మంది అనుకుంటరని. శాస్త్రమెప్పుడూ సులభంగా ఉండదు. శాస్త్రం కష్టపడి చదివితేనే అర్థమవుద్ది. మీరు కూడా కష్టపడండి, అర్థంచేసుకోండి అని పెట్టుబడి గ్రంథంలో చెబుతారు. కాబట్టి మీరు సులభంగా అర్థం చేసుకోవాలని పైపైన చదివితే పైపైన దృగ్విషయాలు కనబడుతయ్.

(తరువాయి భాగం గురువారం సంచికలో)

'నా కొడుకుల' పాలిటి పిశాచి ఎవరు ?



డాక్టర్ చెరుకు సుధాకర్

కేసీఆర్ నోరు పారేసుకోవడం, కొత్తేమీ కాదు. నచ్చిన విషయాన్ని ఇతరుల హృదయాలకు హత్తుకునేట్టు చెప్పడం ఎంత గొప్పో, నచ్చని విషయాన్ని సున్నితంగా ఎరుకజేయడం కూడ అంతే గొప్ప. ఎందుకో నిండా మూడేండ్ల అధికారానికే కేసీఆర్ అలవికాని అసహనాన్ని, హద్దులు దాటిన అహంకారాన్ని, చౌకబారు భాషను ఒక్కసారి మొన్న నేరెళ్ల, మియాపూర్, మల్లన్నసాగర్, ఉద్యోగుల క్రమబద్ధీకరణ, పబ్బులు, డ్రగ్స్ అంశాలను జోడిస్తూ ప్రతిపక్షాలపై, ప్రజా సంఘాలపై, ఒక్క మాటలో కేసీఆర్ పాలనలో లోపాలను ఎత్తి చూపిస్తున్న ప్రతి ఒక్కరిపై ఉపయోగించి పుట్టెడు అపవాదును మూట కట్టుకున్నారు. చానా రోజులకు మా సారు నోరు 'మోరీ' కంటే వన్స్‌మోర్ పంచ్‌తో పేలిందని పాలాభిషేక భక్తులు ఉప్పొంగి పోవచ్చు. మమ్మల్ని వదిలేసి ఫలానా ప్రతిపక్షాన్నే తిట్టిండ్రని ఇంకొకరు పొంగిపోవచ్చు. కొందరు కుల దురహంకారంతో మాజీ పార్లమెంట్ స్పీకర్ మీరాకుమార్‌నే బోరా కుమార్ అని అవహేళన చేసినందుకు కుంగిపోవచ్చు, ఆగ్రహంతో మండిపోవచ్చు. పిశాచ గణాధీశులుగా కొత్త బిరుదు పొందిన విలన్‌లు దుమ్మెత్తి పోయొచ్చు. 164 కేసుల్లో ప్రభుత్వం బోనులో నిలబెట్టబడిన సంగతి భక్తజనులు మర్చిపోవచ్చు. ఇవన్నీ ఒక ఎత్తయితే 15యేండ్లు పక్షిలెక్క తిరిగిననాడు ఈ నాకొడుకులు ఏడికిబోయిండ్లు. కమ్యూనిష్టు నా కొడుకులు, కాలం చెల్లిన సిద్ధాంతాలతో ప్రజల్ని తప్పుదోవ పట్టించేటోల్లు, కాంగ్రెస్ విలన్, భూతం, పిశాచి నా కొడుకులు, ఉద్యమాలు చేసినామనే 'నా కొడుకులు', అన్న మాట కేసీఆర్ ఇప్పటిదాక వెళ్ళగక్కిన వాచాలత, అహంకారం, సంస్కారం లేని, సభ్య సమాజం అంగీకరించని అన్ని వ్యక్తీకరణలకంటే అభిశంసించతగింది,

తెలంగాణలో హక్కుల కోసం అడిగినోళ్ళు నాలాంటి వాడు టీఆర్‌యస్‌లో పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఉంటూనే పీడీ యాక్ట్‌తో జైల్లో ఉంటే అధినేతగా కేసీఆర్ నోరు తెరవకున్నా విడుదల కోసం ఉద్యమించినోళ్ళు, తెలంగాణ జేఏసీగా కేసీఆర్అధికారంలో రావడానికి కారణమైనోళ్ళు సడన్‌గా 'నా కొడుకులు' అయ్యిండ్రు.

15యేండ్లలో తన రాజకీయ జీవితాన్ని బలిపెట్టి ఉద్యమాన్ని నడిపినానని చెప్పుకోవడం 'అబద్ధంలో కెల్లా అబద్ధం'. ఆయన డిప్యూటీ స్పీకర్ పదవి ప్రమాదంలో ఉన్నప్పుడే రాజీనామాకు సిద్ధమై బషీర్‌బాగ్ కాల్పులపై చంద్రబాబుకు లేఖతో బయిటికి వచ్చే ప్రయత్నం చేసింది నిజం కాదా? మొదటి 2004 ఎన్నికల్లోనే ఆయన, హరీశ్‌రావు మంత్రులై అమెరికా నుండి కొడుకును, అత్తవారింటి నుండి బిడ్డను పిలిపించి, ఈ చెయ్యి కింద సంతోష్‌రావును, ఆ చెయ్యికింద దామోదర్‌రావును ఇరికించుకుని, వ్యాపారాలు, చీకటి స్నేహ హస్తాలు, ప్రతి ఉపఎన్నిక క్రీడలో కోట్లు వెనకేసుకుని ఎన్ని మాయదారి, వంచనా శిల్పాలు చెక్కుతున్నా చెక్కు చెదరని ఆత్మవిశ్వాసంతో టీఆర్ఎస్‌లో ఉంటూనే బయటి ప్రజా సంఘాలను, మిలిటెంట్ శక్తులను కూడదీసి, ఉద్యమానికి కొత్త డైమెన్షన్స్ ఇచ్చిన మేము తెలంగాణలో 'నా కొడుకులం' అయినాము... 2001 ఏప్రిల్, 27కు ఆరు నెలల ముందు వి. ప్రకాష్ కోరిక మేరకు నేను కేసీఆర్‌కు ఫోన్ చేస్తే అందుబాటులో రాకపోతే ప్రకాష్ సర్దిచెప్పి ఒక నెల రోజులు ఆగి మళ్ళీ ఫోన్ చేద్దాం, చంద్రబాబునాయుడు మళ్ళీ ఏదో పిలిచి మాట్లాడుతారట అన్నది నిజం కాదా? ఇప్పుడు తెలంగాణలో కేసీఆర్ తిట్ల దండకం, కటింగ్ ప్లేయర్ పార్టీ స్టైల్ సమజ్ అయినోనికి సమజ్ అయినంత. కేసీఆర్ బాబు ప్రక్కన కోస్తా యాసలో 'జన్మభూమి' ఉపన్యాసాలు ఇచ్చి తన్మయత్వంలో ఊగిపోతున్నప్పుడు భారతీయ జనతా పార్టీలో జంగారెడ్డి, మేచినేని కిషన్‌రావు, మందాటి సత్యనారాయణ రెడ్డి, కాంగ్రెస్‌లో చిన్నారెడ్డి, జీవన్‌రెడ్డి, ఆమోస్, బియస్‌పి, నక్సలైట్ పార్టీల్లో అనేక మంది, కమ్యూనిస్టు పార్టీల్లో తెలుగుదేశం అంతర్గతంగా ఎంతో మంది, బయట నేను, గాదె ఇన్నయ్య, గద్దరన్న, మారోజు వీరన్న, ఉ.సా, బియ్యాల జనార్ధన్ రావు, బుర్ర రాములు, పోశెట్టి, భరత్, బెల్లయ్య నాయక్, వినయ్ కుమార్, మహేందర్ రెడ్డి, జయశంకర్ సార్‌తో, కాళోజీతో కేశవరావు జాదవ్‌తో, ఎంత మందిమి కలిసి కదమ్ తొక్కితే తెలంగాణ తొవ్వ ఏర్పడింది? ఎంత మంది బెల్లి లలితలు ముక్కలు ముక్కలైతే తెలంగాణ ఉద్యమ చిత్రం రూపు కట్టింది!. ఎన్ని గాయాల గొంతులు జీరపోతే, కంజెరలై మోగితే, గూడ అంజన్న, గోరేటి వెంకన్న, అందెశ్రీ, జయరాజ్, మిత్ర పాటలుగా తెలంగాణ జీవనాదం బతికింది? ఇంత నెత్తురు, త్యాగం సాకబోసిన తెలంగాణ రాష్ట్రంలో తొలి ముఖ్యమంత్రిగా తొలి దళిత ముఖ్యమంత్రి వాగ్దానాన్ని తుంగలో తొక్కి, అధికార పీఠమెక్కి కేసీఆర్ వాడిన 'నా కొడుకులు' భాష ఒక్క క్షణం కూడ నాలాంటి ఉద్యమకారున్ని నిమ్మలంగా ఉండనిస్తలేదు. కుల దురహంకారంతో కేసీఆర్ ఎంత అంటే, చిన్న సార్లు, ఎస్పీలు, డీఎస్పీలు, విశ్వజిత్ లెక్కన అంతే అనిరి. 'ఫ్రెండ్లీ పోలీస్' టైటిల్‌తో 'నేరెల్లది చిన్న సంఘటన' అని నాయిని నర్సింహ్మారెడ్డి అంటే ఇప్పుడు ప్రగతి భవన్ దగ్గర, మల్లన్న సాగర్, ధర్నా చౌక్, ఎనుబాముల-ఖమ్మం మార్కెట్ యార్డు దెబ్బలు ఎవరికి చెప్పుకోవాలి? తమ బతుకుల్ని బుగ్గి చేస్తున్న లారీని అగ్గిపెట్టి తగలబెడితే అరాచకం, సహించం అన్న కేసీఆర్, నకిరేకల్‌లో సీమాంధ్ర బస్సులపై తెలంగాణ ఉద్యమకారులు రాళ్ళు విసిరినప్పుడు "సుధాకరన్నా! డిజిటల్ సౌండ్ వస్తుంది కానీ లైటింగ్ ఎఫెక్ట్ వస్తే బాగుండు" అని ఢిల్లీ నుండి ఫోన్ చేసి అగ్గి బోద ఎందుకు చేసినట్టు? లాబీయింగ్‌లో లాభం వస్తే మంత్రి పదవులు అల్లుడు, మామ పంచుకున్నారు. ఆత్మబలిదానాలకు 'అగ్గిపెట్టె' అందించి తమ పెట్టెలో 'త్యాగాల' 'ఎకౌంట్' వేసుకున్నారు. మాలాంటి వాళ్ళం 'నకిరేకల్ 'మానుకోట' మిలియన్ మార్చ్'గా మిలిటెంట్ పోరాటాలు చేస్తే ఆ మంటల్లో చలి కాసుకోని తామేదో 'పోరాడినట్టు' మిగత వాళ్ళను 'నా కొడుకులు' అని సంభోధిస్తున్నారు. దబ్బనాలు వాళ్ళు గుచ్చి ఎందుకు సీపీఐ(ఎం)ను వాళ్ళను దబ్బనాల పార్టీ అనడం బరితెగించిన వంచనాశిల్పం యాభై వేల పుస్తకాలు చదివిన భాషా పాండిత్యం అంటే "బూతు పంచాంగం"గా తప్పుడు తర్జుమా చేసుకొని 'నా కొడుకులు' భాషగా దిగజారి పార్లమెంటరీ భాషను అవహేళన చేస్తుంటే 'నాగేటి చాల్లల్ల' యుద్ధబీజాలు వేసినవాళ్ళు ఏం చేస్తున్నారో?.

మీరు 'నా కొడుకులు' అని తూలనాడితే ఏనాడూ తెలంగాణ ఉద్యమంలో లేని 'నా కొడుకులు' అటు ఇటు మంత్రులుగా, బంగారు తెలంగాణ మాంత్రికులుగా భూత వైద్యం చేస్తుంటే ఎవరు మాత్రం ఏమి చేయగలరు. కేసీఆర్ గారు? మీరు ఫాం హౌస్, ప్రగతి భవన్ నుండే ప్రతిపక్షంపై రంకె వేస్తే ఊగిపోతున్న ఈ దౌర్జన్యం, రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి రెచ్చగొడితే ఎట్లుంటదో తెలియని 'గొర్లము' కాము మేము. మూడేండ్లుగా మీరు ఊదరగొట్టిన రీ-డిజైన్ ప్రాజెక్టులు, ట్విన్ టవర్ భవనాలు, మిషన్ భగీరథ ఇంటింటి నల్లాలు, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు, దళితులకు మూడు ఎకరాల భూమి, పొంగి పొర్లుతున్న గొర్లు, బర్లు, చేపలు, పందులు.... అనేక జీవరాశి ఏడ కూడా సంకల ఉండక, కింద దిగక పాలోడెవడో పగోడెవడో సొంపక - గుడ్డి జనం, పార్టీలు గుడ్డి ద్వేషంతో 'నా కొడుకులు' చేస్తున్నా నానా యాగీ మీరెట్ల సహిస్తారు?. దయగల ప్రభువులు! ధర్నా చౌక్ నగరం అవతల ఉండాలని ఇందిరా పార్క్ నుండి బయటకు తరిమినంక చంచల్‌గూడా, చర్లపల్లి జైలు పట్నంలో ఎందుకు? "ఆరుబయట జైలు"ను ఔటర్ రింగ్ రోడ్డుకు పట్టుకరాండీ. మెసిలిన ప్రతీ ' నా కొడుకుని' బంజర్ దొడ్లో కమ్మినట్టు కమ్ముదాం... వీలైతే కుమ్మదాం!. - ఇదే కదా మొన్నటి మీ ధర్మబోధ - ఏ పాఠమైనా వొంటికి పట్టాలంటే ఓటర్ దగ్గరికే పోవాలి.

సెల్: 9000600744

లంబాడీల జీవితాలు దుర్భరం



ఎం. ధర్మనాయక్,

దేశంలో లంబాడీలు, బంజారాలు తాండాలుగా అసమానతలతో వెనకబడి ఆర్థిక జీవనం కొనసాగిస్తున్నారు. రెండవ ప్రపంచ యుద్ధం అనంతరం సైన్యంలో చేరి పనిచేశారు. ఎడ్లబండిపై ఉప్పు అమ్ముకుంటూ సంచార జీవనం సాగించారు. ఇప్పుడు ఆర్థిక వనరులు సరిగా లేక వంట చెరకు, అటవీ ఫలాలు, పశువుల సంపదను ఆసరా చేసుకొని జీవిస్తున్నారు. దేశంలో లంబాడీలు (బంజారా) ప్రత్యేకంగా తండా సముదాయంతో భాష, వేష, పండుగలు, పెండ్లిండ్లు, పంచాయితీలు కూడా ప్రత్యేకమైన విగా వీరి చరిత్ర ఉంది. ఎవ్వరూ వీరి జీవితం గురించి చరిత్ర గురించి సంపూర్ణంగా రాయలేదు. దేశంలో 28 రాష్ట్రాలలో 420 జిల్లాల్లో ఏడుకోట్ల జనాభా ఉన్నారు. 96.76శాతం హిందువులు గా, 3.08 క్రిస్టియన్స్‌గా, 0.01 జైనులుగా, 0.04 ముస్లింలుగా, 0.02 ఇతర మతాల వైపు ఆకర్షితులయ్యారు. 12శాతం పురుష లు, 3 శాతం మహిళలు మాత్రమే చదువుకున్నారని అంచనా. 15 రాష్ట్రాల్లో లంబాడీలు అధికంగా గోర్‌బోలీ భాషలు మాట్లాడుతు న్నారు. హిందీ, తెలుగు, కన్నడ, మరాఠా, మార్వాడీ, బెంగాలీ, దుండారీ, చత్తీస్‌ఘర్, బాగ్రీ, గుజరాతీ, మాల్వీ, మోవాలీ, మేర్‌వా రీ, ఒడిస్సా, సిక్వాడీ, లంబాడీ, గోర్‌బోలీ దేశంలో అభివృద్ధికోసం ఆర్టికల్-8 ఉన్నది. భాషను అభివృద్ధి చేయడంలో కేంద్ర ప్రభు త్వాలు ముందుకు రావడంలేదు. దేశం మొత్తం మీద లంబాడీలకు పండుగలు ఏడు మహిళా దేవతలను వాటితోపాటు ప్రకృతిని ఆరాధించడం వారి సంప్రదాయం. తీజ్ మత్రాల్ సిక్లా, కంకాళీ, ఇంగ్లా, మేరామ, డ్వాళ్ ఆంగళ్, సేవాలాల్‌లను పూజిస్తారు. తరతరాలు గా వున్న లంబాడీ భాష కనుమరుగవు తున్నది. మనం మాట్లాడుదాం - మన భవిష్యతరానికి మాట్లాడనిద్దాం! దేశంలో 53శాతం లంబాడీలుగా, 25శాతం బంజారాలుగా, 18శాతం ఇతర పేర్లతో పిలువబడుతున్నారు.

చౌహాన్ (6 గోత్రాలు) రాథోడ్ (27 గోత్రాలు), పమార్ (21 గోత్రాలు) జాదవ్ (61 గోత్రాలు) పైచిలుకుగా ఉన్నాయి. బంజారా ప్రత్యేక వస్త్రాధారణతోపాటు వారి దగ్గర తులం బంగారం తో చేసిన ముక్కుపుడక, కిలో వెండితో ఆభరణాలు, పంచలోహాలతో కలిసి ఆభరణాలు వారి ప్రత్యేక అలంకరణ. వీటితోపాటు ఆటలు, పాట లు, డ్యాన్సులు కూడా చెప్తారు. వీరికి రావాల్సిన సంక్షేమ ఫలాలు, విద్యా, వైద్య, భూమి, నీళ్ళు, నిధులు, అభివృద్ధి ఫలాలు అందడంలేదు.



లంబాడీలను వివిధ రాష్ట్రాల్లో పిలిచే పేర్లు

తెలంగాణ	-	లంబాడీ, బంజారా
ఆంధ్రప్రదేశ్	-	సుగాలి, లంబాడీ
ఉత్తరప్రదేశ్	-	బంజారా
హర్యానా	-	సిరికివాలా
బీహార్	-	వనజారా
మధ్యప్రదేశ్	-	బంజారా
జార్ఖాండ్	-	వనజరా
చత్తీస్‌ఘడ్	-	బంజారా
కర్ణాటక	-	లమాణీ, లంబాడీ
తమిళనాడు	-	సుగాలి
కేరళ	-	గోర్, గౌర్యా
రాజస్థాన్	-	గవారియా
పంజాబ్	-	సిరికివాలా
మహారాష్ట్ర	-	గవర, కంగ్‌సిమా
ఢిల్లీ	-	సిరికి బాంద్
ఒడిస్సా	-	లంబాడీ

కాలం మారుతుంది. ఏ జాతి చైతన్యం అయినా మారు తుంది. మార్పు అనేది సహజం. పాతది వదిలేసి కొత్తది కోరుకో వడం అవసరం. మార్పుకు అనుగుణంగా సమాజ అవసరాలకు తీర్చిదిద్దుకోవడం చరిత్ర. 17వ శతాబ్దంలో తండాలుగా ఏర్పడ్డాయని చరిత్రకారులు చెపుతున్నారు. అప్పటి నుండి భూమి లేనివారుగా ఉన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, సంస్కృతుల్లో శాస్త్ర సాంకేతికాల్లో అభ్యుదయంగా మలచుకో వాల్సిన అక్షరాయుధం నేటికీ లంబాడీల దరి చేరలేదు. అందుకే వారి చరిత్ర, జీవన విధానం ఎక్కడా రాయబడలేదు. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచకీరణ వైపు పెట్టుబడిదారీ చేతుల్లోకి వనరులు వెళ తున్నాయి. భాషా శాస్త్రవేత్త సాహితీ అకాడమీ పురస్కార గ్రహీత పీపుల్స్ లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా (పిఎస్ఎల్ఐ) చైర్మన్ గణేష్, ఎన్. దేవిలు 780 భాషలకు 400 భాషలు అంతరించే పరిస్థితి ఉందన్నారు. 30 భాషలు మాత్రమే వాడుకలో ఉన్నాయి. లంబాడీ భాష, గోర్‌గోలీని రక్షించుకోవాల్సిన అవ సరం ఉంది. 250 భాషలు అంతరించాయన్నారు. గిరిజన లంబాడీ తండాల మీద దాడి మొదలైంది. వారి పండుగల్లో బ్రాహ్మణులు వచ్చారు. వ్యాపారంలో, మార్కెట్స్‌లో కూడా పెట్టుబడిదారులు ప్రవేశించారు. లంబాడీలు అడవిలో లభించే వంటచెరకును అమ్ముకునే పరిస్థితి లేదు. తినే తిండిలో మార్పు వచ్చింది. ప్రైవేటీకరణ జోరు పెరిగింది. చివరికి తండాలను కూడా లేకుండా చేయాలనే కుట్ర జరుగుతున్నది. ఆచార వ్యవహారాల్లో, పంటపొలాల్లో, తిండిలో, పాడే పాటల్లో, ఆడే ఆటల్లో కూడా మార్పు వస్తున్నది. తండాల్లో ఇప్పటికీ ఉదయాన్నే కోడి కూస్తే లేవడం, పొద్దుపోకముందే రాత్రి భోజనం చేసే పరిస్థితి ఉంది. దేశం మొత్తం మీద ఉన్న బంజారాల్లో బోర్‌బోలీని వారి ఆచార వ్యవహారాలను చైతన్య పరుస్తూ వారికి అన్ని రకాల సంక్షేమ ఫలాలు ఆర్థిక వనరులను ఉపాధి అవకాశాలు కల్పించి రక్షించుకోవాలని ప్రభుత్వంపై వత్తిడి తీసుకొద్దాం, సాధిద్దాం.

సెల్ : 9490098685

ప్రతికూల ప్రభావం చూపని కార్యక్రమాలు కావాలి




ఫణి మాధవి కన్నోజు

నేటి మన జీవన విధానంపై అనేక రకాల ప్రభావాలు అందులో మరీ ముఖ్యంగా సామాజిక మాధ్యమాలు, సినిమాల ప్రభావం ఎంతో అందరికీ తెలిసిందే. చిన్న, పెద్ద వయోబేధం లేదు. కుల, మత, పేద, ధనిక తారతమ్యం లేదు. ప్రతీ ఒక్కరూ వీటి ప్రభా వానికి గురి కావలసిందే. ప్రతి నట్టింట్లో వచ్చి చేరిన టెలివిజన్, అరచేతిలో విశ్వాన్ని చూపే మొబైల్ ఫక్షన్ మనపై చూపే ప్రభా వం చెప్పతరం కాదు. నిత్యావసర వస్తువుల జాబితాలో చేరిపోయిన ఈ రెండు వస్తువులు చూపే ప్రభాం కొంత అ నుకూలమైనది ఉన్నా, ప్రతికూల ప్రభావాలు కాస్త ఎక్కువగానే ఉన్నా యి. సినిమా ఫోన్ కన్నా ప్రతి ఇంట్లో చిన్న, పెద్ద ప్రతి కుటుంబ సభ్యు లకు సులభంగా చేరువవుతున్న ప్రసార సాధనం టెలివిజన్. కాబట్టిట ఈ టెలివిజన్ చానల్స్ సమాజం పట్ల కొంత బాధ్యతను కలగి ఉంటా యి. వాణిజ్యపరమైన లాభాలు తేలేని కార్యక్రమాలు ప్రసారం చేయలే ని ఆశక్తత వారికుండి ఉండవచ్చు. కానీ వాణిజ్యంతో పాటు కాస్త విలు వలు గల కార్యక్రమాలు రూపొందించటం వారి బాధ్యత కూడా అని మాలాంటి సామాన్య, సాధారణ గృహిణులైన మహిళల అభిప్రాయం. మేము మా పిల్లలు కలిసి కుటుంబ సభ్యులు యావత్తూ సాగదీస్తారో వాళ్లకే తెలియాలి. వాటిని వదిలేయండి. కొంత మందికైనా ప్రయోజ నం కలిగించే పాటలు, నృత్యాలు పోటీల వంటివి పక్కన పెడితే కొంత విజ్ఞానానికి సంబంధించి క్విజ్ కార్యక్రమాలు వంటివి ఎక్కడో ఒకటి ఉంటున్నాయి. అర్థం కానిదేంటంటే ఒకరెవరో వెకిలి చేష్టలు, మాట లు, ద్వంద్వార్థాలే హాస్యం అనే రీతిలో కార్యక్రమం రూపొందించి, ప్ర సారమై దానికి మంచి టీఆర్‌పీ రేటింగ్ వచ్చింది కదాని అదేదో ప్రేక్షకు లంతా కోరుకునే వినోదం అనేనుకుంటూ మిగతా ఛానల్స్ అన్నీ అ లాంటివి చూపిస్తే అదేదో గొప్ప ప్రోగ్రాం అనుకుని మిగతా ఛానల్స్ అ నుకరించడం ఏం .. సరే.. వినోదమే ప్రధానం అనుకుంటే అదే మోస లో ఎందుకు దానికి భిన్నంగా ఒక మంచి ఆరోగ్యకరమైన, ఆహ్లాదకర మైన వినోదాన్ని అందించలేరా? భిన్నంగా ఆలోచించలేరా? ఆ సృజనాత్మకత లేదా?

విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించే కార్యక్రమాలు అడపా దడపా ఎక్కడో ఒక చోట కనిపిస్తూ ఉంటాయి. వాటి ప్రసార సమయం తక్కు వే. సమాజంపైన అనుకూలమైన ప్రభావం చూపకపోయినా ఫర్వాలే దు. ప్రతికూల ప్రభావం చూపే కార్యక్రమాలు నియంత్రించితే మంచి దని మాలాంటి సామాన్య ప్రేక్షకుల అభిప్రాయం. ఇలాంటి అసంతృ ప్తితో ఉండేవాళ్ల కోసమేనా అన్నట్టు ఈ మధ్య ఒక కార్యక్రమం ప్రారం భమైంది. పుస్తక పఠనం, పుస్తకాలు చదవటం మృగ్యమైపోయింది. ది న పత్రికలు చదవడమే బోర్‌గా ఫీలవుతోంది ఇప్పటి తరం. సాంకే తిక విజ్ఞానం అమమాంతంగా అందుబాటులోకి వచ్చాక పుస్తకాలు చదవ డం తగ్గింది. మంచి పుస్తకాలు పరిచయం చేయడం ఉపయోగకరం.

సెల్: 7659834544

తెలంగాణ వైతాళికుడు సామల సదాశివ



దూలం యల్లయ్య

సంగీత సాహిత్య సమలంకృత ధన్యజీవి డా॥ సామల సదాశివ. ఆదిలాబాదు అనగానే మనకు ముందుగా గుర్తుకు వచ్చే వ్యక్తులు ఇ ద్దరే ఇద్దరు. ఒకరు "అభినవ పోతనగా వాసికె క్కిన మహకవి శ్రీమాన్ వానమామలై వరదా చార్యు లు. రెండవ వ్యక్తి సామల సదాశివ. అ తని వా క్యం ఎంత నిరాడంబరతను కలిగి ఉం టుందో అతని జీవితం కూడా అదే మాదిరిగా ఉంటుం ది. అనేక భాషారామాలలో విహరిస్తూ, పలు కుల తల్లికి తమ కవితల ద్వారా నీరాజనములందించాడు. అనేక ప్రతిభాపురస్కారాలను అందుకోవడమే కాక పలు విశ్వ విద్యాల యాల నుండి గౌరవ డాక్టరేట్‌లను పొందిన ధీశాలి. ఉర్దూ సలహా సంఘ సభ్యుడుగా, విశ్వ విద్యాలయ గేజిటేట్ మెంబర్‌గా పదవీ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన తెలంగాణ ముద్దుబిడ్డ సదాశివ. సదాశివ బహుభాషా కోవిదుడు.ఆయనకుసంస్కృతం, హిం దీ, ఆంగ్లం, ఉర్దూ, ఫారసి భాషలో కూడా ప్రావీణ్యం ఉంది.చాలా మంది ఉర్దూ, పారసీ,హిందీ కవులు, రచయితలు, సాహిత్యాన్ని పరిచయం చేస్తూ అనేక మాన పత్రికల్లో రచనలు చేసి వారిని,వారి రచనాశైలిని,ప్రత్యేకతలను తెలుగు వారికి పరిచయం చేసారు.

స్వీకరించిన పురస్కారాలు :

సామల సదాశివగారు అనేక పురస్కారాలు అందుకున్నారు. "అమ్జద్ దుబాయిలు" అనువాదానికి 1964లో ఆం.ప్ర. ప్రభుత్వం ఉత్తమ అనువాద రచనగా గుర్తింపు పురస్కారాన్ని అందచేసింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాద్ వారిచే 1994లో ప్రతిభ పురస్కారం,1998లో గౌరవ డాక్టరేట్‌ను పొందా రు. 2002 లో కాకతీయ విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్‌ను పొందారు. 2006లో అప్పటి ఏపీ ముఖ్యమంత్రి వై.ఎస్.ఆర్. రాజశేఖర్ రెడ్డి గారి చే ప్రతిభా గౌరవ పురస్కారం, 2007లో తెలుగు భాషా బ్రహ్మోత్సవాల సందర్భంగా తెలుగు సంచితి నికా వేదిక తిరుపతి వారిచే ఆత్మీయ పు రస్కారం. 2011లో కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం అందుకున్నారు.

సదాశివ రచనలు

సదాశివ పలు రచనలు చేశారు.వాటిలో ప్రధానంగా 1.ప్రభాతము, 2.సాంబశివ శతకం, 3.నిరాక్షణము, 4.మంచి మాటలు 5.అపశ్నలు (నవల), 6.ఉర్దూ సాహిత్య చరిత్ర, 7.అమ్జేద్ రుబాయి లు, 8.మిర్జా గాలిబ్, 9.ఉర్దూ కవుల కవితాసామగ్రి, 10.తెలుగు వాచకము 5వ, 11.తెలుగు వాచకము 7వ, 12.మలయ మారుబా బు, 13.యాది,14.సంగీత శిఖరాలు, 15.సదాశివ కావ్యసుధ, 16.స్వరలయలు

సామల సదాశివ గారు చదివింది ఉర్దూ మిడియంలో నేనైనా మాతృభాషా తెలుగు కావడంతో మహాభారతం, భగవతం, భాస్కర రామయణం, మార్కేండేయ పురాణం లాంటిఎన్నో పుస్తకాలు చిన్నప్పట్నించి తన తండ్రి ద్వారా తీసుకొని చదువుకున్నాడు. సదాశివ కు తెలుగు పద్యాలు రాయాలనే ఆలోచన చిన్నతనంలోనే కలిగింది. తెలుగు సాహితి జగత్తులో తనపై ప్రత్యేక ముద్రవేసుకున్నారు. ఆయ న రామాయణాన్ని వ్రాసిన భాస్కరుడు. భాగవతం రాసిన పోతన, ప్రబంధకవులు శ్రీనాధుడు, పింగళి సూరన, తెనాలి రామకృష్ణుడుతో పాటు భావకవులు, వచనకవులను అంటే చాలా యిష్టపడ్డాడు.

స్వచ్ఛమైన సాహిత్య వ్యక్తిత్వం కలవారు

సదాశివ మాస్టారు గారి "యాది"లోని ప్రవేశిస్తే చైతన్య పరుస్తూ మహామహులు దర్శనమిస్తారు. అందుకే గడిచిపోయిన జీవితం తిరిగి రాదుకదా? అందుకు గతంలోకి వెళ్ళి మధురమైన జ్ఞాపకాలను "యాది"జెసుకున్నారు. సదాశివగారు వారి "యాది"లో మొదలైన ప్ర తి మనిషి ఒక గ్రంధాలయంతో సమానం. మానవుని జీవితంలో జరి గిన మధుర ఘట్టాలు యాదికి వస్తుంటాయి. మనము కలుసుకొన్న మానవతా మూర్తులు మహానీయులు యాదికి వస్తుంటారు. కొన్నిం టిని మర చిపోతుంటాము. యాది చేయగూడని కొన్ని సంఘటనలను మరచి పోలేకపోతే బతకటం కష్టం. కొన్ని జ్ఞాపకాలు యాదిజేసు కుంటూ ఉం టే తియ్యగా ఉంటాయి. అటువంటిదే సదాశివగారి "యాది" రచన. ఇందులో మొత్తం "49" వ్యాస సంకలన ముచ్చట్లు ఉన్నవి. యాది ఒక జ్ఞాపకాల నిధి. సదాశివ గారి "యాదిలో బ్రతుకు ను ప్రేమించిన సోదరులు" తెలంగాణ వాళ్ళకు సంగీతంలో సంగీత సమానమైన ఉర్దూతో ఎంత ఆత్మీయ సంబంధముందో ఈ రెండింటి మీద ఎంత ప్రేమ ఉందో "యాది" వల్లనే ఈ తరానికి తెలుస్తుంది. తెలంగాణ సామాన్య ప్రజలు మాట మాటకు సామెతనుప యోగించినట్లు అప్పటి విద్యావంతులు "షేర్"ను ఉపయోగిస్తారని "యాది" వల్ల తెలుస్తుంది. ఇప్పటి తరానికి తెలియని గొప్ప పండితుడు కవి కాళోజీ, రామేశ్వరరావు నుండి వెలువడిన

షాద్‌హోతుమ్ మాజికి నిషానీ మజీకా దమ్ భర్తేహో
టహ్నా సేకబ్‌లుక్ చిమ్టోగే పత్ ఝడ్ హై ఝడ్ జావోనం

షేర్ తాత్పర్యమేమంటే షాద్! నువ్వు పాతకాలము మనిషిని ఎప్పుడూ గతాన్ని గురించే ఆలోచిస్తు ఉంటావు. రెమ్మరు అతుక్కొని ఎంత సేపు వేలాడుతావు? ఆకురాలు కాలం వచ్చింది. రాలిపోరాదా! అని ఆకురాలు కాలంలో పండుటాకులు రాలిపోతాయి కదా! వృద్ధాప్యంలో నిర్వేదం అధికమైనప్పుడు మాట్లాడే తీరు కూడా అలానే ఉంటుందని సదాశివ తన యాదిలో అంటాడు.

ఇప్పటి ఇంగ్లీష్ భాష అందరిదీ లాగే అప్పుడు ఉర్దూ భాష కూడా అందరిది అని సదాశివ గారి "యాది" ద్వారా ఇప్పటి తరానికి తెలు స్తుంది. తెలంగాణ వాళ్ళకు తెలుగు రాదనే భాధ తెలంగాణ వాళ్ళను ఎంత బాధపర్చిందో "యాది" "తెలంగాణ వాళ్ళకు తెలుగు రాదా" ము చ్చట్లు గుర్తు చేస్తాయి. సదశివగారి యాదిలో ముచ్చట్లు లో.."తాతా! ఇగపటు నీపాను జర్దా డబ్బీ" అని నాలుగు సంవత్సరాల మనుమ రాలు లావణ్య సదాశివకు ఇస్తుంది. హైదరాబాదుతో వుండే ఆయన ఇద్దరు మనమరాళ్ళు హిందీ మాట్లాడుతారు. వాళ్ళకు తెలుగు రాదు అంటే తెలుగు మాటలను హిందీలోంచి అనువదించుకొని మాట్లాడ తారు. "అతని మనుమరాళ్ళ తెలుగు వాళ్ళ పలుకుబడి నుడికారము వాళ్ళకు తెలియదు. నాలు గెళ్ళు పూర్తిగా నిండని లావణ్య ఇగపటు అ నగానే ఆమేకు ఈ ప్రాంతపు తీయని తెలుగు పట్టుపడ్డందుకు అబ్బు ర పడ్డాను. ఆనందించాను సదాశివ యాదిలో రాసుకుంటడం గమ నార్హం. ప్రాంతీయ భాషలో పలుకుబడి, నుడికారం, జాతీయాలు గురించి మాట్లాడుకున్నప్పుడు వరంగల్ తెలుగును టక్సారా తెలుగు అనవచ్చు. ఢిల్లీ ఉర్దూను టక్సాలి ఉర్దూ అనవచ్చు. అనగా టక్సాలా అంటే టంకసారి అని అర్థం.టంకసా లలో తయారయే నాణేలకు విలువ. అంటే తెలంగాణ ప్రాంతంలో అస లైన కార్మికులు, కర్షకులు, గ్రామీణులు వారు వారి వారి గ్రామాలను దాటి వేరే దూరప్రాం తాలకు వెళ్ళరు. కావున వారిపై ఏ భాష ప్రభావం ఉండదని సదాశివ గారి అభిప్రాయం. ఆడవాళ్ళ నోట అసలైన భాష ప లుకుతుంది. వరంగల్లులో కూరగాయలమ్మె స్త్రీల మాటల్లోను ఎక్కడో ఒక అచ్చమైన నుడి వినిపిస్తుంది. ఏ ప్రాంతంలోనైన అసలైన భాష ఆడ వాళ్ళ నోటనే వినగలం. ఉర్దూ మాట్లాడే ముస్లిం స్త్రీలు ఇల్లు దాటి వెళ్ళ కుండా రాజ మహలలో ఉన్నందున వారి భాష కూడా శుద్ధమైందని వి ద్వాంసుల అభిప్రాయం.ఎందుకంటే వారిపై పర భాష ప్రభావం యుం డదు కనుక. యాది వ్యాసాల్లో తెలంగాణ ప్రాంతీయ భాషా కనిపిస్తున్న ది. తెలంగాణ ప్రాంతం వారు కాబట్టి ఈ ప్రాంత యాసను తనదైన శైలిలో సరళంగా ఇప్పటి వారికి అందించిన ధన్యజీవి మన సామల స దాశివ పంతులు గారు. జీవితాంతం రచనలు కొనసాగిస్తూ తెలంగాణ యాసను,భాషను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన మహాజ్ఞాని సదాశి వ.నేటి తెలంగాణ రాష్ట్ర వైతాళికడుగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతాడు.

సెల్: 9441671703


ఈ పేజీ మీ అందరిది

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. నవతెలంగాణ అభిప్రాయాలు కానవసరం లేదు. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోను 6000 క్యారెక్టర్లకు మించకుండా పంపించండి. లేనట్లయితే ఎడిటింగ్‌లో మీరు చెప్పదలచిన అభిప్రాయాలు స్పష్టత కోల్పోవచ్చు. వివిధ ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి. - ఎడిటర్

మీరచనలు పంపవలసిన చిరునామా :


email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020.
Ph:27665420,27673787,9490099077/78.
Fax:040-27652228

అద్భుత మేధాశక్తికి ప్రతిబింబాలు















షో

ఈ ప్రపంచంలో ఏ మనిషి జీవితమూ సాఫీగా సాగదు. ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా లైఫ్‌ని హ్యాపీగా లీడ్ చేసేందుకు విశ్వ ప్రయత్నం చేస్తుంటారు. ఈ ప్రయత్నాలకు తమ అద్భుత బుద్ధిబలాన్ని ఆయుధంగా చేసుకుంటారు. లక్ష్యాలను సాధించిన క్రమంలో వీరి జీవితాలు ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి. ఈ తరహా నేపథ్యంలో తెరకెక్కి, ప్రేక్షకుల విశేషా ఆదరణ పొందిన కొన్ని అత్యద్భుత మేధాశక్తి చిత్రాల గురించి ఈ వారం అందిస్తున్న స్పెషల్ 'షో'...

ది లెజెండ్ ఆఫ్ 1900

డానీ బూడ్‌మాన్ అనే వ్యక్తి షిప్‌లో ఓ చిన్న పిల్లాడిని చూస్తాడు. ఆ పిల్లాడిని పెంచి పెద్ద చేస్తాడు. పిల్లాడు పెద్దయిన తర్వాత పియానో నేర్చుకుంటాడు. అట్నుంచి మ్యూజికల్ జీనియస్‌గా, లెజెండ్‌గా ఎదుగుతాడు. ఈ క్రమంలో లేడీ ట్రంపెట్ ప్లేయర్ మాక్స్ టూనీ ప్రేమలో పడతాడు. ఆ తర్వాత అతని జీవితం ఎలాంటి మలుపులు తిరిగిందనేది ఈ చిత్ర కథ. ఇటాలియన్ దర్శకుడు గియు సేప్ టోర్నాటోరే రూపొందించిన తొలి ఇంగ్లీష్ చిత్రమిది. 1998లో విడుదలైన ఈ చిత్రం మ్యూజికల్‌గా ఓ మాస్టర్ పీస్‌గా నిలిచింది. విమర్శకుల ప్రశంసలతో పాటు అనేక అవార్డులు పొందింది.

ఫెర్మాట్స్ రూమ్

నలుగురు మేథమేటిషియన్స్‌ను ఓ గుర్తు తెలియని వ్యక్తి తన ఆఫీస్‌కు ఆహ్వానిస్తాడు. ఈ నలుగురు ఒకరికొకరు తెలియక పోయినా ఓ మిస్టీరియస్ వ్యక్తి ఆహ్వానం మేరకు వెళ్తారు. వచ్చిన వాళ్ళని ఓ రూమ్‌లో ఉంచి ఓ అంశాన్ని కనిపెట్టాలనే టాస్క్‌ను ఇస్తాడు ఆ అపరిచిత వ్యక్తి. ఆ రూమ్‌లో అన్ని వస్తువులు కదులుతుంటాయి. విచిత్రమైన శబ్దాలు వస్తుంటాయి. ఆలోచించే టైమ్ కూడా ఉండదు. మరి అలాంటి పరిస్థితుల్లో వారేం చేశారు?, మిస్టీరియస్ అంశం ఏంటన్నదే సినిమా. ఈ స్పానిష్ చిత్రానికి లూయిస్ పైద్రహిత, రోడ్రిగో సపోన్యా సంయుక్తంగా దర్శకత్వం వహించారు. 2007లో విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులను అలరించింది.

కిలో టు బ్రావో

బ్రిటీష్ సైనికులు అఫ్ఘానిస్తాన్‌లోని కజకి డ్యామ్ వద్ద టెర్రరిస్టులకు, ల్యాండ్ మైనింగ్‌కు వ్యతిరేకంగా సెక్యూరిటీ బాధ్యతలు నిర్వర్తిస్తుంటారు. అందులో మార్క్ వైట్ అనే మంచి టాలెంటెడ్, చురుకైన సైనికుడు అనుకోకుండా ఎన్‌కౌంటర్‌కు గురవుతాడు. ఆద్యంతం స్ఫూర్తిని కలిగించే అత్యంత తెలివైన ఆ సైనికుడి మరణం అప్పట్లో సంచలన సృష్టించింది. మార్క్ వైట్ జీవితం ఇతివృత్తంతో ఈ బ్రిటీష్ వార్ చిత్రాన్ని దర్శకుడు పాల్ కటిస్ రూపొందించారు. ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలతోపాటు కలెక్షన్ల పరంగానూ ఆకట్టుకుంది. పలు అవార్డులనూ కైవసం చేసుకుంది.

విప్‌లాష్

యువ టాలెంటెడ్ డ్రమ్మర్ ఆండ్రూ ప్రతిష్టాత్మక మ్యూజిక్ అకాడమీలో చేరి ప్రొఫెషనల్‌గా తయారు కావాలనేది అతని లక్ష్యం. ఆ స్కూల్ ప్రొఫెసర్ చాలా స్ట్రిక్ట్. బాగా చేయడం కోసం, తను చెప్పింది చేయడం కోసం కఠినంగా వ్యవహరిస్తారు. కొట్టడం కూడా చేస్తుంటాడు. దీంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న ఆండ్రూ గ్రేట్ డ్రమ్మర్‌గా ఎదగడమనేది ఈచిత్ర కథ. డామియన్ చజెల్లే దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం 2014లో విడుదలై విశేష ప్రేక్షకాదరణ పొందింది. మూడు విభాగాల్లో ఆస్కార్ అవార్డులను అందుకున్న ఈ చిత్రం 4 మిలియన్ డాలర్లతో తెరకెక్కి 50 మిలియన్ డాలర్లను వసూలు చేసింది.

ది బెస్ట్ ఆఫర్

విర్జిల్ ఓల్డ్‌మ్యాన్ తెలివైన కళాకారుడు. ఆర్ట్, పురాతన కళాఖండాలను పెయింట్స్ వేస్తూ ప్రపంచంలోనే జీనియస్ ఆర్ట్ ఎక్స్‌పర్ట్‌గా పేరొందుతాడు. ఈ క్రమంలో పరిచయమైన ఓ మహిళ వల్ల అతని లైఫ్ ఎలాంటి మలుపులు తిరిగిందనేది ఈ చిత్ర ఇతివృత్తం. గియుసేప్ టోర్నాటోరే దర్శకత్వంలో రూపొందిన ఈ రొమాంటిక్ మిస్టరీ బెస్ట్ ఇంటలిజెంట్ చిత్రం 2013లో విడుదలై విశేష ప్రేక్షకాదరణ పొందింది.

ఫాలింగ్ డౌన్

డిఫెన్స్ ఇంజనీర్‌గా రిటైర్డ్ అయిన ఓ వ్యక్తి ఒంటరిగా జీవనం సాగిస్తుంటాడు. సమాజంలో కనిపించే లోపాలను చూసి తట్టుకోలేకపోతుంటాడు. ప్రభుత్వ అధికారుల్లోనూ, ఇతర వ్యక్తుల్లోనూ, షాపుల్లోనూ, రోడ్లపై ఇలా ఎక్కడ చూసినా నిర్లక్ష్యం, అశ్రద్ధ, దోపిడీలే కనిపిస్తాయి. దీంతో ఆ మాజీ ఇంజనీర్ ఫ్రస్టేషన్‌కు గురై సమాజంపై ఎదురుతిరుగుతాడు. హింసను ఆయుధంగా చేసుకుని ఆయనెలాంటి హింసాత్మక ఘటనలకు పాల్పడ్డాడు?, దాన్ని వల్ల చోటు చేసుకున్న పరిణామాలేంటి అన్నదే సినిమా. జోయేల్ షూమేకర్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం 1993లో విడుదలై విశేష ఆదరణ పొందింది. ఇదొక ఫ్రెష్ కంటెంట్‌గా అభివర్ణించబడింది. మాజీ ఇంజనీర్ పాత్రలో మైఖేల్ డగ్లాస్ నటన అద్యంతం అలరిస్తుంది. 25 మిలియన్ డాలర్లతో తెరకెక్కిన ఈ చిత్రం 41 మిలియన్ డాలర్లను వసూలు చేసింది.

బ్లైండ్‌నెస్

ఇద్దరు భార్యభర్తలు హ్యాపీగా జీవనం సాగిస్తుంటారు. ఈ క్రమంలో భర్తకు తెల్లటి మబ్బులతో కూడిన అంధత్వం వస్తుంది. అది కాస్త అంటువ్యాధిగా మారి అక్కడి వారందరికీ వ్యాపిస్తుంది. ఆ అంటువ్యాధికి కారణమేంటి?, దాన్నుంచి ప్రజలంతా బయటపడ్డారా లేదా అన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. 1995లో అదే పేరుతో వచ్చిన నవల ఆధారంగా దర్శకుడు ఫెర్నాండో మైరెల్లిస్ ఈ చిత్రాన్ని రూపొందించారు. 2008లో విడుదలైన ఈ చిత్రంలో జులియన్నే మూర్, మార్క్ రుఫలో, గేల్ గార్సియా బెర్నాల్, డానీ గ్లోవర్ తదితరులు నటించి ప్రేక్షకుల్ని మెప్పించారు.

ఎగ్జామ్

కార్పొరేట్ జాబ్ కోసం ఎనిమిది మందిని ఒక రూమ్‌లో ఉంచుతారు. ఆ తర్వాత రూమ్‌కి లాక్ చేస్తారు. వారికిచ్చిన ప్రశ్నాపత్రంలో ఒకే ప్రశ్న ఉంటుంది. ఆ ప్రశ్న అందరిని కన్ఫ్యూజ్ చేయడంతోపాటు టెన్షన్‌కి గురి చేస్తుంది. ఆ తర్వాత వారి మధ్య గొడవలకు దారి తీసి, ఒకరినొకరు చంపుకునేంత వరకు వెళ్తుంది. ఈ క్రమంలో అంత్యంత ఇంటలిజెన్స్‌తో కూడిన ఆ ప్రశ్నకు సమాధానం ఎవరు చెప్పారు?, చివరికి వారిలో ఎవరు మిగిలారన్నది ఈ చిత్ర కథ. స్టువర్ట్ హాజెల్డెన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో ఆడార్ బెక్, క్రిస్ కారే, గెమ్మ చాన్, నతలీ కాక్స్ ప్రధాన పాత్రల్లో నటించి అలరించారు.

ట్రాకర్

యుద్ధంలో శరణార్థిగా మిగిలిన ఓ ఆఫ్రికన్ పరదేశమైన న్యూజిలాండ్‌కి వలస వెళ్తాడు. అక్కడ తన మనుగడ కోసం పోలీసులను చంపుతాడు. ఆ తర్వాత తనకు అడుగడుగున అడ్డంకులు ఎదురవుతుంటాయి. అత్యంతం సాహసోపేతంగా సాగే అతని ప్రయాణంలో ఎలాంటి ఒడిదుడుకులను ఎదుర్కొన్నాడు?, తన తెలివితో ఎలా మనుగడ సాధించగలిగాడనేది ఈ చిత్ర కథాంశం. ఇయాన్ షార్ప్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం 2011లో విడుదలై విమర్శకుల ప్రశంసలందుకుంది. పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లోనూ ప్రదర్శించబడింది. శరణార్థి పాత్రలో రే విన్‌స్టోన్ నటన అందర్నీ మంత్రముగ్ధుల్ని చేస్తుంది.

వాట్ డ్రీమ్స్ మే కమ్

క్రిస్ నెల్సన్ ఓ రోజు కళాకారిణి అన్నె కోలిన్స్‌ను కలుస్తాడు. తొలి పరిచయమే పెళ్ళికి దారి తీస్తుంది. ఆ తర్వాత ఇద్దరు పిల్లలకు జన్మనిస్తారు. అనుకోకుండా కారు ప్రమాదంలో ఆ ఇద్దరు పిల్లలు చనిపోతారు. భార్య మానసికంగా డిస్ట్రబ్ అవుతుంది. మరికొన్ని రోజులకు క్రిస్ సైతం కారు యాక్సిడెంట్‌లో చనిపోతాడు. కానీ తన ఆత్మ మాత్రం ఇక్కడే ఉంటుంది. ఆత్మ రూపంలో తన భార్యను, పిల్లలను వెతికే ప్రయత్నమే ఈ చిత్రం. విన్సెంట్ వార్డ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం 1998లో విడుదలై విశేష ఆదరణ పొందింది. విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలో ఆస్కార్‌ను అందుకుంది. ఈ చిత్రంలో క్రిస్ పాత్రలో రాబిన్ విలియమ్స్ నటన ప్రేక్షకులను కట్టిపడేస్తుంది.

ఇన్‌స్టింక్ట్

ఓ తెలివైన సామాజిక శాస్త్రవేత్త డా॥ఎథన్ పవెల్ ఉన్నట్టుండి సమాజానికి దూరంగా అడవుల్లోకి వెళ్ళిపోతాడు. అక్కడ వరుసగా హత్యలకు పాల్పడుతుంటాడు. గోరిల్లాగా ప్రవర్తిస్తుంటాడు. ఇది తెలిసి పోలీసులు అరెస్ట్ చేస్తారు. సెల్‌లో ఓ సైకాలజిస్ట్ ఎథన్‌ను ట్రీట్ చేస్తుంటాడు. ఎథన్ నుంచి రాబట్టిన నిజాలేంటి? ఆయన అలా మారడానికి కారణమేంటి? ఆ తర్వాత ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయనేది సినిమా. ఈ అమెరికన్ సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రాన్ని దర్శకుడు జోన్ టర్టెల్టాంబ్ రూపొందించారు. 1999లో విడుదలైన ఈ చిత్రంలో ఎథన్ పాత్రలో ఆంటోని హాప్కిన్స్ నటన అందరినీ విశేషంగా అలరిస్తుంది.

ఫ్లాష్ ఆఫ్ జీనియస్

1993లో న్యూయార్క్‌లో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా జాన్ సీబ్రూక్ రాసిన ఆర్టికల్‌ను బేస్ చేసుకుని రూపొందించిన బయోగ్రాఫికల్ చిత్రమిది. రాబర్ట్ కీర్న్స్ ఆటోమొబైల్‌కు సంబంధించి వైడ్‌షీల్డ్ వైపర్ టెక్నాలజీ ఐడియాను కనిపెడతాడు. దానికి సంబంధించి పేటెంట్‌ను కూడా పొందుతాడు. కానీ రాబర్ట్‌కు తెలియకుండా ఫోర్డ్ మోటర్ కంపెనీ ఆ ఐడియాను చోరీ చేసి ఓ కారును కూడా తయారు చేస్తుంది. దీనిపై రాబర్ట్ చేసిన న్యాయపరమైన పోరాటమే ఈ చిత్ర కథాంశం. ఓ పెద్ద కార్పొరేట్ కంపెనీకి వ్యతిరేకంగా ఒక వ్యక్తి సాగించే పోరాటం స్ఫూర్తివంతంగా నిలిచింది. మార్క్ అబ్రహం దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో రాబర్ట్ కీర్న్స్ పాత్రలో గ్రెగ్ కిన్నేర్ నటించి మెప్పించాడు.


పే ఇట్ ఫార్వర్డ్


ఓ విద్యార్థికి తండ్రి లేడు, ఉన్న తల్లి మద్యానికి బానిసై ఉంటుంది. దీంతో అయోమయమైన స్థితిలో ఉన్న ఆ కుర్రాడికి వాళ్ళ టీచర్ ఓ ఛాన్స్ ఇస్తాడు. అది ప్రపంచాన్ని మర్చే గొప్ప ఐడియా. దాన్ని సుసాధ్యం చేసేందుకు బయలుదేరిన ఆ కుర్రాడు తన తెలివితేటలతో ప్రపంచాన్ని మలుపుతిప్పే పని ఏం చేశాడన్నది ఈ చిత్ర కథాంశం. మిమి లెదర్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం విశేష ప్రేక్షకాదరణ పొందింది. ముఖ్యంగా యాక్టింగ్, కథ, సంగీతం, సినిమాటోగ్రఫీ విభాగంలో మంచి ప్రశంసలందుకుంది. కలెక్షన్ల పరంగానూ ఆకట్టుకుంది. ఇందులో కుర్రాడు పాత్రలో హాలే జోయెల్ ఓస్మెంట్, అతనికి గైడ్ చేసే టీచర్ పాత్రను కెవిన్ స్పేసీ పోషించారు.


ది ఇంటర్వ్యూ

ఉద్యోగం పోవడం, కుటుంబం దూరమవడంతో ఎడ్డీ రోడ్నీ ఫ్లెమింగ్ ఒంటరిగా తన అపార్ట్‌మెంట్‌లో నివసిస్తుంటాడు. ఓ రోజు ఉదయం ఇద్దరు పోలీసులు ఎడ్డీని అరెస్ట్ చేసి ఇంటిని సీజ్ చేస్తారు. కారణం చెప్పకుండా అరెస్ట్ చేయడమే కాకుండా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కి తీస్కెళ్ళి కారు దొంగతనం గురించి విచారిస్తుంటారు. ఈ క్రమంలో బయటపడిన నిజాలేంటి? దాని వెనకాల ఉన్న అసలు కథేంటి అనేది ఈ చిత్ర ఇతివృత్తం. సినిమా మొత్తం పోలీస్ ఇంటరాగేషన్ గదిలో జరుగుతుంది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా, సస్పెన్స్‌గా సాగే ఈ చిత్రాన్ని క్రెయిన్ మొనాహన్ దర్శకత్వం వహించారు. 1998లో విడుదలైన ఈ చిత్రం మంచి ఆదరణ పొందింది. ఇందులో ఎడ్డీ పాత్రలో హ్యూగో వీవింగ్, పోలీసుల పాత్రల్లో టోనీ మార్టిన్, ఆరోన్ జెఫ్ఫెరీల నటన కట్టిపడేస్తుంది.
















నవచిత్రం

మీ ప్రేమకు ధన్యవాదాలు..

మాజీ విశ్వ సుందరి, బాలీవుడ్ బ్యూటీ ఐశ్వర్యరాయ్ ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్ (ఐఎఫ్‌ఎఫ్‌ఎం) వేడుకల్లో సందడి చేశారు. అంతేకాదు 71వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ చిత్రోత్సవాల్లో త్రివర్ణపతాకం ఎగురవేశారు. ఈ వేడుకల్లో త్రివర్ణపతాకం ఎగురవేసిన తొలి మహిళగా ఐశ్వర్య నిలవడం విశేషం. తనపై చూపుతున్న ప్రేమకు ఐశ్వర్యరాయ్ ఈ సందర్భంగా అందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కూతురు ఆరాధ్యతోకలిసి ఫ్యాన్స్‌తో సెల్ఫీలు దిగి హల్‌చల్ చేశారు.


ఐశ్వర్యరాయ్

ఓయ్ నిన్నే పాటలొచ్చాయ్..


'ఓయ్ నిన్నే' చిత్ర ఆడియో ఆవిష్కరణోత్సవ దృశ్యం

భరత్, సృష్టి హీరోహీరోయిన్లుగా సత్య చల్లకోటి దర్శకత్వంలో ఎస్.వి.కె.సినిమా పతాకంపై వంశీకృష్ణ శ్రీనివాస్ నిర్మిస్తున్న చిత్రం 'ఓయ్ నిన్నే'. శేఖర్ చంద్ర సంగీతం అందించిన ఈ చిత్రం ఆడియో విడుదల కార్యక్రమం శనివారం హైదరాబాద్‌లో జరిగింది. పాటల సీడీలను కోన వెంకట్ విడుదల చేశారు.

ఈ సందర్భంగా అతిథిగా పాల్గొన్న తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, 'ఇండస్ట్రీలో ఎన్టీఆర్, ఏఎన్నార్, దాసరి సహా ఎందరో వేసిన దారి ఇప్పుడు ఎంతో బావుంది. తెలుగు చలన చిత్ర పరిశ్రమ ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ తరుణంలో కొత్త నటీనటులు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 'బాహుబలి', 'శ్రీమంతుడు' నుంచి ఈ మధ్య విడుదలైన 'ఫిదా' వరకు ఇండస్ట్రీలో కొత్త కొత్త సినిమాలు ముందుకు వస్తున్నాయి. అదే కోవలో వచ్చిన ఈ చిత్రం కూడా పెద్ద హిట్ కావాలి' అని అన్నారు. 'సినిమా బాగుంటే తుపానులు, నోట్ల మార్పిడిలు, జీఎస్‌టీలు ఏవీ ఆపలేవు. అలాంటి మంచి కాన్సెప్ట్ ఈ చిత్రంలో కనిపిస్తుంది. సత్య మంచి వ్యక్తి. మంచి రచయిత కూడా. ట్రైలర్, పాటలు చూస్తుంటే సినిమా ఎంత బాగా తెరకెక్కించాడో అర్థమవుతుంది. శేఖర్ చంద్ర మంచి అభిరుచిగల సంగీత దర్శకుడు. హీరోహీరోయిన్స్ కొత్త వారైనా చాలా బాగా నటించారు. కొత్త సినిమాలను ప్రేక్షకులు ఆదరిస్తారు' అని కోన వెంకట్ తెలిపారు. 'వంశీకృష్ణ మంచి టేస్ట్ ఉన్న నిర్మాత. శేఖర్ చంద్ర సినిమాను ఓన్ చేసుకుని మంచి ట్యూన్స్ అందించారు. సాయిశ్రీరామ్ మంచి విజువల్స్ ఇచ్చారు. నా గురువుగారు పరుశురాం, చందుమొండేటి, సుధీర్‌వర్మ, కృష్ణచైతన్య సహా అందరు ఎంతో గైడెన్స్ ఇచ్చారు. నా స్నేహితులు మంచి ప్రోత్సాహాన్ని అందించారు' అని దర్శకుడు చెప్పారు. 'మా బ్యానర్‌లో వచ్చిన 'సోలో' కంటే ఈ చిత్రం బాగుంటుంది' అని నిర్మాత వంశీకృష్ణ తెలిపారు.


శ్రీముఖి

మంచి..చెడు.. తింగరితనం..

నటుడు, మాటల రచయిత హర్షవర్ధన్ దర్శకుడిగా మారి రూపొందిస్తున్న చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. మురళి, శ్రీముఖి హీరో,హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్.కె.విశ్వేష్‌బాబు సమర్పణలో బోగాది అంజిరెడ్డి ప్రొడక్షన్స్ పతాకంపై అంజిరెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ లాంచ్ ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా హర్షవర్ధన్ మాట్లాడుతూ, '1988-89లో ఓ మారుమూల గ్రామంలో జరిగిన ప్రేమ కథ. మంచి ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా పక్కా కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాం. మంచి, చెడు, తింగరితనం అనేవి సందర్భాన్ని బట్టి మన నుంచి బయపడతాయి. ఆయా క్యారెక్టర్స్ గురించి తెలిపే చిత్రమిది. ఈ చిత్రానికి నేనే సంగీతం అందించాను' అని అన్నారు. 'నన్ను దృష్టిలో పెట్టుకుని మహిళా పాత్రను రాశారని తెలిసి నటించేందుకు అంగీకరించాను' అని శ్రీముఖి చెప్పారు.


హ్యూమా ఖురేషి

మరణించినా జీవించండి..

'దానాలన్నింటికంటే అవయవ దానం మిన్న. మనం చనిపోతూ మరొకరికి జన్మనివ్వడం కన్నా మించిన మంచి మరొకటి ఉండదు' అని అన్నారు తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్. ఆదివారం అవయవ దానం దినోత్సవాన్ని పురస్కరించుకుని నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓ కార్యక్రమం నిర్వహించారు. 'డొనేట్ ఆర్గాన్స్-సేవ్ లైవ్స్' అని ఈ సందర్భంగా వక్తలు పిలుపునిచ్చారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షులు పి.కిరణ్ మాట్లాడుతూ, 'మంచి పనులకి మా చిత్ర పరిశ్రమ ఎప్పుడూ ముందు ఉంటుంది. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజలంతా అపోహాలు వీడి చైతన్యవంతులై అవయవ దానం చేయడానికి ముందుకు రావాలి' అని పిలుపునిచ్చారు. 'అవయవదానం దినోత్సవం సందర్భంగా నా నేత్రాలను దానం చేస్తున్నాను. దీనిపై సంపూర్ణ అవగాహన తెచ్చుకుని అవయవాలను దానం చేసి, మరికొంత మందికి స్ఫూర్తిగా నిలవండి' అని ఆర్కేగౌడ్ తెలిపారు. 'మా' అధ్యక్షుడు శివాజీ రాజా చెబుతూ, 'ప్రజలకు మేం సినిమాల ద్వారా వినోదాన్ని పంచడమే కాకుండా సేవ చేయడంలో కూడా ముందుంటాం. ప్రతి ఒక్కరూ విధిగా అవయవ దానం చేయాలి' అని చెప్పారు. 'సమాజ సేవలో మేం సైతం అంటూ నేస్తం ఫౌండేషన్‌ను స్థాపించడం జరిగింది. మనం చనిపోయినా బతికుండాలంటే అవయవదానం చేయాలి' అని నేస్తం ఫౌండేషన్ అధ్యక్షుడు జె.వి.మోహన్‌గౌడ్ తెలిపారు.


ఆర్.కె.గౌడ్, జెమిని కిరణ్, శివాజీరాజా, చదలవాడ శ్రీనివాసరావు, మోహన్‌గౌడ్


నో హాలీవుడ్ ట్రయిల్స్

నేను దర్శకుడు అనురాగ్ కశ్యప్ సినిమా ప్రొడక్ట్‌ని. ఆయన దర్శకత్వంలోనే బాలీవుడ్‌లోకి అడుగుపెట్టినందుకు గర్వంగా ఫీలవుతున్నాను' అని అంటోంది బాలీవుడ్ నటి హ్యూమా ఖురేషీ. 2012లో అనురాగ్ కశ్యప్ దర్శకత్వంలో రూపొందిన 'గ్యాంగ్స్ ఆఫ్ వస్సేపూర్' సిరీస్ చిత్రాల ద్వారా హ్యూమా ఖురేషి నటిగా తెరంగేట్రం చేసింది. ప్రస్తుతం ఆమె నటించిన 'పార్టిషన్: 1947' చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ చిత్ర ప్రమోషన్‌లో భాగంగా హ్యూమా మాట్లాడుతూ, 'అనురాగ్ కశ్యప్ వంటి దర్శకుడి సమక్షంలో నేను బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వడం గొప్పగా భావిస్తున్నాను. ఎందుకంటే నేను అంతకు ముందు ఏంటో ఎవరికీ అవసరం లేదు. నా ప్రత్యేకత ఏంటి? అనేదానితో అస్సలు పనిలేదు. 'గ్యాంగ్స్ ఆఫ్ వస్సేపూర్' నాకు కరెక్ట్ లాంచ్ అని భావిస్తున్నాను. ఈ చిత్రం పలు భాషల్లోకి కూడా డబ్ అయ్యింది. అలాగే పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లోనూ ప్రదర్శితమై విమర్శకుల ప్రశంసలందుకుంది. ఈ చిత్రం నా భవిష్యత్‌కు ఓ డైరెక్షన్‌లా పని చేసింది. ఒక్క చిత్రంతో నన్నూ ఇండస్ట్రీలో భాగం చేసినందుకు చాలా చాలా సంతోషంగా ఉంది. ఇటీవల అంతర్జాతీయ ప్రాజెక్టులపై చాలా మంది తారలు ఆసక్తి చూపుతున్నారు. కానీ హాలీవుడ్ ప్రాజెక్టుల్లో నటించాలని నేనేమి అనుకోవడం లేదు. ఆ దిశగా ప్రయత్నాలు కూడా చేయడం లేదు' అని చెప్పింది. హ్యూమా ప్రస్తుతం రజనీకాంత్ సరసన 'కాలా' చిత్రంలోనూ నటిస్తోంది.

కాలుష్యం కోరల్లో జనం

- కడవేర్గు

రెండు రోజుల క్రితం మహారాష్ట్ర రాజధాని ముంబయి మహా నగరానికి 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న తలోజా పారిశ్రామికవాడలోని శునకాలు అనూహ్యంగా నీలిరంగులోకి మారడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. డ్రగ్స్, ఫుడ్, ఇంజినీరింగ్‌కు సంబంధించిన వెయ్యికిపైగా కంపెనీల నుంచి విడుదలవుతున్న వ్యర్థపదార్థాలన్నీ పారిశ్రామిక వాడకు సమీపంలో ఉన్న కసది నదిలో కలుస్తుండటం, హానికర రసాయనాలు కలిసిన ఆ నీటిలోకి సదరు శునకాలు దిగడం మూలంగానే ఆ జీవుల శరీర రంగు నీలంగా మారిందని అధికారులు పరిశీలనానంతరం తేల్చారు. ఔషధ, బట్టలు, ఎరువులు, పురుగుల మందు, ప్లాస్టిక్, అద్దకపు తదితర పరిశ్రమలు విడుదలచేసే వ్యర్థాలు తాగునీటి, వ్యవసాయ సంబంధిత అవసరాలకు ఉద్దేశించబడిన నదులు, చెరువులు, కుంటల్లోకి నిబంధనలకు విరుద్ధంగా కలుస్తుండటం వల్ల మూగ జీవాలు, అమాయక ప్రజలు వ్యాధులబారిన పడుతున్నారు. దీనికి మన భాగ్యనగరం మినహాయింపు కాదు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ శివారు ప్రాంతాలైన నాచారం, ఉప్పల్, మల్లాపూర్, చర్లపల్లి, కాటేదాన్, ఖాజీపల్లి, బాలానగర్, సనత్‌నగర్, జీడిమెట్ల, బొంతపల్లి, పటాన్‌చెరువు, బొల్లారం, పాశమైలారం ప్రాంతాల్లో నడుస్తోన్న వందలాది పరిశ్రమలు విడుదల చేస్తోన్న రసాయనిక వ్యర్థాల మూలంగా ఆయా పారిశ్రామికవాడల పరిధిలోని భూగర్భజలాలు, స్థానిక చెరువులు, కుంటల్లోని జలవనరులు ఇప్పటికే హాలాహలంగా మారాయని జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ (ఎన్‌జీఆర్ఐ) నిగ్గుతేల్చింది.



నీటిలో టీడీఎస్ లెవల్	వినియోగం
200 లోపు	తాగునీటి అవసరాలు
200 500	స్నానం తదితరాలు
500 1000	గృహ అవసరాలు
1000 2000	చెట్లకు, వ్యవసాయం

ఆరోగ్యానికి టెండర్.:

తెలంగాణ రాష్ట్రంలో మెదక్, రంగారెడ్డి, హైదరాబాద్, నల్లగొండ, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లోని కొన్ని చెరువులలోని నీరు, భూగర్భజలాలు తాగడానికి పనికిరాకుండా ఇప్పటికే కలుషితమయినట్టు ఎన్‌జీఆర్ఐ రిపోర్ట్ వెల్లడించింది. ముఖ్యంగా.. మెదక్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల శివారు ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమల నుంచి విడుదలవుతున్న వ్యర్థాలు సమీపంలో గల జిల్లేలవాగు, నక్కవాగు, చిన్నవాగు, బొల్లారం ఆసానికుంట, సుల్తాన్‌పూర్ చెరువు, క్రిష్టారెడ్డిపేట చెరువు, గండిగూడ చెరువు, ఇస్నాపూర్ పెద్ద చెరువు, చిట్కుల్ పెద్ద చెరువు, రుద్రారం పెద్ద చెరువు తదితరాలలో కలవడం మూలంగా అక్కడి జలవనరులు పూర్తిగా కాలుష్య కాసారంగా మారాయి. నీటిలో సాధారణంగా ఉండాల్సిన 200 టోటల్ డిసాల్వ్‌డ్ సాలీడ్స్ (టీడీఎస్) మోతాదు.. సుమారు 9,000 టీడీఎస్ గా సదరు చెరువుల్లో నమోదైంది. దీంతో అక్కడి జలాలు ఎంతగా కలుషితమయ్యాయో అర్థం చేసుకోవచ్చు. ఇంత తతంగం జరుగుతున్నా.. ప్రభుత్వం గానీ, అధికారులు గానీ చూసీ చూడనట్టు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. టీడీఎస్ ఎక్కువగా ఉన్న నీటిని తీసుకుంటే గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలు, ఎముకల వ్యాధులు, నరాల వ్యాధులు, మెదడు సంబంధిత వ్యాధులు, శారీరక, మానసిక ఎదుగుదల ఆగిపోవడం, గర్భస్రావాలు, శ్వాసకోశ, జీర్ణకోశ వ్యాధులతో సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశమున్నదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

స్వచ్ఛభారత్ అయినా, స్వచ్ఛతెలంగాణ అయినా.. పేరు కోసం, ప్రచారం కోసం మొక్కుబడిగా ప్రచారం చేస్తూ.. బాధ్యత మొత్తం ప్రజలదే అన్నట్టు ప్రభుత్వాలు వ్యవహరించడం సరికాదు. ప్రజారోగ్యాన్ని కాలరాస్తూ.. తాగే నీటిని కూడా విషతుల్యం చేస్తోన్న అక్రమార్కుల ఆగడాలను కట్టడి చేస్తేనే స్వచ్ఛత సాకారమవుతోంది.

కాలుష్య కాసారాలు దాచలేని వాస్తవాలు

వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ లెక్కల ప్రకారం.. ప్రపంచంలోనే అత్యంత కలుషితమైన ప్రాంతాల్లో ఒకటిగా తమిళనాడులోని రాణిపేట్ నిలిచింది. గత రెండు దశాబ్దాలుగా పరిశ్రమల నుంచి సుమారు 15 లక్షల టన్నుల ఘన వ్యర్థాలు వెలువడటమే దీనికి కారణం.

ప్రపంచంలో సుమారు 180 కోట్ల మంది ప్రజలు కలుషితమైన నీటినే దాహార్తికి వాడుతున్నారు. సుమారు 63కోట్ల మందికి స్వచ్ఛమైన నీళ్ల గురించి తెలీకపోవడం నిజంగా బాధాకరం.

నీటిలో టీడీఎస్ లెవల్ మూడు వేలకు మించి ఉంటే ఆ నీటిని తాకడం అంత మంచిది కాదు. ఐతే, హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని పరిశ్రమల వల్ల అక్కడి పరిసర ప్రాంతాల నీటి టీడీఎస్ వ్యాల్యూ సుమారు 9,000 గా నమోదైందంటే అక్కడి జలాలు ఎంతగా కలుషితమయ్యాయో అర్థం చేసుకోవచ్చు.

కాశ్మీర్‌లో భీకర ఎన్‌కౌంటర్

- హిజ్‌బుల్ కమాండర్ సహా ముగ్గురు ఉగ్రవాదులు హతం
- ప్రాణాలొదిలిన ఇద్దరు జవాన్లు

శ్రీనగర్: జమ్మూకాశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో భద్రతాబలగాలకు, ఉగ్రవాదులకు మధ్య దాదాపు 12 గంటల సేపు భీకర ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో హిజ్‌బుల్ కమాండర్‌తో సహా ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఇద్దరు జవాన్లు కూడా ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. జిల్లాలోని అవ్నీరా గ్రామంలో ఉగ్రవాదులు తలదాచుకున్నారని నిఘావర్గాల ద్వారా సైన్యానికి కీలక సమాచారం అందింది. ఈ మేరకు స్థానిక పోలీసులు, జవాన్లు సంయుక్తంగా ఆ ప్రాంతంలో శనివారం సాయంత్రం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టి ఉగ్రవాదులు నక్కి ఉన్న భవనాన్ని చుట్టుముట్టారు. ఇంతలో బలగాలపైకి ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య భీకర ఎదురుకాల్పులు జరిగాయి. శనివారం రాత్రి ప్రారంభమైన ఎన్‌కౌంటర్ ఆదివారం ఉదయం వరకూ కొనసాగినట్టు జమ్మూకాశ్మీర్ డీజీపీ ఎస్పీ వేద్ వెల్లడించారు. ఎన్‌కౌంటర్‌లో హిజ్‌బుల్ ముజాహిద్దీన్ కమాండర్ యాసిన్ మటూ అలియాస్ గజ్నావి, మరో ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్టు తెలిపారు. ఇదే ఘటనలో ఇద్దరు జవాన్లు ఇళయరాజా పి(తమిళనాడు), గోవాయ్ సుమేద్ వామన్(మహారాష్ట్ర) ప్రాణాలు కోల్పోయినట్టు చెప్పారు. కెప్టెన్‌తో సహా ముగ్గురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారని, ప్రస్తుతం వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని వివరించారు. ఘటనా స్థలి నుంచి మూడు తుపాకులు స్వాధీనం చేసుకున్నామని వేద్ వివరించారు.

బుడ్‌గాం జిల్లాకు చెందిన యాసిన్ 1996లో హిజ్‌బుల్ ముజాహిద్దీన్ ఉగ్రవాద సంస్థలో చేరాడు. కాగా 2007లో పోలీసుల ఎదుట లొంగిపోయిన అతడు 2014లో పెరోల్‌పై విడుదలయ్యాడు. మళ్లీ హిజ్‌బుల్‌లోకి వెళ్లిన యాసిన్ కమాండర్ హోదాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు.

బండిపోరా ఘటనలో..

బండిపోరా జిల్లాలోని హాజిన్ ప్రాంతంలో ఆదివారం సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న పోలీసు బృందంపై ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. అయితే.. బలగాలపైకి స్థానిక యువకులు రాళ్లు రువ్వుతుండగా ఉగ్రవాదులు అక్కడి నుంచి తప్పించుకున్నట్టు పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు.

'బ్లూ వేల్' డెత్‌గేమ్

(మొదటిపేజీ తరువాయి)

జిల్లాలోని అనందపూర్ పట్టణానికి చెందిన అంకన్‌దేయ్ స్థానిక పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. కాగా.. శనివారం.. బ్లూవేల్ గేమ్ ఆడుతున్న అంకన్.. కొద్దిసేపటి తర్వాత బాత్‌రూంలోకి వెళ్లాడు. అతడు ఎంతకూ రాకపోడంతో కుటుంబసభ్యులకు అనుమానం వచ్చి బాత్‌రూం డోర్ తెరిచి చూసేసరికి విగత జీవిగా కనిపించాడు. ఊపిరాడకుండా తలకు ప్లాస్టిక్ కవర్ బిగ్గరగా చుట్టుకొని అంకన్ ఆత్మహత్య చేసుకున్నాడు. గత నెలలో ముంబయికి చెందిన ఓ విద్యార్థి ఎత్తయిన భవనం మీది నుంచి దూకి ఆత్మహత్య చేసుకోవడంతో బ్లూవేల్ ఆట దేశంలో వెలుగులోకొచ్చింది. అతడు బ్లూవేల్ ఆటకు బానిసైనట్టు సహచర విద్యార్థులు పేర్కొన్నారు. ఇటీవల వేర్వేరు చోట్ల ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్యకు యత్నించారు. బ్లూవేల్ గేమ్ కారణంగా యూఎస్, చైనా, తదితర దేశాల్లో ఇప్పటికే 130 మందికి పైగా చనిపోయినట్టు సమాచారం. అజ్ఞాత నిర్వాహకుడి సాయంతో ఆడే ఈ ఆట చివరకు ప్రాణాల మీదకు తెస్తున్నది. 50 రోజుల చాలెంజింగ్ గేమ్ ఆడేవారికి అజ్ఞాత నిర్వాహకుడు పలురకాల టాస్క్‌లు ఇస్తూ ఆత్మహత్యకు ప్రేరేపిస్తాడు.

మోడీకి లేఖ రాసిన కేరళ సీఎం

ఈ ఆటను ఆన్‌లైన్‌లో నిషేధించాలని కోరుతూ కేరళ సీఎం పినరయి విజయన్ ఇప్పటికే ప్రధాని మోడీకి లేఖ రాశారు. సమాజానికి మొత్తం సవాల్‌గా మారిన బ్లూవేల్ గేమ్‌పై బాధ్యతాయుత సంస్థలన్నీ సమగ్ర చర్యలు తీసుకోవడం ప్రస్తుత పరిస్థితుల్లో అత్యవసరమని ఆయన అన్నారు.

చెత్తను ఏరేసేందుకే..: బ్లూ వేల్ సృష్టికర్త

మనుషులకు ప్రాణ సంకటంగా మారిన ఆ ఆటను ఫిలిప్ బుడైకిన్ అనే వ్యక్తి 2013లో సృష్టించాడు. ప్రస్తుతం అతడు జైలులో ఉన్నాడు. ఆటకు సంబంధించి ఇటీవల అతడిని ఇంటర్వ్యూ చేయగా పలు కీలక విషయాలు వెల్లడించారు. పరిశుభ్ర సమాజ స్థాపన కోసమే బ్లూవేల్ ఆటను సృష్టించినట్టు అతడు తెలిపాడు. ఈ గేమ్‌లో పాల్గొనే వారందరూ జీవసంబంధ వ్యర్థాలని అన్నాడు.

మరో రెండు రోజుల్లో భారీ వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

అవకాశమున్నట్టు పేర్కొంది. ఇప్పటికే రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లోనే వర్షాలు కురుస్తున్నాయి. అయితే 16,17 తేదీల్లో మాత్రం వర్షాలు భారీగానే కురిసే అకాశమున్నట్లు వివరిం చారు. ఆదివారం కురిసిన వర్షానికి హైదరాబాద్ జిల్లా గోల్కొడలో 4సె.మీ వర్షపాతం, ఆదిలాబాద్, బోథ్‌లో 3, నిజామాబాద్, నాగరెడ్డిపేట 3, బిక్నూర్ 1, బాన్సువాడ 1, మెదక్, నారాయణ్ ఖేడ్ 2, రామాయంపేట 1, సంగారెడ్డి 2, రంగారెడ్డి, సరూర్‌నగ ర్2, యాచారం 1, రాజేంద్రనగర్1, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లా నాగర్ కర్నూల్ 1, కరీంనగర్, హకీంపేట్1, మహబూబాబాద్ 1సెం.మీ వర్షపాతం నమోదైంది.

దళితురాలికి మద్దతు తెలిపినందుకు..

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చేందుకు ఊరికి వచ్చింది. 'ఇందిరారెడ్డి వస్తే మేం ఫంక్షన్‌కు రాం' అంటూ పెత్తందార్లు తేల్చిచెప్పారు. దీంతో ఆ మహిళ అక్క కూడా 'నీ ఒక్క దాని వల్ల ఎవ్వరూ రానంటున్నారు. నీవు ఫంక్షన్‌కు రావొద్దు' అని ముఖం మీద చెప్పేసింది. దీంతో తీవ్ర అవమాన భారానికి గురైన ఆమె మళ్లీ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం మల్లారం గ్రామంలో జరిగిన కుల బహిష్కరణ అసలు విషయం మీడియాకు పొక్కింది. మల్లారం గ్రామానికి చెందిన సామ ఇందిరారెడ్డికి రెండెకరాల పొలముంది. నాలుగు నెలల కింద అదే గ్రామానికి చెందిన దళితురాలు కొంపెల్లి లక్ష్మికి కౌలుకు ఇచ్చింది. ఖరీఫ్‌లో భాగంగా వరి సాగుచేసుకుంటున్న ఆమెను ఇందిరారెడ్డి బంధువులు బెదిరించారు. నాటేసిన పొలాన్ని రాత్రికిరాత్రే పీకేశారు. చేతికొచ్చిన పైరును పక్కన పొదల్లో పడేశారు. రోజుమాదిరిగానే పొద్దున వెళ్లిన లక్ష్మి పొలాన్ని చూసి కన్నీరుమున్నీరైంది. అసలు విషయం తెలుసుకోగా.. పక్కనే సాగుదారుడైన నల్లా వెంకట్‌రెడ్డి దీనికి కారణమని తెలిసింది. ప్రశ్నించిన లక్ష్మిని.. ఇందిరారెడ్డి సమక్షంలోనే కులం పేరుతో దూషించాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇందిరారెడ్డి కూడా సాక్ష్యం చెప్పింది. అప్పట్నుంచి అసలు సమస్య మొదలైంది.

'మమ్మల్ని కాదని మాదిగలకు మద్దతు తెలుపుతావా' అంటూ తోటి బంధువులు ఆమెపై కక్షగట్టారు. ఇందిరా కుటుంబంతో మాట్లాడినా, సహకరించినా 20 వేల జరిమానా విధిస్తామని హుకుం జారీ చేశారు. కుటుంబాన్ని బహిష్కరిస్తున్నట్టు పెత్తందార్లు ప్రకటించారు.

కూతురి పెండ్లికీ అడ్డు..
అక్క ఇంట్లో శుభకార్యానికి మోకాలడ్డు...

మే 22న జరిగిన ఇందిరారెడ్డి కూతురి పెండ్లికి కూడా పలువురిని రాకుండా పెత్తందార్లు అడ్డుకున్నారు. మేనమామ అయిన బద్దం వెంకట్‌రెడ్డి పెండ్లికి రాగా అతనికి రూ. 20 వేల జరిమానా విధించారు. కులం కట్టుబాట్లను దాటిపోతే ఎవరికైనా ఇదే శిక్ష విధిస్తామని చెప్పడంతో కొందరు పెండ్లికి హాజరుకాలేకపోయారని తెలిసింది. దీంతో గ్రామంలో పెత్తందార్లతో సంబంధబాంధవ్యాలు లేకుండా ఆ మహిళ కుటుంబం ఒంటరిగానే ఉంటున్నది. రెండ్రోజుల కింద ఇందిరారెడ్డి అక్క ఇంట్లో ఫంక్షన్‌కు సంబంధించి కార్డులు ఇచ్చేందుకు ఊరికి వచ్చింది. ఆమె కార్డులు ఇవ్వబోగా...'మాదిగోళ్లకు మద్దతు తెలిపిన ఇందిరారెడ్డి ఫంక్షన్‌కు వస్తే మేం ఎవ్వరమూ రాము' అని పెత్తందార్లు ఇందిరారెడ్డి అక్కకు తేల్చిచెప్పారు. 'ఇంట్లో ఫంక్షన్‌కు నీవు వస్తే ఎవ్వరూ రానంటున్నారు. నువ్వు రావొద్దు' అని అక్క ఆమె ముఖం మీదే చెప్పేసింది. తన అక్క ఇంట్లో ఫంక్షన్‌కు కూడా గ్రామ పెత్తందార్లు మోకాలడ్డటాన్ని తట్టుకోలేకపోయిన ఆ మహిళ మళ్లీ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పని చేయకుండా వేధిస్తున్నారు : ఇందిరారెడ్డి

లక్ష్మి విషయంలో విన్నది విన్నట్టు పోలీసులకు చెప్పిన. అప్పటి నుంచి మా కుటుంబాన్ని ఊర్ల వేధిస్తున్నారు. వ్యవసాయ పనులు చేసుకోకుండా మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మా బంధువులను ఇంటికి రానివ్వకుండా బెదిరిస్తున్నారు. వారి నుంచి ప్రాణాపాయం ఉన్నది. పోలీసులు, అధికారులే మాకు న్యాయం చేయాలి.

కేసులు నమోదు చేశాం : ఎస్ఐ రాజశేఖర్, వేములవాడ రూరల్

కుల బహిష్కరణ చేసిన సందర్భంగా తొమ్మిది మందిపై కేసులు నమోదు చేశాం. వాళ్లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. నిన్న అవమాన పరిచినందుకుగాను ఇందిరారెడ్డి మళ్లీ ఫిర్యాదు చేశారు. దీంతో తిరుపతిరెడ్డి, సామ మల్లారెడ్డిపై కేసులు నమోదు చేశాం. రెండ్రోజుల్లో చార్జిషీటు కూడా దాఖలు చేస్తాం. బహిష్కరణకు పాల్పడినవారిపై అన్నివిధాలా చర్యలు తీసుకుంటాం.

ఖాకీలా..! భూ భక్షకులా!

(మొదటిపేజీ తరువాయి)

డబ్బులు కట్టలేకపోయారు. గడువు తీరడంతో ఆ భూమిని రూ.2 కోట్లకు గంగాధర్‌రెడ్డి, రవీంద్రరెడ్డిలకు ఖాద్రి విక్రయించాడు. దీంతో తమకు భూమి విక్రయించలేదనే అక్కసుతో ఐశ్వర్యరెడ్డి తన తండ్రి పులిందర్‌రెడ్డి అండతో రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. భూ యజమానితోపాటు దాన్ని కొనుగోలు చేసిన వారిపై కేసు నమోదు చేసినట్టు తెలుస్తోంది. బెదిరింపులకు కూడా దిగారు. దీంతో భూమి కొనుగోలు చేసిన గంగాధర్‌రెడ్డి, రవీంద్రరెడ్డిలు సైబరాబాద్ సీపీ సందీప్ శాండిల్యాను కలిసి తమపై అక్రమంగా కేసులు నమోదు చేశారని ఫిర్యాదు చేశారు. తమ వద్ద బలవంతంగా చెక్కులపై సంతకాలు చేయించుకున్నారని వివరించారు. దీంతో తీవ్రంగా స్పందించిన సీపీ మాదాపూర్ ఏసీపీ రమణకుమార్‌ను పిలిపించి రాచకొండ అదనపు డీసీపీ పులిందర్‌రెడ్డి, రాయదుర్గం సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ రాజశేఖర్, ఓ కానిస్టేబుల్‌తో పాటు ఇందులో ప్రమేయం ఉన్న పలువురిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. దీంతో వారిపై ఐపీసీ 448, 365, 342, 384, 147, 506 ఆర్‌డబ్ల్యూ 149 సెక్షన్స్ కింద రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లోనే కేసు నమోదు చేశారు.

ఇది 'నర' సంహారమే

(మొదటిపేజీ తరువాయి)

మొదలు పెట్టారు. ఈలోపు పోలీసులు వారిని అడ్డుకుని.. చితకబాది అరెస్టు చేశారు.

తప్పు సర్కారుది.. వేటు ఆస్పత్రి అధికారులపై..

ఆక్సిజన్ కొరత కారణంగా చిన్నారులు చనిపోలేదని ప్రచారం చేస్తున్న యోగి సర్కారు.. తన తప్పిదాన్ని కప్పిపుచ్చటానికి నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న నెపంతో.. ఇద్దరు ఆస్పత్రి అధికారులపై వేటు వేశారు. మెదడు వాపు వార్డు హెడ్ డాక్టర్ కఫీల్ ఖాన్‌తో పాటు ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. వాస్తవానికి వార్డ్ హెడ్ కఫీల్‌ఖాన్ వల్లే తమ బిడ్డలకు పునర్జన్మ లభించిందని ప్రాణాలతో బయట పడిన చిన్నారుల తల్లిదండ్రులు తెలిపారు. అలాంటి డాక్టర్‌పై యోగి సర్కారు వేటు వేయటంతో ఇటు జనంలోనూ, అటు ఆస్పత్రి సిబ్బందిలోనూ ఆందోళన.. ఆగ్రహం వ్యక్తమవుతున్నది. మరోవైపు.. ఆస్పత్రిని సీఎం సందర్శించిన రోజే ఆక్సిజన్ అందక మరో చిన్నారి చనిపోవడం గమనార్హం. వీవీఐపీలు వెళ్లాకే ఆస్పత్రి సిబ్బంది బిడ్డను ఇచ్చారని రామ్ తెలిపారు. ఆగస్టు7న 9 మంది, 8న 12 మంది, 9న 9మంది, 10న 23 మంది, 11న 11 మంది, 12న 7 మంది, 13న మధ్యాహ్నం వరకు 6గురు చిన్నారులు చనిపోయారు.

యోగి సర్కారుదే బాధ్యత: సీపీఐ(ఎం)

గోరఖ్‌పూర్‌లోని సర్కారు దవాఖానాలో 63మందికి పైగా చిన్నారులు మృతి చెందిన ఘటనకు ఆ రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో స్పష్టం చేసింది. ఆ రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. ముఖ్యమంత్రి సహా దోషులెవరైనా కఠినంగా శిక్షించాలని, ఘటనపై ఉన్నతస్థాయి న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. చిన్నారుల మరణాలకు ఆక్సిజన్ కొరత కారణం కాదని, ఆస్పత్రిలో పరిశుభ్రత లోపించడమే కారణమని యూపీ సీఎం, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు చేస్తున్న వాదన సరి కాదని తెలిపింది. ఆక్సిజన్ సరఫరాదారులకు కొన్నేండ్లుగా బకాయిలు చెల్లించకపోవడంపై హెచ్చరికలు వచ్చినా పట్టించుకోకపోవడాన్ని పొలిట్‌బ్యూరో గుర్తు చేసింది. స్వచ్ఛ భారత్‌పై ప్రధాని మోడీ, బీజేపీ నేతలు ఎంతో ప్రచారం చేసుకుంటున్నారని, స్వయంగా యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ గోరఖ్‌పూర్ లోక్‌సభ స్థానానికి 20 ఏండ్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారని తెలిపింది. పరిశుభ్రత లోపించడంపైనా ముఖ్యమంత్రే బాధ్యత వహించాలని చెప్పింది.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉత్తరప్రదేశ్ గోరఖ్‌పూర్‌బాబా రాఘవదాస్ (బీఆర్డీ) ప్రభుత్వ ఆస్పత్రిలో ఆక్సిజన్ అందక 63 మంది చిన్నారుల మృతికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి చుక్క రాములు, ఎం. సాయిబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాజమాన్యం, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ ఘోర సంఘటన జరిగిందని, సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రజల సంక్షేమం పట్టించుకోకుండా, మతపరమైన ప్రచారాలకు ప్రాధాన్యత ఇవ్వడం వల్లే ఇలాంటి సంఘటలను చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ఆక్సిజన్ సరఫరా చేసే కంపెనీకి బకాయిలు చెల్లించాలని ఆస్పత్రి వర్గాలకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని కంపెనీ చెబుతోందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి చిన్నారుల మరణాలకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వలసల బండి






నవతెలంగాణ-ఖమ్మం ప్రతినిధి

ఖమ్మం మీదుగా ప్రతిరోజూ ఉదయం వెళ్లే పూరీ ప్యాసింజర్ రైలు మొత్తం కూలీలతో నిండిపోతున్నది. పందిర్లపల్లి, చింతకాని, నాగులవంచ, బోనకల్, మోటమర్రి, తొండలగోపవరం, చెరువు మాదారం, ఎర్రుపాలెం, రాయలపాడు ఇలా పలు స్టేషన్‌ల్లో ప్రతి రోజూ ఆరువేల మంది కూలీలు కృష్ణా జిల్లాలోని పారిశ్రామిక ప్రాంతాలైన కొండపల్లి, రాయనపాడుకు వెళ్తున్నారు. అక్కడ ఉన్న సిమెంట్, కొండపల్లి బొమ్మల, విద్యుత్ ప్లాంట్ల పరిశ్రమల్లోకి మగవారు కూలీకెళ్తున్నారు. ఆడవారు కృష్ణా డెల్టా పరిధిలోని నాట్లు వేసేందుకు వెళ్తున్నారు. ఆడవారికి ఈ పని మూడు నెలలే ఉంటుంది. కూలీలంతా పొట్టచేత పట్టుకుని ఉదయాన్నే ప్యాసింజర్ రైలెక్కుతున్నారు. కొండపల్లిలో ఆ ప్యాసింజర్ ట్రైన్ ఆగగానే ఒక్కసారిగా 6 వేలకుపైగా కూలీలు చేతుల్లో టిఫిన్ బాక్సులు పట్టుకుని ఆటో స్టాండ్‌కు పరుగులు తీస్తారు. కొందరైతే రైల్వే ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై నుంచి వెళితే లేటు అవుతుందనే ఉద్దేశంతో ప్రమాద గండం పొంచి ఉందని తెలిసి కూడా...పట్టాల మీదకెళ్లి ఆటోల వద్దకు ఉరుకుతున్నారు. ఐదు నిమిషాలు లేటైతే ఆటోల్లో ప్లేసు దొరకదు. దీంతో వయస్సుపైబడిన కూలీలకు పని దొరకటం కష్టంగా మారింది. ట్రైన్ మిస్ అయినా, ఆటో స్టాండ్‌కు ఐదారు నిమిషాలు లేటుగా వెళ్లినా ఆ రోజు పని కోల్పోవాల్సిందే. కొండపల్లికి వెళ్లగానే అక్కడ ఉన్న దళారులు కూలీలను పరిశ్రమలకు, నాట్లు వేసేందుకు తీసుకెళు_్నారు. దీనికి గానూ వారికిచ్చే కూలీ మూడొందల రూపాయలు. అందులో దళారీ కమీషన్ రూ.50. రోజూ ట్రైన్ చార్జీ రానుపోనూ రూ.60, ఆటో చార్జీలు 40. ఇలా కమీషన్, చార్జీలు పోనూ కూలీలకు మిగిలేది రూ.150యే. కొందరు దళారులు ఇదే పనిగా జిల్లాకు చెందిన కూలీలకు తక్కువ వేతనమిస్తూ శ్రమదో పిడీకి పాల్పడుతున్నారని కూలీలు వాపోతున్నారు. దాదాపు 80కిలోమీటర్ల దూరం కూలి కోసం రైలులో ప్రయాణించి పని దొరకక ఉసూరుమంటూ ఇండ్లకు చేరుతున్నారు.

ఆయకట్టుకు నీరురాక...'ఉపాధి'లేక


ఖమ్మం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2.78లక్షల ఎకరాల సాగర్ ఆయకట్టు ఉంది. ఇది ఎక్కువగా కల్లూరు, తల్లాడ, కొణిజర్ల, చింతకాని, ఎర్రుపాలెం, ముదిగొండ, మధిర, బోనకల్, వైరా, కూసుమంచి, ఖమ్మం రూరల్, కామేపల్లి, తదితర మండలాల్లో విస్తరించి ఉంది. నాగార్జునసాగర్‌లో ప్రతి ఏటా నీటిమట్టం ఆశించిన స్థాయిలో లేకపోవటం వల్ల ఏడేండ్లుగా ఖమ్మం జిల్లాలోని సాగర్ ఆయకట్టుకు అంతగా నీరు అందట్లేదు. ప్రధానంగా వైరా రిజర్వాయర్ పరిధిలోని దాదాపు ఏడు మండలాల్లో 17,390 ఎకరాల సాగు ఏడేండ్లుగా ప్రశ్నార్థకంగా మారింది. పెనుబల్లి మండలంలోని లంకసాగర్ ప్రాజెక్టు పరిధిలోని 7,350 ఎకరాల్లో నాలుగేండ్లుగా పంటల్లేవు. ములకలపల్లి మండలంలోని మూకమామిడి ప్రాజెక్టు కింద 350 ఎకరాల్లో ఏనాడూ సక్రమంగా సాగైన దాఖలాల్లేవు. పాల్వంచలోని కిన్నెరసాని ప్రాజెక్టు కింద సాగుకావాల్సిన 15,000 ఎకరాలు కాస్తంత మెరుగ్గానే ఉంది. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు పరిధిలోని 24,700 ఎకరాల సాగు కూడా అంతంతమాత్రమే. ఇదికాక పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని1875 చెరువులున్నాయి.వీటి పరిధిలో ఉన్న 48,707 ఎకరాల ఆయకట్టు కూడా అయోమయంలో పడింది. జిల్లాలో మొత్తం 2,274 చెరువులు, కుంటలున్నాయి. వీటి పరిధిలో సాగయ్యే 1,90,060 ఎకరాల ఆయకట్టు కూడా సాగయ్యే సూచనలు కనిపించడంలేదు.వీటన్నింటికీ సాగర్ నీరు రావపోవడమే కారణంగా తెలుస్తోంది. ప్రస్తుతం ఖరీఫ్ నాట్లువేసే సమయం వచ్చినా సాగర్ కింద, చెరువుల కింద నాట్లు వేసే పరిస్థితి కనిపించట్లేదు. దీంతో కూలీలకు పనిదొరకటం కష్టమైంది. మరోవైపు నోట్ల రద్దు, జీఎస్టీ ప్రభావంతో రియల్ ఎస్టేట్ రంగమూ కుదేలైంది. దీంతో భవననిర్మాణ కార్మికులకూ పని దొరకట్లేదు. ఇంకోవైపు సర్కారు ఉపాధి హామీ పనులు కల్పించట్లేదు. ఖమ్మం జిల్లాలో 7,60,011, కొత్తగూడెం జిల్లాలో 4,86,446 మంది ఉపాధి కూలీలున్నారు. వీరికి సర్కారు సరిపడా పనులు కల్పించట్లేదు. పనుల్లేకనే పూటగడవక పొట్టచేత పట్టుకుని పొరుగురాష్ట్రానికి పనులకెళ్తున్నామని కూలీలు చెబుతున్నారు.

రోజూ 100కిలో మీటర్లు పోతున్నాం :రామయ్య-కూలీ



తెల్లవారుజామునే రైలెక్కి రోజూ 100కిలోమీటర్ల దూరం పోతున్నం. అంత దూరం పోయినా రోజూ పనిదొరకదు. దొరకని రోజూ ఒట్టిచేతుల్తోనే వస్తం. మంది ఎక్కువైతే యజమానులు కూలి తగ్గించి ఇస్తున్నారు. సొంతూ రు కాదు కాబట్టి ఎదురు మాట్లాడలేం.

మూడ్నెళ్లు అక్కడే.. : వెంకయ్య, కూలీ



పిల్లలను వదిలేసి కొండ పల్లికి పోతాం. మగవాళ్లం పరిశ్రమల్లో పనిచేస్తం. మా ఆడోళ్లు అక్కడే నాట్లు వేసే పనికి పోతరు. ఇట్ల మూడ్నెళ్లు పనులు దొరుకుతయి. సాగర్‌నీరు వస్తే ఇన్ని ఇబ్బందులుండేవి కావు. ఇటీవల ఇసుక లేక సుతారిపనుల్లేవు. ఇప్పుడు వాళ్లు కూడా ఇటువైపే వస్తున్నారు. కూలీల మధ్య పోటీ పెరుగుతున్నది. ఇది దళారులకు అలుసుగా మారింది.

అధికారమే లక్ష్యం...



(మొదటిపేజీ తరువాయి)

ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జీ ఏఆర్ కుంతియా పాల్గొన్నారు. గుజరాత్‌లో రాహుల్‌గాంధీపై దాడిని సమావేశం ఖండించింది. ఉత్తరప్రదేశ్‌లో చిన్నారుల మృతికి సంతాపం ప్రకటించింది. వచ్చే ఎన్నికల్లో రాహుల్‌గాంధీ ఫార్ములా అమలు చేయాలని, అధికారం సాధించే దిశగా అన్ని ప్రయత్నాలు చేయాలని సమావేశం అభిప్రాయపడింది. సర్కారు విధిస్తున్న నిర్బంధాన్ని ఎదిరించాలని, దీనికి సంబంధించి కార్యాచరణ రూపొందించుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. వచ్చే నెలాఖరులోగా బూత్ కమిటీల నుంచి డివిజన్ కమిటీలను ఏర్పాటు చేస్తామని, బూత్ లెవల్ ఏజెంట్లను ఇప్పట్నుంచే నియమిస్తామని సామాజిక మాధ్యమాన్ని మరింత విస్త తం చేసేందుకు జిల్లా, డివిజన్, మండల స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు కో ఆర్డినేటర్లను నియమిస్తామని నేతలు తెలిపారు. సమావేశంలో సీఎల్పీ నేత జానారెడ్డి, కార్య నిర్వహాక అధ్యక్షులు భట్టి విక్రమార్క, మండలి విపక్ష నేత షబ్బీర్ అలీ, ఎంపీ రేణుక చౌదరి, పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, పార్టీ అనుబంధ సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు.

దామోదర ఆగ్రహం

పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాలపై సీనియర్‌నేత దామోదర రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. అందరిని కలుపుకుని పోవడం లేదని ఫిర్యాదు చేశారు. అందరిని కలుపుకుని ఐక్యంగా ముందుకుపోతేనే అధికారపార్టీని ఎదుర్కోవడానికి అవకాశం ఉంటుందని సూచించారు. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఖమ్మం నుండి హైదరాబాద్ వరకు చేయబోయే పాదయాత్రను తెలియజేయాలని, పార్టీ అధిష్ఠానం అనుమతి ఇవ్వాలని కోరానని అన్నారు.

42 ఏండ్ల కాంగ్రెస్ పాలనపై చార్జిషీట్

- కుంతియాపై ఎంపీ నర్సయ్య ఫైర్

హైదరాబాద్ : కాంగ్రెస్‌పై ఎంపీ బూర నర్సయ్య గౌడ్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీ 42 ఏండ్ల పాలనలో తెలంగాణకు జరిగిన అన్యాయంపై చార్జీషీటు వేస్తామని ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మూడేండ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం ఒక్కడే బాగుపడిందంటూ టీపీసీసీ ఇన్‌ఛార్జీ ఏఆర్ కుంతియా చేసిన విమర్శలను ఆయన ఖండించారు. రాజకీయ విమర్శలు చేయడం సరికాదన్నారు. అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందన్నారు. ఏమి తెలుసుకోకుండా రాజకీయ విమర్శలు చేయడం సరికాదన్నారు. మూడేండ్ల పాలనపై కాంగ్రెసు పార్టీ చార్జ్ షీట్ వేసిందని, తాము కూడా జవహర్ లాల్ నెహ్రూ నుంచి మన్మోహన్ సింగ్ వరకు 42 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో తెలంగాణకు చేసిన అన్యాయాలు, ద్రోహాలు, మోసాలు, తెలంగాణ ప్రజలపై సాగిన దాడులపై ఛార్జిషీట్ వేస్తామని ప్రకటించారు.

సెన్సెక్స్ ▼ 317
31,213

నిఫ్టీ ▼ 109
9,710

శుక్రవారం మార్కెట్లు ముగింపు నాటికి

డాలరుకు రూపాయి విలువ
64.14



బంగారం(10.గ్రా)
రూ. 29,764



వెండి (కేజీ)
రూ. 42,400



కోడిగుడ్లు

హైదరాబాద్	330	విజయవాడ	340
ఒక్కగుడ్డుకు	3.95	చెన్నై	372
వరంగల్	330	ముంబయి	375



బీఎస్ఎన్ఎల్ మరో బంపర్ ఆఫర్!

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) తమ వినియోగదారుల కోసం సరికొత్త ఆఫర్‌ను ప్రవేశపెట్టింది. జియో పుట్టించిన మంటతో టెలికాం రంగంలో తీవ్ర పోటి నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బీఎస్ఎన్ఎల్ తమ ప్రీపెయిడ్ వినియోగదారుల కోసం అన్‌లిమిటెడ్ డేటా ప్లాన్‌ను తీసుకొచ్చింది. ఇందుకు రూ.1099 చెల్లించాల్సి వస్తుందని తెలిపింది. కాగా ఒకసారి ఈ మొత్తం చెల్లిస్తే 30 రోజుల పాటు అన్‌లిమిటెడ్ డేటాను ఏలాంటి స్పీడ్ లిమిట్ లేకుండానే వినియోగించుకోవచ్చని బీఎస్ఎన్ఎల్ ట్వీట్టర్ వేదికగా పేర్కొంది. మార్కెట్లోకి జియో రాకతో పలు టెలికాం సంస్థలు కొత్త ఆఫర్లను ప్రవేశపెడుతున్న విషయం తెలిసిందే. వీటితో పాటు బీఎస్ఎన్ఎల్ కూడా కొత్త ఆఫర్లను ప్రవేశపెడుతుంది. అయితే ప్రస్తుతం ఆయా టెలికాం సంస్థలు ఆన్‌లిమిటెడ్ డేటా ప్యాక్‌లని విడుదల చేస్తున్నప్పటికీ.. డేటా విషయంలో వారు రోజువారి పరిమితిని విధిస్తున్నాయి. ఈ లిమిట్ దాటితే డేటా వేగం పడిపోతుంది. ఇప్పుడు అలాంటి ఆంక్షలు లేకుండానే ఒక నెల పాటు పూర్తిగా అపరిమిత డేటా వినియోగించే విధంగా సరికొత్త ఆఫర్‌ను బీఎస్ఎన్ఎల్ తీసుకొచ్చింది.

తగ్గుతున్న రుణ వృద్ధి !



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: బ్యాంకింగ్ వ్యవస్థలో ఈ ఏడాది రుణ వృద్ధి వరుసగా పతనం దిశగా కొనసాగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశంలోని అన్ని వాణిజ్య బ్యాంకుల రుణ వృద్ధి దాదాపు 1.5 లక్షల కోట్లకు తగ్గిందని ఆర్‌బీఐ, ఎస్‌బీఐ గణంకాలు వెల్లడిస్తున్నాయి. 2017 జులై 21 నాటికి ఏడాది నుంచి తేది వరకు (ఏప్రిల్–జులై), ఏడాది నుంచి ఏడాది(జులై)కి రుణ వృద్ధి చారిత్రాత్మక కనిష్టానికి మందగించినట్టుగా పేర్కొంది. పెట్టుబడి సైకిల్ ఒత్తిడికి లోనుకావడం, తయారీ రంగం సామర్థ్యం సన్నగిల్లడం, కార్పొరేట్ల పరపతి రేటింగ్ పడిపోవడంతో రుణవృద్ధి మందగించడానికి కారణమైందని ఎస్‌బీఐ ముఖ్య ఆర్థికవేత్త సౌమ్య కాంతి ఘోష్ గురువారం విడుదల చేసిన ఎస్‌బీఐ రిపోర్టులో పేర్కొన్నారు. కాగా 2017 ఏప్రిల్ నుంచి దేశంలోని అన్ని రంగాల్లో వృద్ధి క్షీణించిందని భారతీయ బ్యాంకింగ్ సిస్టమ్ సమీక్షలో వెల్లడి అయినట్టు ఆమె పేర్కొన్నారు. మరోవైపు 2016 సెప్టెంబర్ నుంచి వ్యక్తిగత రుణాల (హౌసింగ్) వృద్ధి పడిపోవడం కూడా ఇబ్బందికరమైన అంశమని, అన్ని రంగాల్లో రుణవృద్ధి మందగించడానికి ఇదే ఒక నిదర్శనం అని ఎస్‌బీఐ రిపోర్టులో ఘోష్ అభిప్రాయపడ్డారు. మరోవైపు గతేడాది మాదిరి లాగే క్రెడిట్‌కార్డు ఔట్‌స్టాండింగ్ వరుసగా పెరుగుతూ వస్తుందని వివరించారు. గృహరుణాలు స్వల్పంగా పెరిగాయన్నారు. ఇది ఆందోళన కలిగించే విషయమని తెలిపారు. ఇక సేవల రంగంలోనూ క్రెడిట్ పెరుగుదల ఉన్నప్పటికీ..నష్టం భయం కనిపిస్తుందని, నిర్మాణ రంగానికి సంబంధించి ఇప్పటి వరకు అయితే క్రెడిట్ కొంత ఆకర్షణియంగా ఉన్నట్టుగా ఎస్‌బీఐ రిపోర్టులో పేర్కొన్నారు.

ద్రవ్యోల్బణ గణాంకాలే దిక్సూచి!

14న 'టోకు' రిటైల్ గణాంకాల రాక..

- అమెరికా–ఉత్తర కొరియా అంశాలూ కీలకమే..



నవతెలంగాణ, వాణిజ్యవిభాగం: ఈ వారం దేశీయంగా వెలువడే ఆర్థిక గణాంకాలతో పాటు చివరి దశకు చేరుకున్న కంపెనీల ఆర్థిక ఫలితాలపై స్టాక్ మార్కెట్లు ప్రధానంగా దృష్టిసారించనున్నాయి. అలాగే అమెరికా, ఉత్తర కొరియా భౌగోళిక రాజకీయ అభివృద్ధి అంశాలు కూడా సోమవారం నాటి మార్కెట్లకు కీలకంగా మారనున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. వీటితో పాటు విదేశీ, దేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల సరళీ, డాలరుతో రూపాయి మారకం విలువ, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల కదలికలు, ప్రపంచ మార్కెట్ల పోకడ, వర్షాపాత నమోదు, ప్రపంచ స్థూల గణాంకాలు, ఫెడ్ మినిట్స్ వంటి తదితర అంశాలు కూడా స్టాక్ మార్కెట్లపై ప్రభావం చూపేవేనని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. గతవారం అంతర్జాతీయ పరిణామాలకు తోడు, ట్రేడింగ్ నుంచి 331 డొల్ల కంపెనీలను సెబీ బహిష్కరించడం, నిరాశాజనక కార్పొరేట్ ఫలితాలు మార్కెట్ పతనానికి దోహదం చేశాయి. దీంతో వారాంతంలో సెన్సెక్స్ 318 పాయింట్లు క్షీణించి 31,214 వద్ద ముగిసింది. అదేవిధంగా నిఫ్టీ 109 పాయింట్లు నష్టపోయి 9,710 వద్ద స్థిరపడింది. మొత్తంగా గతవారం సెన్సెక్స్ ఏకంగా 1100 పాయింట్లు పతనమైంది. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం మార్కెట్లకు సెలవు కావడంతో వచ్చేవారం స్టాక్ మార్కెట్లు నాలుగు రోజులకే పరిమితం కానుంది. ఈ నేపథ్యంలో ఈ వారం మార్కెట్ల గమనం ఏలా ఉంటుందో వేచి చూడాల్సిన అంశం..

ఆర్థిక గణాంకాలు...

జులై నెలకు సంబంధించిన ద్రవ్యోల్బణ గణాంకాలు ఈనెల 14న (సోమవారం) వెల్లడి కానున్నాయి. దీంట్లో 'టోకు ధరల ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) గణాంకాలు మార్కెట్ సమయంలో వెలువడతాయి. కాగా మార్కెట్లు ముగిసిన అనంతరం రిటైల్ ఆధారిత ద్రవ్యోల్బణ (సీపీఐ) గణాంకాలు వెల్లడి కానున్నాయి. జూన్ నెలలో టోకు ద్రవ్యోల్బణం 0.9శాతానికి చేరగా, మే నెలలో 2.17శాతంగా నమోదైంది. రిటైల్ ద్రవ్యోల్బణం (సీపీఐ) జూన్‌లో 1.54శాతంగా నమోదు కాగా మే నెలలో 2.18శాతంగా ఉంది.

ఈ నెల11న శుక్రవారం విడుదల అయిన జూన్ పారిశ్రామికోత్పత్తి గణాంకాలు తీవ్ర నిరాశపరిచాయి. దీంతో జూన్ నెలలో ఐఐపీ సూచీ 0.1శాతానికి దిగజారి రెండేండ్ల కనిష్టానికి పడిపోయింది. అంతకు క్రితం మే నెలలో ఇది 2.8శాతంగా ఉంది. తయారీ రంగం పేలవమైన ప్రదర్శననే ఈ ప్రతికూలతలకు కారణమైంది. ఈ నేపథ్యంలో ఈ వారం స్టాక్ మార్కెట్లకు ఈ మూడు అంశాలే కీలకంగా మారనున్నాయి.

యుద్ధ భయాలు..

అమెరికా– ఉత్తర కొరియా మధ్య ప్రస్తుతం నెలకొన్న యుద్ధవాతావరణం దేశీయ స్టాక్ మార్కెట్లతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లలో ఆందోళనలు రేపుతోంది. దీంతో గతవారం దేశీయ స్టాక్ మార్కెట్లతో పాటు అమెరికా, ఆసియా స్టాక్ మార్కెట్లు పతనమయ్యాయి. అలాగే ఈ నెల బుధవారం అమెరికా కేంద్ర బ్యాంకు ఫెడ్ గత పాలసీ వివరాలు కూడా రానున్నాయి. ఈ వారం ప్రస్తుత అంశాలు సైతం మార్కెట్లను ప్రభావితం చేయవచ్చునని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు.

చివరిదశకు చేరుకున్న ఫలితాలు

కోల్ ఇండియా, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, టాటా పవర్‌కు సంబంధించిన ప్రస్తుత ఆర్థిక సంవత్సర జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాల సోమవారం (14న) విడుదల కానున్నాయి. అదానీ పోర్ట్స్ త్రైమాసిక ఫలితాలు శనివారం వెల్లడి అయ్యాయి. జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో ఆదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ రూ.710 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఈ అంశాలు సైతం సోమవారం స్టాక్ మార్కెట్లను ప్రభావితం చేయగలవని నిపుణులు చెబుతున్నారు.

మార్కెట్లో రూ.6.5 లక్షల కోట్లు ఆవిరి!

ఉత్తర కొరియా– అమెరికాల మధ్య నెలకొన్న యుద్ధ మేఘాలు గత వారం దేశీయ స్టాక్ మార్కెట్లలో మదుపరులను కన్నీళ్లు పెట్టించాయి. కేవలం అయిదు రోజుల్లోనే దాదాపుగా రూ.6.4 లక్షల కోట్ల మదుపరుల సంపద ఆవిరైపోయింది. అమెరికా, ఉత్తర కొరియా మధ్య యుద్ధ వాతావరణం నెలకొనడంతో పాటు ఆర్థిక వృద్ధి రేటు అంచనాలపై భయాందోళనలు..

బడా కంపెనీలు కొన్ని నిరుత్సాహకర ఫలితాలను వెల్లడించడం మార్కెట్లపై ప్రభావం చూపింది. దీంతో స్టాక్ మార్కెట్లు కుదేలైయ్యాయి. అమ్మకాల ఒత్తిడితో కేవలం నాలుగు రోజుల్లోనే రూ 6.4 లక్షల కోట్ల మదుపరుల సొమ్ము ఆవిరైంది. గత వారం ప్రారంభంలో (ఆగస్టు 7న) రూ 139.5 లక్షల కోట్లుగా ఉన్న బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ వారం తిరగకుండానే శుక్రవారం మార్కెట్ ముగిసే సమయానికి రూ.133 లక్షల కోట్లకు పతనమైంది. గడిచిన వారంలో బీఎస్ఈ సెన్సెక్స్ 1100 పాయింట్లను కోల్పోయింది. మరోవైపు మార్కెట్ రెగ్యులేటర్ సెబీ 331 షెల్ కంపెనీల్లో ట్రేడింగ్‌ను నిలిపివేయడం కూడా షేర్ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. అమెరికా–ఉత్తర కొరియాల మధ్య యుద్ధ మేఘాలు ప్రధానంగా ప్రభావం చూపినప్పటికీ.. చైనాతో డోక్లాం సరిహద్దు వివాదం కూడా మదుపుదారుల సెంటిమెంట్‌ను ప్రభావితం చేసిందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. గ్లోబల్ మార్కెట్లు కుప్పకూలిన క్రమంలో ప్రపంచ వ్యాప్తంగా లక్ష కోట్ల డాలర్ల మేర ఇన్వెసర్లు నష్టపోయారు.

గత వారం సెన్సెక్స్



ఐటీఐఆర్‌కు నిధుల విడుదలలో తీవ్రజాప్యం

కేంద్ర ప్రభుత్వానికి మంత్రి కేటీఆర్ లేఖ

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

హైదరాబాద్ ఐటీఐఆర్‌కు నిధుల విడుదలలో తీవ్రజాప్యం జరుగుతోందని ఐటీ మంత్రి కేటీఆర్ అన్నారు. 2013లో కేంద్రం ఐటీఐఆర్‌కు అనుమతులిచ్చినా ఇప్పటివరకు కేంద్రం పట్టించుకోలేదని చెప్పారు. ఈమేరకు కేంద్ర ఐటీ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్‌కు కేటీఆర్ లేఖ రాశారు. ఐటీఐఆర్ ప్రాజెక్టుకు నిధుల విడుదలపై జరుగుతున్న జాప్యం గురించి లేఖలో వివరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఐటీఐఆర్ ప్రాజెక్టు జాతీయ స్థాయిలో ఆసక్తి రేకెత్తించిందని చెప్పారు. అయితే గత నాలుగు సంవత్సరాలలో కేంద్రం నుంచి సరైన మద్దతు లేకపోవడంతో ఐటీఐఆర్ ప్రాజెక్టు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. కేంద్రానికి ఈ ప్రాజెక్టు పట్ల స్పష్టత లేకపోడడం వల్ల అనేక అనుమానాలు నెలకొన్నాయని, వీటివల్ల గందరగోళం తలెత్తిందన్నారు. ఐటీఐఆర్ ప్రాజెక్టుపై విధాన పరమైన స్పష్టత ఇవ్వడంతోపాటు ఇప్పటికే ప్రాజెక్టులో భాగంగా నాలుగేండ్ల కిందట ఆమోదించిన నిధులను వెంటనే విడుదల చేయాలని మంత్రి కేటీఆర్ కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఐటీఐఆర్ డీపీఆర్ రెండు సార్లు కేంద్రానికి సమర్పించామని చెప్పారు. ఈ మేరకు మౌలిక వసతుల కల్పన కోసం రూ.4,863 కోట్లను రెండు దశల్లో సహాయం చేయాలని ఐటీ శాఖ కోరినట్టు తెలిపారు. ఈ ప్రతిపాదనలను పరిశీలించి రూ.3,275 కోట్లను (మొదటి దశ రూ.165 కోట్లు, రెండో దశ రూ.3,110 కోట్లు) మంజూరు చేశారని పేర్కొన్నారు. అయితే ఇప్పటికి అనేక సార్లు విజ్ఞప్తి చేసినా పూర్తి స్థాయి నిధుల విడుదల మాత్రం జరగలేదన్నారు. కేంద్రం ఇచ్చే ఈ సాయం హైదరబాద్ నగరానికి మరిన్ని పెట్టుబడులు తేవడంతో పాటు యువతకు ఉద్యోగాలు వస్తాయని, తద్వారా దేశ ఆర్థిక ప్రగతికి ఇతోధికంగా సహకరిస్తుందన్నారు.

జాతీయ పంచాయతీ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ : దేశవ్యాప్తంగా ఉత్తమ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు అవార్డులు ఇచ్చేందుకు దరఖాస్తులను కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఆహ్వానం పలికింది. దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రం నుండి అత్యుత్తమ గ్రామ పంచాయతీలకు, మండల, జిల్లా పరిషత్‌లకు ప్రతి సంవత్సరం ఏప్రిల్ 24న జాతీయ పంచాయతీరాజ్ దివస్ రోజున అవార్డులను ప్రదానం చేయనువతా. 2016–17 సంవత్సరానికి గాను అవార్డుల కోసం ఆన్‌లైన్‌లో ఈ నెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఇందులో దీనదయాల్ ఉపాధ్యాయ్ పంచాయతీ సశక్తి కరణ్ పురస్కార్ కింద రాష్ట్రం నుండి ఒక జిల్లా పరిషత్, రెండు మండల, నాలుగు గ్రామ పంచాయతీలకు అవార్డులు దక్కుతాయి. జిల్లా పరిషత్‌కు రూ.50 లక్షలు, మండల పరిషత్‌కు రూ.25లక్షలు, గ్రామపంచాయతీలకు జనాభా ప్రాతిపదికన 8 నుండి 12లక్షల వరకు నగదు పురస్కారం కూడా దక్కుతుంది. ఇక రెండవ విభాగంలో నానాజీ దేశ్‌ముఖ్ రాష్ట్రీయ గౌరవ్ గ్రామసభ పురస్కార్‌ను రాష్ట్రంలోని ఒక గ్రామపంచాయతీకి ఇస్తారు. గ్రామసభను అభివద్దిలో సమర్థవంతంగా వినియోగించిన గ్రామపంచాయతీకి 10 లక్షల నగదు ప్రోత్సాహకం కూడా అందజేస్తారు. మూడో విభాగంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను సమర్థవంతంగా అమలు చేసిన పంచాయతీకి ఉపాధి హామీ అవార్డుతో పాటు 10 లక్షల నగదు పురస్కారం కూడా దక్కనుంది.

లాటరీ పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక

సీఎంకు ఎస్సీ కార్పొరేషన్ ప్రతిపాదన

హైదరాబాద్ : పైరవీలకు అడ్డుకట్ట వేసే విధంగా ఎస్సీ కార్పొరేషన్ ప్రణాళిక రూపొందించింది. తాము రూపొందించిన ప్రణాళికను ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావుకు అందించింది. లబ్దిదారుల ఎంపికలో లాటరీ పద్ధతిని ప్రవేశపెట్టాలని ప్రతిపాదన చేసింది. లాటరీలో ఎంపికైన లబ్ధిదారులకు రుణాలు వెంటనే అందించి, గ్రౌండింగ్ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. సీఎంనుంచి అనుమతి రాగానే.. ఈ పద్ధతిలోనే లబ్దిదారులను ఎంపిక చేస్తామన్నారు.

శ్రీచైతన్య కాలేజీలకు గుర్తింపు గండం!

సొసైటీ పేరు మార్పుతో చిక్కులు

- సేల్‌డీడ్, లీజు డీడ్ లేక తంటాలు
- విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో పేరుగాంచిన కార్పొరేట్ కాలేజీ శ్రీచైతన్య కష్టాలను ఎదుర్కొంటున్నది. శ్రీచైతన్య జూనియర్ కాలేజీలకు ఇంకా ఇంటర్ బోర్డు నుంచి అనుబంధ గుర్తింపు రాలేదు. సొసైటీ పేరు మార్చడమే ఈ చిక్కులకు కారణంగా కనిపిస్తున్నది. 1981లో శ్రీచైతన్య విద్యాసంస్థలు శ్రీచైతన్య ఎడ్యుకేషన్ కమిటీ పేరుతో సొసైటీగా ఏర్పడింది. విజయవాడ కేంద్రంగా అధ్యక్షులుగా బిఎస్ రావు, కార్యదర్శిగా బి ఝాన్సీ లక్ష్మిబాయి పేరు మీద స్థాపించారు. 2004లో శ్రీకళ్యాణ చక్రవర్తి మెమోరియల్ ఎడ్యుకేషనల్ ట్రస్టు పేరుతో మరో సొసైటీ రిజిస్టర్ అయ్యింది. ఇప్పటి వరకు శ్రీచైతన్య విద్యాసంస్థలు ఆ రెండు సొసైటీల పేరుతో నడుస్తున్నాయి. ప్రస్తుతం శ్రీ వశిష్ట ఎడ్యుకేషనల్ సొసైటీగా పేరు మార్చారు. శ్రీచైతన్య కాలేజీల పేరు మాత్రం మార్చలేదు. కొత్త సొసైటీ మేనేజింగ్ ట్రస్టీగా సుబోధ్ అనంతుల, సభ్యునిగా వై సాయిశంకర్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ పేరు మార్చడంతో సమస్యలు ఉత్పన్నమయ్యాయి. కొత్త సొసైటీ పేరుతో కాలేజీ భవనాలకు సేల్‌డీడ్ లేదా లీజు డీడ్ లేకపోవడంతో తంటాలు మొదలయ్యాయి. అనుబంధ గుర్తింపు పొందాలంటే కాలేజీకి సేల్ డీడ్ లేదా లీజు డీడ్ తప్పనిసరిగా ఉండాలి. దీంతోపాటు ఎఫ్‌డీఆర్, శానిటేషన్, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్లు, స్ట్రక్చరల్ సౌండ్‌నెస్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా సమర్పించాలి. కొత్త సొసైటీ పేరుతో సేల్ డీడ్ లేదా లీజు డీడ్ లేకపోవడంతో శ్రీచైతన్య కాలేజీలకు అనుబంధ గుర్తింపు పొందేందుకు అవకాశం లేదు. ఇప్పటికే దరఖాస్తు చేసినా లీజు డీడ్ లేనందున ఇంటర్‌బోర్డు అనుబంధ గుర్తింపు ఇవ్వడానికి నిరాకరించింది. ఏం చేయాలనే దానిపై శ్రీచైతన్య యాజమాన్యం తర్జనభర్జనలు పడుతున్నది.

కాలేజీల మనుగడ ప్రశ్నార్థకం

తెలంగాణలో శ్రీచైతన్య జూనియర్ కాలేజీలు హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ ఉమ్మడి జిల్లాల్లో కలిపి 135 వరకు ఉన్నాయి. అనుమతి లేకుండా అదనపు సెక్షన్లు నిర్వహించడంతో విజిలెన్స్ అధికారులు 16 శ్రీచైతన్య కాలేజీలపై జరిమానా విధించారు. ఇటీవలే రూ.1.55 కోట్లు ఇంటర్ బోర్డుకు చెల్లించింది.

దీంతో కొన్ని ఇబ్బందుల నుంచి గట్టెక్కింది. రాష్ట్రంలో లీజు డీడ్ సమర్పించకుండా గుర్తింపు కోసం దరఖాస్తు చేసిన ప్రయివేటు జూనియర్ కాలేజీలు 80 వరకు ఉన్నట్టు సమాచారం. ఇందులో శ్రీచైతన్య కాలేజీలే 40 వరకు ఉన్నాయి. పాత సొసైటీ పేరుమీద ఉన్న లీజు డీడ్ ఆధారంగా 40 శ్రీచైతన్య కాలేజీలకు గుర్తింపు ఇస్తే, మిగిలిన 40 ప్రయివేటు కాలేజీలకు ఇవ్వాల్సి వస్తుందని బోర్డు అధికారులు సమాలోచన చేస్తున్నట్టు సమాచారం. దీంతో కొత్త సొసైటీ పేరుతో కచ్చితంగా లీజు డీడ్ పొందాలని అధికారులు సూచిస్తున్నారు. సొసైటీ మార్పు వల్ల గుర్తింపు పొందని కాలేజీల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. శ్రీచైతన్య కాలేజీల్లో ప్రథమ సంవత్సరంలో సుమారు 70 వేల మంది, ద్వితీయ సంవత్సరంలో మరో 70 వేల మంది కలిపి మొత్తం 1.40 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నట్టు సమాచారం. గుర్తింపు పొందని కాలేజీల్లో సుమారు 45 వేల మంది ఉంటారని అంచనా. ఆ విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశముంది. గుర్తింపు లేదని తెలిసి విద్యార్థులు, తల్లిదండ్రులు అయోమయంలో పడ్డారు. గుర్తింపు వస్తుందా? రాదా?అని ఆందోళన చెందుతున్నారు. అనుబంధ గుర్తింపు పొందేందుకు ఈనెల 21వ తేదీ వరకు ఇంటర్ బోర్డు గడువు ఇచ్చింది. పాత సొసైటీల పేరుతో శ్రీచైతన్య కాలేజీలను నిర్వహించడమా? లేక కొత్త సొసైటీ పేరుతో లీజు డీడ్ పొంది గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోవడమా?అన్నది యాజమాన్యం చేతిలోనే ఉంది. విద్యార్థుల భవిష్యత్తుకు ఇబ్బంది కలగకుండా త్వరగా గుర్తింపు పొందాలని విద్యావేత్తలు, విద్యార్థి సంఘాల నాయకులు శ్రీచైతన్య యాజమాన్యాన్ని డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థులను అయోమయానికి గురిచేయొద్దని సూచిస్తున్నారు.

నాలుగు నెలల్లో ఎల్లంపల్లి, మిడ్‌మానేరు

- సమీక్షలో మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

డిసెంబర్ చివరి నాటికి ఎల్లంపల్లి, మిడ్‌మానేరు పూర్తి చేయాలని అధికారులను మంత్రి హరీశ్‌రావు అదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనుల పురోగతిపై ఆదివారం ఆయన సమీక్షించారు. ఈ ప్రాజెక్టు ఏడు పాత జిల్లాల రైతుల జీవితాలతో ముడిపడిన సంగతిని అధికారులకు మరోసారి గుర్తు చేశారు. 6,7,8 ప్యాకేజీలను వారంలో రెండురోజుల పాటు సమీక్షించాలని లిఫ్టుల సలహాదారు పెంటారెడ్డిని ఆయన ఆదేశించారు. నవంబర్ చివరి కల్లా ఎలక్ట్రికల్, మెకానికల్ పనులను, డిసెంబర్ కల్లా ప్యాకేజీ 6, 7, 8 పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. నవంబర్ కల్లా పంపుహౌజ్, టన్నెల్ పనులు, ఇతర నిర్మాణాలు పూర్తి కావాలన్నారు. డిసెంబర్ నాటికి సర్జ్‌పూల్ పనులు పూర్తి చేసి డ్రై రన్ నిర్వహించాలని ఆదేశించారు. మూడు ప్యాకేజీలకు చెందిన టన్నెల్స్, కెనాల్స్ లైనింగ్ పనులు అక్టోబరు, నవంబర్ కల్లా పూర్తి చేయాలన్నారు. మేడారం రిజర్వాయర్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. మేడారం రిజర్వాయర్‌కు సంబంధించిన రైతులకు పంట పరిహారం వెంటనే ఇవ్వాలన్నారు. క్రాప్ హాలిడేకు సంబంధించిన ఫైలును వెంటనే క్లియర్ చేయాలని ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ వికాసరాజ్‌కు సూచించారు. సమీక్షలో ప్రభుత్వ స్పెషల్ సీఎస్ జోషి, ఇరిగేషన్ ఏఎన్‌సీసీ మురళీధర్‌రావు, కాళేశ్వరం సీఈఎస్ ఎన్. వెంకటేశ్వర్లు, భూసేకరణ సలహాదారు జీ మనోహర్, ఈఈ. నూనె శ్రీధర్, వివిధ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కలెక్టర్లకు ఎక్సలెన్స్ అవార్డులు

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

అభివద్ధి కార్యక్రమాల్లో చురుగ్గా పనిచేయటంతో పాటు సరికొత్త ప్రణాళికలతో ముందుకు వెళ్తున్న ఐఏఎస్ అధికారులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2017సంవత్సరానికి గాను ఎక్సలెన్స్ అవార్డులతో సత్కరించనుంది. ఇందులో భాగంగా ఇన్నోవేషన్ విభాగంలో ప్రభుత్వ పాఠశాలల్లోని బాలికలకు ఆత్మరక్షణా శిక్షణ కార్యక్రమం నిర్వహించినందుకు గాను జనగామ జిల్లా కలెక్టర్ దేవసేనను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఐటీడీఏల్లో స్టార్స్–30 కార్యక్రమానికి గాను ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాశ్, ఐఏఎస్ అధికారులు ఆర్వీ కరణ్, అనురాగ్ జయంత్‌లకు, డిపిఎంఎస్ కార్యక్రమానికి గాను హెచ్ఎండీఏ కమిషనర్ చిరంజీవులకు ఈ అవార్డులను ప్రభుత్వం ప్రకటించింది. సాధారణ విభాగంలో నిస్సహాయ పిల్లలకు పునరావాసం కల్పించినందుకు గాను నిజామాబాద్ కలెక్టర్ యోగితా రాణా, జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ ఇన్‌స్టిట్యూషన్స్ పట్ల ప్రజల్లో నమ్మకం కలిగించినందుకు గాను జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ మురళి, జగిత్యాల జిల్లా కలెక్టర్ శరత్‌లు ప్రభుత్వ ఎక్సలెన్స్ అవార్డులకు ఎంపికయ్యారు. ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన ముఖ్యమైన కార్యక్రమాల నిర్వహణలో అద్భుత ప్రదర్శన కనబరిచిన వారికి ఈ అవార్డులను అందించనుంది. ఈ కేటగిరిలో మిషన్ భగీరథ కార్యక్రమానికి గాను సిద్దిపేట కలెక్టర్ వెంకటరమణ, మిషన్ కాకతీయ కు సంబంధించి భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారఖ్‌కి సంబందించి అదిలాబాద్ కలెక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాశ్, హరితహారం కింద సూర్యాపేట కలెక్టర్ సురేంద్ర మోహన్, వరంగల్ రూరల్ కలెక్టర్ ప్రశాంత్ జె పాటిల్‌లు అవార్డులను అందుకోనున్నారు. ఆరోగ్య లక్ష్మీ కార్యక్రమ నిర్వహణకు గాను నల్లగొండ జిల్లా కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ అవార్డులకు ఎంపికైనట్టు ప్రభుత్వం ప్రకటించింది.

సాహితీ ప్రముఖులకు పురస్కారం

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ముగ్గురు సాహితీ ప్రముఖులకు తెలంగాణ ప్రభుత్వం విశిష్ట పురస్కారం ప్రదానం చేయనున్నట్టు ముఖ్యమంత్రి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రముఖ గీత రచయితలు సుద్దాల అశోక్‌తేజ, జయరాజ్, ప్రముఖ సంస్కృత తెలుగు విధ్వాంసుడు శ్రీభాష్యం విజయ సారథిలకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పురస్కారాలు అందజేస్తారని తెలిపింది.

సీపీఎస్‌కు వ్యతిరేకంగా జిల్లాకేంద్రాల్లో 28న ర్యాలీలు: జాక్టో

నవతెలంగాణ బ్యూరో– హైదరాబాద్

సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 28న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ(జాక్టో) ఉపాధ్యాయులకు పిలుపునిచ్చింది.

ఆదివారం హైదరాబాద్‌లో కమిటీ ప్రతినిధులు భుజంగరావు, రఘునందన్, చెన్నయ్య, వేణుగోపాలస్వామి, జి సోమయ్య అధ్యక్షతన జాక్టో సమావేశం జరిగింది. టీఎస్‌సీపీఎస్ఈఏ పిలుపునిచ్చిన సెప్టెంబర్ 1న సామూహిక సెలవు ఉద్యమానికి జాక్టో సంపూర్ణ మద్దతు తెలిపింది. సెప్టెంబర్ జరిగే ర్యాలీలు, దీక్షలు, నిరసల్లో ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరింది. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం స్పందించి సీపీఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో జాక్టో ప్రతినిధులు సదానందం, రాంచంద్రం, అంజిరెడ్డి, శంకర్, అబ్దుల్లా, నయీం తదితరులు పాల్గొన్నారు.

హిందుత్వవాదులను ఎదిరించిన ప్రజ్ఞాశాలి ప్రొ॥కల్బుర్గి

భూపతి వెంకటేశ్వర్లు

దిగ్భ్రాంతిని కల్గించిన ఎంఎం.కల్బుర్గి హత్యతో ఒక గొప్ప పండితుడిని, విస్తృతంగా రచనలు చేసిన రచయితను, బహుముఖ ప్రజ్ఞాశాలియైన పరిశోధకుడిని దేశం కోల్పోయింది. కర్ణాటక చరిత్ర, సంస్కృతి, దాని జానపద సంపత్తి పైన అనితర సాధ్యమైన పట్టుగల మేధవిని హిందూ దురహంకారులు పొట్టన పెట్టుకున్నారు. 1988లో ఆచార్య మల్లేషప్ప మీడివలప్ప కల్బుర్గికి ఏభై సంవత్సరాలు నిండిన తరుణంలో ఆయన వ్యాసాల సంకలనాల మొదటి సంపుటి 'మార్గ' అనే పేరిట ప్రచురితమైంది. ప్రముఖ పండితుడు జీవితకాలంలో లోతుగా సాగించిన పరిశోధనకు అది మకుటామయమైంది. కన్నడ వాఙ్మయ ప్రపంచంలో అది ఒక మైలురాయి. కనుకనే అది మహదానందపు తరుణంగా నిల్చిపోయి ఉండాల్సిన ఘటన. కానీ ఆ ఘటన ఒక పెను సంక్షోభంగా పరిణమించింది.

ఆ సమయంలో ప్రచురితమైన తన ఒకానొక వ్యాసంలో కల్బుర్గి వచన సాహిత్యంపై తన ప్రాథమిక పరిశోధన ఆధారంగాను, జానపద గాథల ఆధారంగానూ చెన్నబసవన్న నిమ్నకులమైన 'దోహర' (చర్మకారులు) కులంలో జన్మించారని పేర్కొన్నారు. 12వ శతాబ్దానికి చెందిన వేదాంతి చెన్నబసవన్న (1105-1167) బసవకి సన్నిహిత అనుచరుడు మేనల్లుడు. నేడు ఉత్తర కర్ణాటక ప్రాంతంలో ఒక విశిష్టమైన సామాజిక మత ఉద్యమాన్ని స్థాపించిన బసవన్నల అనుచరులైన లింగాయతులు, పరమ పూజనీయునిగా భావిస్తారు. లింగాయత మత ప్రభోదాల రూపు రేఖల కల్పనలో చెన్నబసవనే ఎక్కువగా కృషి చేశాడు. అందుచేత లింగాయతులలోని ఒక వర్గం కల్బుర్గి వెలిబుచ్చిన భావాల పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పుడే మొట్టమొదటి సారిగా కల్బుర్గికి చంపుతామనే హెచ్చరిక అందింది. అది అంతటితో ఆగిపోలేదు. 'కల్బుర్గియా, వాడెవడు? వాడిని అంతం చేయడానికి రెండు లీటర్ల పెట్రోలుంటే చాలు' అనే వ్యాఖ్యలు అప్పుడు దార్వాడ్ అంతటా వినిపించేవి. అత్యంత అవమానకరమైన విషయం ఏమిటంటే అప్పటికే గొప్ప పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న కల్బుర్గిని దార్వాడ్‌లోని ఒక ప్రముఖ లింగాయత మఠానికి ఒక నేరస్తుడిని పిలిపించినట్టు పిలిపించి, చేతులు జోడించి మరీ తన వ్యాఖ్యలు ఉపసంహరించుకునేలా బలవంతం చేశారు. ఆ మఠం నుంచి తిరిగొచ్చిన తర్వాత కల్బుర్గి ఒక విలేఖరి ప్రశ్నకు సమాధానంగా 'నేను ఈ రోజు మేధోపరంగా ఆత్మహత్య చేసుకున్నాను' అని చెప్పారు.

దార్వాడ్‌లోని వారేమల్లూర్ ఈశ్వరన్ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ శశిధర్ తోడ్కర్ కల్బుర్గికి పాత విద్యార్థి అయిన ఈయన కల్బుర్గి ఇంటి వాసాలలో కూర్చొని ఈ ఘటనలను గుర్తు చేసుకున్నారు. 75 సంవత్సరాలు పైబడిన ఆ మేధావిని గుర్తు తెలియని దుండగులు ఆగస్టు 30న తుపాకీతో హత్య చేసిన వారం రోజుల తర్వాత ఆయన సన్నిహితులలో కొందరు ఆయన ఇంటిలో సమావేశమైనప్పుడు తోడ్కర్ ఈ ఘటనను గుర్తు చేశారు. గోవింద్ పన్సారే కోడలైన మేఘాపన్సారే ఈ పండితుడి కుటుంబంతో బాధను పంచుకోవడానికి కల్బుర్గి, పన్సారే, నరేంద్ర దభోల్కర్ హత్యలలో సారుప్యతల రీతా కార్యాచరణ రూపొందించుకోవడానికి అక్కడికి వచ్చారు.

మేఘాపన్సారే మాట్లాడుతూ 'ఆ మూడు హత్యల మధ్య ఖచ్చితంగా సంబంధముండి ఉంటుందని, ఎందుకంటే ఆ ముగ్గురు కూడా ప్రగతిశీల ఆలోచనాపరులు. మూఢాచారాలను ఖండిస్తూ ఉండేవారు. నభోల్కర్ ఒరిగి రెండేండ్లు అయ్యింది. పన్సారే దారుణ హత్య జరిగి ఆర్నెల్లు అయ్యింది. అయినా ఇంత వరకు ఆ కేసులలో పురోగతి లేదు. ఈ నేరపరిశోధనను తీవ్ర విషయంగా పరిగణించాలని నేను కర్ణాటక ప్రభుత్వాన్ని కోరుతున్నారు' అని ఆమె అన్నారు. కర్ణాటక పోలీసులు ఇంత వరకు హంతకులను గానీ, అతని సహచరులను గానీ పట్టుకోలేదు. ఆయన ఇంట్లో సమావేశమైన వారిని చూస్తేనే కల్బుర్గి ఘనత ఎంతటిదో మనకు తెలుస్తుంది. ఆయన ఇంటి వాసాలలో చిరు నవ్వులు చిందిస్తున్న కల్బుర్గి విలువైన పోస్టర్ వేలాడుతోంది. ఆయన కుటుంబ సభ్యులతోపాటు, పత్రికా విలేకరులు, ఇప్పుడు టీచర్లుగా పని చేస్తున్న ఆయన మాజీ శిష్యులు, సాహితీవేత్తలు, సామాజిక కార్యకర్తలు వారిలో ఉన్నారు. కుటుంబ ఆస్తి విషయంలోనే హత్య జరిగిందనే పుకార్లను కల్బుర్గి కొడుకు శ్రీ విజయ్ ఖండించారు. కల్బుర్గి చెప్పిన విషయాలు కొందరికి నచ్చలేదు. అందుకే ఆయనను చంపేశారు అన్నది స్పష్టంగా కనబడుతున్నది. శాంతికి మారుపేరుగా భావించే దార్వాడ్ పట్టణంలో ఈ హత్య జరగడం దేశంలోని కర్ణాటకలోని ఉదారవాద ప్రగతిశీల ప్రజానీకాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. జంట నగరాలైన హుబ్లి, ధార్వాడ్ కర్ణాటకలో బెంగుళూరు తర్వాత రెండో స్థానంలో ఉన్న పట్టణాలు ఉత్తర కర్ణాటకలో పారిశ్రామిక కేంద్రంగా హుబ్లి ప్రసిద్ధి గాంచగా, ధార్వాడ్ దాని సంస్కృతి, అక్కడ ఉన్న విద్యా సంస్థల మూలంగా ప్రసిద్ధమైంది. పేరు మోసిన హిందుస్తాని సంప్రదాయ గాయకులలో ముందు వరుసలో నిలిచే కొందరు ఆ నగరవాసులే. అంతేకాక ఎంతో పేరు మోసిన కర్ణాటక విశ్వ విద్యాలయానికి ఆవాసమైన ధార్వాడ్ కల్బుర్గి సంపన్నమైన మేధోవికాసానికి ఆలంబనకు చేకూర్చింది. కల్బుర్గి పొరుగు జిల్లా అయిన విపుర (గతంలో బీజాపూర్)లోని గచ్చెవాడ గ్రామంలో 1938 నవంబర్ 28న జన్మించారు. ఆయన కన్నడంలో అండర్ గ్రాడ్యుయేషన్, కవిరాజమార్గ రచించిబడిన కాలం నాటి కన్నడ సాహిత్యంపై ఆయన పరిశోధన చేశారు. క్రీ.శ. 850లో విరచితమైన ఈ రచన కన్నడ సాహిత్యంలోని కవిత్వం వ్యాకరణం తదితరాలను విశేషించిన ప్రాచీన రచనలో ఒకటి.



ఒక బహిరంగ వేదికలో ఆయన తనకు వచనాల సాహిత్యం ఆరాధ్యమైన మత గ్రంథమని పేర్కొంటూ భగద్గీతను తన మత గ్రంథంగా గుర్తించడానికి తిరస్కరించారు. 2015 ఏప్రిల్ నెలలో కర్ణాటకలో కులాన్ని పరిగణలోకి తీసుకుంటూ సాగిన సామాజిక విద్యారంగ సర్వే సమయంలో కల్బుర్గి లింగయతులను ఒక ప్రత్యేక మతంగా గుర్తించాలనే డిమాండును లేవనెత్తారు. కల్బుర్గి నాస్తికుడు కాదని గుర్తుంచుకోవాలని తాను బసవ ఆవయాయినని ఆయన చెప్పుకున్నారు. అయితే ఆయన రెండు విషయాలపై పట్టుదలతో ఉన్నారు. 'లింగయత సంప్రదాయం హిందూ మతానికి భిన్నమైనదని' లింగాయతుల సంప్రదాయంలో ప్రవేశించిన క్రతువలన్నీ మూఢాచారాలే తప్ప ఆ మతంలో భాగం కాదు అని ఆయన చెప్పేవారు. నరేంద్ర దభోల్కర్, గోవింద్ పన్సారేల వలే ఆయనను హేతువాది అని అనలేం. కానీ ధైర్య సాహసాలతో కూడిన ఆయన పద్ధతులు ఆ ఇద్దరు మహారాష్ట్ర హేతువాదుల పద్ధతులలో పోలి ఉంటాయి. కల్బుర్గిని ఒక సంస్కర్తగా పేర్కొనడం సమంజసంగా ఉంటుంది. గత కొన్ని సంవత్సరాలుగా ఆయన హిందుత్వ గ్రూపులపై కూడా విమర్శలు గుప్పించారు. 2014లో ఒకసెమినార్‌లో విగ్రహారాధనను గేలిచేస్తూ యూ.ఆర్.అనంతమూర్తి చేసిన వ్యాఖ్యలను ఆయన సమర్థన బహుళ ప్రాచుర్యంలోకి వచ్చింది. ప్రతిపాదిత కర్ణాటక మూఢాచారాల నిరోదక బిల్లుపై సెమినార్ నిర్వహించిన భూపతి, కల్బుర్గి వ్యాఖ్యపై మీడియా పెద్ద సంచలనాన్ని సృష్టించిందని అన్నారు. ఆ రోజున ఆయన అనేక ప్రయోజనకరమైన ఇతర వ్యాఖ్యలు కూడా చేశారు. అయితే మీడియా ఈ ఒక్క వ్యాఖ్యనే లంకించుకుంటుందని ఆయన తెలిపారు. తోడ్కర్ ఇలా అన్నారు. ఆ మరుసటి రోజు కన్నడ దిన పత్రికలో పతాక శీర్షికను చూసి మాస్టారు నాతో ఇలా అన్నారు. 'ఈ విలేకరి నా జీవిత కాలాన్ని ఒక పదేండ్లు తగ్గించి వేశాడు' అన్నాడు. తన వ్యాఖ్యలు కొందరికి కంటగింపుగా ఉన్నాయని ఆయనకు తెలుసు. అయితే స్వభావరీత్యానే ఆయన ముక్కు సూటిగా మాట్లాడతారు. తన వ్యాఖ్యల్లో కొంచెం వాడిని తగ్గించుకోవాలని మేము చెబితే ఆయన నాతో ఇలా అన్నారు. 'మత మౌఢ్యవాదులకు నేనెందుకు భయపడాలి. వారు మహాత్మాగాంధీ, బసవ వంటి వారినే వదిలిపెట్టనప్పుడు ఆ మహానుభావుల ముందు నేనెంతటి వాడిని' అని అన్నారు. భారతీయ జనతా పార్టీ గత రెండు దశాబ్దాల కాలంలో లింగాయతులలో ప్రధాన రాజకీయ పార్టీగా ఎదిగిన వైనంపై కర్ణాటకలోని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానించేది లేదన్నారు.

హత్యకు గురయ్యే సమయానికి కల్బుర్గి 16,17 శతాబ్దాలలో ఉత్తర కర్ణాటకలో పాలించిన ఆదిల్‌షాహి వంశకాలంలో రచన శైలిపై ఒక పరిశోధన చేస్తున్నారు. పర్షియా, అరబ్బు, ఉర్దూ భాషల్లోని రచనలను కన్నడంలోకి తర్జుమా చేయాలని ఆయన భావించారు. రాష్ట్ర చరిత్రను వివరించే క్రమంలో కర్ణాటకలోని చరిత్రకారులు, కర్ణాటక మధ్య యుగాల చరిత్రను పూర్తిగా విస్మరించి, తద్వారా ముస్లిం పాలకుల పట్ల ఘోర అపచారం చేశారని ఆయన అభిప్రాయం.

లింగయతులు కర్ణాటకలోని అతి పెద్ద సామాజిక విభాగంగా ఉత్తర కర్ణాటక అంతా విస్తరించి ఉన్నారు. అందుచేత లింగాయతులలో సంస్కరణల కోసం కల్బుర్గి తీవ్ర అభినివేశం హిందుత్వ శక్తులకు కంటగింపుగా మారింది. ఉదాహరణకు లింగయతులు గణేష్ చతుర్థి ఉత్సవాన్ని నిర్వహించుకోవడానికి వ్యతిరేకంగా కల్బుర్గి చేసిన వ్యాఖ్యలు హిందుత్వ మితవాద శక్తులకు మింగుడు పడలేదు. హిందుత్వ బృందాల మతోన్మాద ఎజెండాకు వ్యతిరేకంగా కల్బుర్గి బహిరంగ వేదికలపై నుంచి తరుచుగా మాట్లాడేవారు.

హత్యకు గురయ్యే సమయానికి కల్బుర్గి 16,17 శతాబ్దాలలో ఉత్తర కర్ణాటకలో పాలించిన ఆదిల్‌షాహి వంశకాలంలో రచన శైలిపై ఒక పరిశోధన చేస్తున్నారు. పర్షియా, అరబ్బు, ఉర్దూ భాషల్లోని రచనలను కన్నడంలోకి తర్జుమా చేయాలని ఆయన భావించారు. రాష్ట్ర చరిత్రను వివరించే క్రమంలో కర్ణాటకలోని చరిత్రకారులు, కర్ణాటక మధ్య యుగాల చరిత్రను పూర్తిగా విస్మరించి, తద్వారా ముస్లిం పాలకుల పట్ల ఘోర అపచారం చేశారని ఆయన అభిప్రాయం. కన్నడ పరిశోధనకు అపారమైన సమాచార భాండాన్ని అందించే ఆ ప్రాజెక్టు గురించి ఆయన ఎంతో ఉత్సాహపడ్డారు. 'ఈ రచనలు ప్రచురితమైన వెంటనే మనం కర్ణాటక చరిత్రను తిరగరాయాల్సి ఉంటుంది' అని ఆయన అన్నారు. కల్బుర్గి హంతకులను పట్టుకోవడం రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతా విషయంగా తీసుకోవాలి. అలా చేయడం ద్వారా రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో తాను అప్రమత్తంగా ఉన్నాననే సందేశం అందివ్వగలదు. దభోల్కర్ హత్య 2013లో మహారాష్ట్ర ప్రభుత్వ మూఢనమ్మకాలను, ఆనాచారాలను, చేతబడిని నిరోదించేందుకు బిల్లును ఒక ఆర్డినెన్స్ రూపంలో రావడానికి దారి తీసింది. కర్ణాటకలో ప్రతిపాదిత మూఢాచార వ్యతిరేక బిల్లుకు కల్బుర్గి ఒక గట్టి మద్దతుదారుడు. కనుక కర్ణాకట ప్రభుత్వం కూడా ఆయన స్మృతిని గౌరవిస్తూ అటువంటి బిల్లును తక్షణమే ఒక ఆర్డినెన్స్ రూపంగా తేవాలి. అలాగే పౌర సమాజంలో ఉన్న శాంతి హక్కులు, భావ ప్రకటనా స్వేచ్ఛను కోరుకునేవారు, ప్రజాస్వామ్య మనుగడ కోసం పోరాటం చేసేవారు, సంస్కరణవాదులు, సంఘ సంస్కర్తలు, పురోగమివాదులు, ప్రగతిశీల నాయకులు తదితరులందరూ ఇటువంటి హేయమైన చర్యలకు వ్యతిరేకంగా గళం విప్పాలి. ప్రభుత్వాల్ని ప్రశ్నించాలి. భావి భారత పౌరులను ఈ కుంపట్లోకి నొక్కకుండా కాపాడాలి. అలాగే కల్బుర్గి చేసిన కృషిని మరింత లోతుగా మరింత పట్టుదలతో, సాహసంతో ముందుకు తీసుకెళ్లేందుకు కర్తవ్యాఖులవ్వాలి. అప్పుడే ఆయనకు నిజమైన నివాలి.

సెల్ : 9490098343

నిచ్చెన మెట్ల వ్యవస్థపై

సమైక్య పోరాటం

ఆర్థిక దోపిడీ, కుల పీడన మిళితమైన మనదేశంలో అధిక ప్రజల బతుకులను దుర్భరం చేస్తున్నాయి. ఆధునిక విద్య, పారిశ్రామికీకరణ, రాజకీయ స్వాతంత్ర్యం మూలంగా కుల పీడన, వివక్షలు నశిస్తాయని ఆశించారు. కానీ 54 సంవత్సరాల స్వాతంత్ర్యనంతరం కూడా సమాజంలో రెండో శ్రేణి పౌరులుగా కుల వ్యత్యాసాలు, కుల పీడన ఇంకా వికృతంగా కొనసాగుతూనే ఉన్నాయి. ఆర్థిక పెత్తనాన్ని రక్షిస్తూ దళితులు, అనేక వెనుకబడిన కులాలు, మహిళ ఈజవితాలలో మార్పు లేకుండా అసమానతలను నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ కాపాడుతూనే ఉంది. అంటరానితనం ఇంకా కొనసాగుతున్నది. హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి ఎక్కువ చోట్ల ఉంది. దళజతులకు దేవాలయ ప్రవేశం లేదు. చెరువుల నుండి కుళాయిల నుంచి మంచినీళ్లు తెచ్చుకోనివ్వరు. ప్రజా ప్రతినిధులు కూడా దిష్టిబొమ్మలుగా ఉండాలి. అగ్రకుల పెత్తందార్ల ముందు కూర్చోరాదు. అభ్యంతరం చెబితే అవమానాలు, లైంగికదాడులు, హత్యలు, సాంఘిక బహిష్కరణలే. చట్టాలున్న పెత్తందార్ల చుట్టాలే న్యాయస్థానాల్లో న్యాయం జరగదు. వాదనలు, సాక్ష్యాలు, తాత్తడం చేయబడి న్యాయం అన్యాయమవుతున్నది.

నిచ్చెన మెట్ల కుల వ్యవస్థను వ్యతిరేకిస్తూ పెత్తందార్లపై యుద్ధం చేసిన పూలే, కబీర్, బ్రహ్మనాయుడు, అంబేద్కర్, రామస్వామి నాయకర్ వంటి వారు అంటరానితనంను విమర్శించారు. స్వాతంత్ర్యం తరువాత రాజ్యాంగంలో రిజర్వేషన్లు పొందుపర్చబడ్డాయి. రిజర్వేషన్లు కొంతమంది జీవన పరిస్థితిని మెరుగుచేశాయి. కానీ అంటరానితనంను రూపుమాపలేదు. కులాల బలం భావజాలంలోనే కాదు. అగ్రకుల పెత్తందార్ల బలాన్ని, పెత్తనాన్ని రక్షిస్తున్న భూకేంద్రీకరణలలో భూస్వామ్య వ్యవస్థలో ఉంది. భావజాల పోరాటంతోపాటు భూస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే పోరాటం చేయాలి. భూస్వామ్య వ్యవస్థ బద్దలైతే అగ్రకుల భూస్వాములకు దళజతులను అణిచేశక్తి తగ్గుతుంది. దళితులు, వెనుకబడిన వారికి తమ ఆర్థిక స్థితి మెరుగుపడడమే కాక పోరాట స్వభావం పెరుగుతుంది. భూమి పంపిణీలో భూస్వాముల పెత్తనానికి కోరలు పీకినట్లవుతుంది. ఆర్థిక వనరులు దళిత, వెనుకబడిన పేదల చేతుల్లోకి వస్తుంది. అంతేగాక భూపోరాటంలో వివిధ కులాల పేదల మధ్య అభేధ్య ఐక్యత ఏర్పడి కుల భావనలు తొలగిపోయి కుల వ్యవస్థ బలహీనపడుతుంది.

నేడు అగ్రకులాల పెత్తనం దళితులపైనే గాక వెనుకబడిన కులాల పైనా ఉన్నది. వెనుకబడిన కులాల మధ్య ఉన్న వివక్ష భావాలను ఆసరా చేసుకొని అగ్రకుల పెత్తందార్లు వీరి మధ్య తగాదాలు పెట్టగలుగుతున్నారు. ఈవిధంగా అగ్రకులాల పెత్తనం రక్షించుకుంటున్నారు. వెనుకబడిన కులాలు కొంతమంది దళితులను సమానంగా చూడకపోవడమే కారణం. అందువలన అగ్రకులాల పెత్తనంకు గురవుతున్న దళితులు, వెనుకబడిన కులాల వారు తమ వ్యత్యాసాలను అధిగమించి ఐక్యంగా పోరాటం చేయడం వలన భూ పంపకంలో విజయం సాధించగలరు. ఆర్థిక పరిస్థితుల్లో వచ్చిన మార్పుల కారణంగా అగ్రకులాల పేదలు సైతం దళజతులతో కలిసిరావడం వలన అగ్రకుల పెత్తందార్ల పెత్తనం కుల పీడనకు వ్యతిరేకంగా పోరాడేటప్పుడు దళితులు, ఇతర వెనుకబడిన కులాలు, అగ్రకులాల పేదలు కలిసి మెలసి ప్రతిఘటించగలుగుతారు. నూటికి తొంబైమంది దళితులు, వెనుకబడిన కులాలు, అగ్రకుల పేదలు వ్యసాయ కార్మికులుగా, పేద రైతులుగా ఆసంఘటితంగా ఉండడం వలన తీవ్ర ఆర్థిక దోపిడీకి, దారిద్ర్యానికి గురవుతున్నారు. ఈ తరగతుల్లో అభివృద్ధి అయిన మధ్య తరగతి శక్తులు ఈ అవకాశాలను ఉపయోగించుకొని అనైక్యత సృష్టిస్తున్నారు. కుల భావాజాలానికి నూతన రూపాలకు జీవం పోస్తూ స్వార్థం కోసం వాడుకునే అవకాశవాద శక్తులను దూరంగా ఉంచాలి.

దళిత ప్రజాప్రతినిధికి అవమానం

తెగించి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కేసీఆర్ చెప్పినట్టు దళితుడు ముఖ్యమంత్రి కాలేదు.. వారికి ఇస్తానన్న మూడెకరాల భూమి దక్కలేదు. డబుల్‌బెడ్‌రూం ఇండ్లు వారి దరి చేరకపోయినా రాష్ట్రంలో మాత్రం కులదురంహకార హత్యలు ఇప్పటికే ఇరవైకి పైగానే చోటుచేసుకున్నాయి. నిత్యం ఏదోఒకచోట దళితులపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. నిన్నటికి నిన్న సాక్షాత్తూ సీఎం కుమారుడు కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల జిల్లా నేరెళ్లలో దళితులపై జరిగిన పోలీసుల దాడి తెలంగాణకే మాయని మచ్చలా మిగిలిన విషయం తెలిసిందే. ఇసుక మాఫియా కనుసన్నల్లో తిరుగుతున్న లారీల కిందపడి దళితులు, వెనుకబడిన వారు మృత్యువాత పడితే చలించని పాలకులు, కడుపుమండి రెండు లారీలను తగులబెట్టినందుకు మాత్రం తీవ్రస్థాయిలో స్పందించారు. దళితులను శాశ్వతంగా మంచానికే పరిమితమయ్యేలా పోలీసులు కరెంటు షాకులతో అమానవీయంగా చిత్రహింసలు పెట్టారు. ఇంత జరుగుతున్నా పాలకుల్లోమాత్రం ఏమాత్రం చలనం లేదనడానికి రాష్ట్రంలో నిరాటంకంగా, నిర్లజ్జగా జరుగుతున్న దాడులే అందుకు సజీవసాక్ష్యంగా చెప్పొచ్చు. ఈ దాడులు, అవమానాలు, హత్యాకాండ ఒక్క మంథని, యాదాద్రి, నేరెళ్ల ఘటనలకే పరిమితం కాలేదు. తాజాగా ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోనూ దళిత ఉపసర్పంచ్‌ను అవమానించిన ఘటన చోటు చేసుకుంది.

వనం నాగయ్య

ఏకంగా మూడు సార్లు ఎన్నికైన దళిత ప్రజాప్రతినిధికి తీరని అవమానం జరిగింది. కూసుమంచి పంచాయతీ ఉపసర్పంచ్ గోపె వెంకన్నను బోనాల వేడుకల ప్రారంభ కార్యక్రమంలో కొబ్బరికాయ కొట్టకుండా గ్రామ పెత్తందారులు అడ్డుకోవడంతో అతను తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. సాక్షాత్తూ ఉప సర్పంచ్‌నైన తనకు ఇలా అవమానం జరగడం పట్ల గ్రామస్తుల అందరిముందూ కన్నీరు పెట్టుకున్నాడు. తన ఆవేదన వెలిబుచ్చాడు.

ఘటనకు సంబంధించిన వివరాలు... ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కుడిభుజంగా ఉన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గం కూసుమంచి పంచాయతీలో ఆగస్టు 6వ తేదీన బోనాల వేడుక నిర్వహించనున్నట్టు గ్రామంలో చాటింపు వేయించారు. దీంతో వారం రోజుల్లో బొడ్రాయి, రామాలయం వద్ద జరిగే బోనాల జాతరకు బ్రహ్మాండమైన ఏర్పాట్లుచేశారు. గ్రామంలోని అందరూ తమతమ బంధువులను, ఆడబిడ్డలను, తోబుట్టువులను, దూరప్రాంతంలో ఉంటున్న వారిని బోనాల జాతరకు ఆహ్వానించారు. ఇలా ఊరు ఊరంతా బంధు మిత్రులతో కళకళలాడుతుంది. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లారగట్లనే గ్రామానికి వచ్చిన ఆడబిడ్డలంతా ముస్తాబై తమ ఇంటిపేరున బోనాలెత్తి వేడుకలో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. మేళతాళాలతో, డప్పువాయిద్యాలతో, గ్రామంలోని యువతీ, యువకుల నృత్యాలతో బోనాలన్నీ గ్రామంలోని లక్ష్మయ్య అనే గ్రామపెద్ద ఇంటివద్దకు చేరాయి. ఇక్కడినుండి బోనాల జాతరను అధికారికంగా గ్రామ కూడలిలోని రామాలయం, బొడ్రాయివద్దకు తీసుకొచ్చేందుకు జాతరను ప్రారంభించాల్సి ఉంది. ఇది ఎప్పటినుండో వస్తున్న గ్రామాచారం. ఈ జాతరను ఎప్పుడైనా గ్రామ సర్పంచ్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించే ఆనవాయితీ. ఈ క్రమంలో ఈనెల 6వ తేదీన ప్రారంభించేందుకు సర్పంచ్ అందుబాటులో లేక పోవడంతో తరువాత స్థానంలో ఉపసర్పంచ్ గోపె వెంకన్నకు ఆ బాధ్యతలు నిర్వర్తించాల్సిన అవకాశం వచ్చింది. కానీ ఉపసర్పంచ్ వెంకన్న దళితుడు కావడంతో అతను వేడుకలు ప్రారంభించకుండా తామే ప్రారంభించాలనుకుని గ్రామ పెద్దలు నిర్ణయించుకున్నారు. దీంతో వెంకన్న రాకముందే గ్రామ పెద్దలు కొబ్బరికాయలు కొట్టి బోనాలను ప్రారంభించారు. ఈ విషయం తెలుసుకున్న ఉపసర్పంచ్ వెంకన్న తీవ్ర మనస్తాపం చెందాడు. నేను ప్రారంభించాల్సిన వేడుకను మీరెలా ప్రారంభించారని పెద్దలను నిలదీశాడు. అందుకు గ్రామపెద్దలు సమాధానం చెప్పకుండానే వెళ్లిపోయేందుకు సిద్ధమయ్యారు. దళితుడిని అయి నందునే తనకు కొబ్బరికాయ కొట్టేందుకు అవకాశం ఇవ్వలేదని, తనను ఊరందరి ముందూ అవమాన పరిచారంటూ బోనాల జాతరను ముందుకు సాగకుండా అడ్డుకున్నాడు. దీనిపై తనకు న్యాయం జరగకుండా బోనాలను ముందుకు కదలనివ్వబోనని భీష్మించాడు. పరిస్థితి ముదురుతుందని భావించిన గ్రామపెద్దలు అవసరమైతే మరో కొబ్బరికాయ తెస్తాం ఇప్పుడు కొట్టాలని సూచించారు. అందుకు తాను ఒప్పుకోననీ, తనకు క్షమాపణ చెప్పాలని పట్టుబట్టాడు వెంకన్న. దీంతో విషయం మీడియా దృష్టికి వెళ్లడంతో పెత్తందార్లు ఉప సర్పంచ్ వెంకన్నకు గ్రామస్తుల ముందు క్షమాపణ చెప్పడంతో వెంకన్న ఆందోళన విరమించాడు. ఇలా స్వాతంత్ర్యం వచ్చి డెబ్బైఏండ్ల వేడుకలు జరుపుకుంటున్న నేటిరోజుల్లోనూ ఇలా దళితులు, గిరిజనులపై వివక్ష గ్రామాల్లో ఎంతగా వేళ్లూనుకుందో ఈ ఘటనే సజీవసాక్ష్యంగా నిలుస్తోంది. సాక్షాత్తూ మంత్రి తుమ్మల నియోజకవర్గంలో జరిగిన ఈ ఘటనను రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు, ప్రజాసంఘాలు, కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి, దళిత సంఘాలు తీవ్రంగా ఖండించాయి.

సెల్..9490099343



గ్రామస్తులందరి ముందూ అవమానించారు

గోపె వెంకన్న, ఉపసర్పంచ్

గ్రామంలో మూడుసార్లు వార్డుమెంబర్‌గా ఎన్నికయ్యా, నేను దళితుడనన్న కారణంతోనే కొబ్బరికాయ కొట్టకుండా అడ్డుకున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే పొంతనలేని సమాధానం చెప్పారు. తీరా బోనాలను అడ్డుకుంటే అప్పుడు కొబ్బరికాయ కొట్టమన్నారు. గ్రామం అంతా సంతోషంగా ఉన్న సమయంలో తన కుటుంబం తీవ్ర మనోవేదన చెందింది. దళితునిగా పుట్టడమే నేరమన్నట్టుగా పెత్తందార్లు నన్ను అవమానించారు. దీనిపై క్షమాపణ చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. అన్ని వర్గాల ప్రజలు నాకు సహకారం అందించారు.



దళితులంటే చులకనగా చూస్తున్నారు

గోపె వీరబాబు

గ్రామంలో దళితులంటేనే చులకనగా చూస్తున్నారు. కొన్నిసార్లు మా కాలనీలకు దేవుళ్ల ఊరేగింపులు కూడా రాని దుస్థితి ఉండేది. ఇప్పుడిప్పుడే అన్నీ సర్దుకుంటున్న సమయంలో ఏకంగా ఉపసర్పంచ్‌గా ఉన్న వెంకన్ననే కొబ్బరికాయ కొట్టకుండా అడ్డుకున్నారు. ఇక మాలాంటి సాధారణ వ్యక్తుల మాటేంటి.



కావాలనే అవమానించారు

నలగాటి భాస్కర్, దళితుడు

గ్రామంలో ఉపసర్పంచ్ దళితుడన్న కారణంతోనే కావాలనే గ్రామంలోని పెత్తందార్లు అవమానించారు. ఇది మాకు తీరని అన్యాయం. గ్రామంలో మరింత చులకనగా చూస్తున్నారు. మాతో అన్నిపనులు చేయించుకునే పెద్దలు ఇలా ఊరందరి ముందు వివక్షకు గురిచేశారు.

కేసీఆర్‌కే దళితులంటే చిత్తశుద్ధిలేదు



ముత్తమాల ప్రసాద్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు

దళితులపై సీఎం కేసీఆర్‌కు చిత్తశుద్ధిలేదు. తొలిముఖ్యమంత్రి దళితుడేనన్న ఆయన అదే సీటును ఆక్రమించి వారిని మోసం చేశాడు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత దాదాపు 20మంది కులదురహంకార హత్యలకు బలయ్యారు. దళితులంటే ముఖంమీద రాసిఉంటుందా? అని ప్రశ్నించడం కేసీఆర్ అహంకారానికి నిదర్శనం.

నీరుగారుతున్న అట్రాసిటీ కేసులు

నందిపాటి మనోహర్, కేవీపీఎస్ ఖమ్మం జిల్లాకార్యదర్శి



తెలంగాణ రాష్ట్రంలో దళితులపై దాడులు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఇటీవల మరింతగా పెరిగాయి. నిన్న సిరిసిల్లలో కేసీఆర్ కుమారుడి నియోజకవర్గంలో దళితులపై పాశవిక దాడులు చేశారు. ఇప్పుడు ఎస్సీఅట్రాసిటీ కేసులను నీరుగారుస్తున్నారు. సెక్షన్ 4ప్రకారం చట్టాలను నీరుగార్చే వారుకూడా నిందితులుగానే భావించాల్సి ఉంది. పాలేరు నియోజకవర్గంలో దాదాపు 30వేల మంది దళితుల ఓట్లు పొందిన తుమ్మల నాగేశ్వరరావు ఉపసర్పంచ్‌కు జరిగిన దాడిని కనీసం ఖండించక పోవడం పెత్తందారుల పోకడకు నిదర్శనం.



ఎడమ కాలి గాయంతో బోల్ట్ విలవిల

రేసు మొనగాడు గాయపడ్డాడు

ఆఖరు పరుగులో గాయంతో బోల్ట్ విలవిల ● రేసు ముగించకుండానే కెరీర్‌కు వీడ్కోలు



ఏమైంది చాంప్? : బోల్ట్‌తో జమైకా బృందం


లండన్ : ట్రాక్ అండ్ ఫీల్డ్‌కు గాయం!. జమైకా చిరుత, పరుగు పందెంలో తిరుగులేని రికార్డుల కింగ్ ఉసేన్ బోల్ట్ ఆఖరి పరుగులో అనూహ్యంగా గాయపడ్డాడు. శనివారం అర్ధరాత్రి జరిగిన 4, 400 మీటర్ల రీలే పరుగులో ఆఖరి 100 మీటర్లను ముగించాల్సిన బోల్ట్.. ఎడమకాలి గాయంతో ఒక్కసారిగా విలవిల్లాడు. మరో 60 మీటర్ల దూరంలో ఫీనిషింగ్ లైన్ ఉన్నా.. ఒక్క అడుగూ వేసేందుకు తల్లడిల్లిపోయాడు. విపరీతమైన నొప్పితో అక్కడిక్కడే కూలబడిపోయిన బోల్ట్.. ఆఖరు పరుగులో అభిమానులకు కన్నీరే మిగిల్చాడు. బోల్ట్ గాయంతో జమైకా రేసును ముగించనేలేదు. 37.47 సెకన్లతో బ్రిటన్ పసిడి సొంతం చేసుకోగా, 37.52 సెకన్లలో రేసు ముగించిన అమెరికా రజతం అందుకున్నది. ఆఖరి 100 మీటర్ల రేసులో కాంస్యంతోనే సరిపెట్టిన ఉసేన్ బోల్ట్.. చివరి రీలేలో పరుగులోనూ కండరాల గాయంతో సంబురాల వీడ్కోలుకు దూరమయ్యాడు!. ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో 14 కెరీర్ పతకాలు సాధించిన బోల్ట్.. వాటిలో 11 పసిడి పతకాలు ఖాతాలో వేసుకున్నాడు. ఒలింపిక్స్‌లో ఎనిమిది స్వర్ణ పతకాలతో ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో తిరుగులేని యోధుడిగా చరిత్ర సృష్టించాడు.



నీది నాదీ 2-2 సంబురం : మైదానం వీడుతూ ధావన్, పాండ్య 2-2 శైలి ఆనందహేళి.

తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 135 ఆలౌట్

ఫాలోఆన్‌లో శ్రీలంక, ప్రస్తుతం 19/1



హార్దిక్ పాండ్య
108
96 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లు)

26
టెస్టుల్లో భారత బ్యాట్స్‌మన్ ఓ ఓవర్లో సాధించిన అత్యధిక పరుగులు. పుష్పకుమార బౌలింగ్‌లో హార్దిక్ పాండ్య వరుసగా 4, 4, 6, 6, 6, 0 బాది 26 పరుగులు పిండుకున్నాడు. ఓవరాల్‌గా లారా (28), బెయిలీ (28), అఫ్రీది (27) ముందున్నారు.

86
పాండ్య తొలి సెంచరీ పూర్తిచేసేందుకు తీసుకున్న బంతులు. సెహ్వాగ్ (78) తర్వాత అతితక్కువ బంతుల్లో విదేశీల్లా శతకబాదిన ఘనత పాండ్యదే.

పరుగుల పాండ్య వికెట్ల యాదవ్



కుల్‌దీప్ యాదవ్ (4/40)

పల్లెకలల్‌లో గెలుపు వాకిట కోహ్లిసేన

- హార్దిక్ పాండ్య సెంచరీ
- మెరిసిన కుల్‌దీప్, షమి
- భారత్ తొలి ఇన్నింగ్స్ 487
- మూడో టెస్టు రెండో రోజు

నవతెలంగాణ-పల్లెకల్

మూడో టెస్టు రెండో రోజు. భారత్‌తో టెస్టు సిరీస్‌లో శ్రీలంక ఆశలతో అడుగుపెట్టిన సందర్భం. కానీ ఆట ముగిసే సమయానికి మరో అత్యంత దారుణ ఓటమికి దగ్గరైన స్థితిలో లంకేయులు. ఈ విరామంలో తొలి సెషన్‌లో హార్దిక్ పాండ్య (108, 96 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లు) మెరుపు సెంచరీ భారత్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 487 పరుగుల భారీ స్కోరు అందించింది. లంచ్ తర్వాత సీమర్ మహ్మద్ షమి (2/17) సూపర్ స్పెల్‌తో శ్రీలంక టాప్ ఆర్డర్ టపా. మూడో సెషన్‌లో చైనామన్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ (4/40) మణికట్టు మాయాజాలంతో తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 135 పరుగులకే కుప్పకూలింది. దీంతో 352 పరుగుల భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం టీమ్ ఇండియా వశమైంది. భారీ ఆధిక్యం కెప్టెన్ కోహ్లిని మరోసారి ఫాలోఆన్ ఆడించేలా చేసింది. ఈ క్రమంలో ఆఖరి పంచ్ ఉమేశ్ యాదవ్ (1/3) విసిరాడు. ఫాలోఆన్‌లో ఓపెనర్ ఉపుల్ తరంగ (7)ను అవుట్ చేసి శ్రీలంక పతనానికి నాంది పలికాడు. 13 ఓవర్లలో 19 పరుగులు చేసిన శ్రీలంక వైట్‌వాష్ ఓటమికి మరో రోజు ముందే మానసికంగా సిద్ధమైపోయింది. నేడు మిగిలిన 9 వికెట్లు కూల్చి చారిత్రక విజయానికి రంగం సిద్ధం చేసుకుంటోంది కోహ్లిసేన.

పాండ్య ఫటాఫట్ : ఓవర్‌నైట్ స్కోరు 329/6తో బరిలోకి దిగిన భారత్.. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య (108) విధ్వంసంతో భారీ స్కోరు సాధించింది. తొలి రోజు ఒక్క పరుగే చేసిన పాండ్య.. ఉదయం సెషన్‌లో ఏకంగా 107 పరుగులు పిండుకున్నాడు. ఏడు సిక్సర్లు, ఎనిమిది ఫోర్లతో విరుచుకుపడిన పాండ్య.. లంకేయులను బెంబేలెత్తించాడు. జట్టుకు అవసరమైన సమయంలో ఆఖరి వరుస ఆటగాళ్లతో విలువైన భాగస్వామ్యాలు నమోదు చేయటంతో పాటు మ్యాచ్‌ను పూర్తిగా భారత్ వైపు తిప్పేశాడు. నాల్గు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 61 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన పాండ్య.. తర్వాతి 50 పరుగుల్ని 25 బంతుల్లోనే పిండుకున్నాడు. స్పిన్నర్ పుష్పకుమార వేసిన ఓవర్లో ఏకంగా 26 పరుగులు పిండుకున్న పాండ్య.. టెస్టు క్రికెట్‌లో సరికొత్త రికార్డు నెలకొల్పాడు. రెండు వరుస బౌండరీలకు తోడు హాట్రిక్ సిక్సర్లు కొట్టిన పాండ్య తడాఖా చూపించాడు. పాండ్య ప్రతాపానికి స్ట్రయిట్‌గా ఉన్న స్క్రీన్ చిత్తడైపోయింది!. అదే ఊపులో కెరీర్ తొలి అంతర్జాతీయ శతకం సాధించిన పాండ్య... 2-2 స్టైల్‌లో శతకాభివాదం చేశాడు. కుల్‌దీప్ యాదవ్ (26, 73 బంతుల్లో 2 ఫోర్లు) పాండ్యకు చక్కని సహకారం అందించాడు. ఆఖరి వికెట్‌కు ఉమేశ్ యాదవ్ (8)ను ఎండ్‌లో ఉంచి పరుగుల వర్షం కురిపించిన పాండ్య.. లంకేయులను పూర్తిగా నైరాశ్యంలోకి నెట్టేశాడు. లంచ్ తర్వాత మూడు బంతుల్లోనే పాండ్య అవుట్ కావటంతో భారత్ తొలి ఇన్నింగ్స్ ముగిసింది. శ్రీలంక స్పిన్నర్ సందకన్ (5/132) ఐదు వికెట్ల ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు.

కుల్‌దీప్, షమి సూపర్ : పాండ్య భీభత్సంతో నిరుత్సాహ పడిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో మహ్మద్ షమి (2/17) దెబ్బకు కుదేలైంది. ఇన్నింగ్స్ మూడో ఓవర్లోనే ఉపుల్ తరంగ (5)ను వికెట్ల వెనక దొరకబుచ్చుకున్న షమి.. తొలి వికెట్ కూల్చాడు. తన తర్వాతి ఓవర్లో మరో ఓపెనర్ కరుణరత్నె (4)ను సైతం అదే రీతిలో సాగనంపాడు. కుశాల్ మెండిస్ (18) రనౌట్‌కు తోడు మాథ్యూస్ (0)ను పాండ్య ఎల్బీగా అవుట్ చేయటంతో శ్రీలంక 38/4తో కష్టాల్లో పడింది. ఈ సమయంలో కెప్టెన్ దినేశ్ చండిమాల్ (48, 87 బంతుల్లో 6 ఫోర్లు), నిరోశన్ డిక్‌వాలా (29, 31 బంతుల్లో 4 ఫోర్లు)లు కాసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. కానీ అది టీ విరామం వరకే పరిమితమైంది. మూడో సెషన్లో విజృంభించిన చైనామన్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ (4/40) శ్రీలంకను చుట్టేశాడు. నాల్గు వికెట్లు కూల్చి.. లంక పతనాన్ని శాసించాడు. డిక్‌వాలా, పెరీరా (0), పుష్పకుమార (10), విశ్వ ఫెర్నాండో (0)లను కుల్‌దీప్ అవుట్ చేశాడు. కెప్టెన్ చండిమాల్ మాత్రం అశ్విన్ వలలో చిక్కాడు. కేవలం 37.4 ఓవర్లలోనే ఆలౌట్ అయిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 352 పరుగుల భారీ వెనుకంజలో పడిపోయింది.

ఒకటి పడింది : భారీ ఆధిక్యం అండతో కోహ్లి వరుసగా రెండోసారి శ్రీలంకను ఫాలోఆన్‌కు పిలిచాడు. ఈ సారి ఉమేశ్ యాదవ్ (1/3) తన ప్రతాపం చూపించాడు. ఓపెనర్ ఉపుల్ తరంగ (7, 31 బంతుల్లో 1 ఫోర్)ను క్లీన్‌బౌల్డ్ చేసి శుభారంభం అందించాడు. మరో ఓపెనర్ కరుణరత్నె (12, 39 బంతుల్లో 2 ఫోర్లు)లకు తోడు నైట్‌వాచ్‌మెన్ పుష్పకుమార (0) అజేయంగా క్రీజులో కొనసాగుతున్నారు.

భారత్ తొలి ఇన్నింగ్స్ : ధావన్ (సి) చండిమాల్ (బి) పుష్పకుమార 119, రాహుల్ (సి) కరుణరత్నె (బి) పుష్పకుమార 85, పుజారా (సి) మాథ్యూస్ (బి) సందకన్ 8, కోహ్లి (సి) కరుణరత్నె (బి) సందకన్ 42, రహానె (బి) పుష్పకుమార 17, అశ్విన్ (సి) డిక్‌వాలా (బి) ఫెర్నాండో 31, హార్దిక్ పాండ్య (సి) పెరీరా (బి) సందకన్ 108, కుల్‌దీప్ యాదవ్ (సి) డిక్‌వాలా (బి) సందకన్ 26, మహ్మద్ షమి (సి,బి) సందకన్ 8, ఉమేశ్ యాదవ్ నాటౌట్ 3, **మొత్తం : (122.3 ఓవర్లలో ఆలౌట్) 487.**

వికెట్ల పతనం : 1-188, 2-219, 3-229, 4-264, 5-296, 6-322, 7-339, 8-401, 9-421, 10-487.

బౌలింగ్ : విశ్వ ఫెర్నాండో 26-3-87-2, లహిరు కుమార 23-1-104-0, కరుణరత్నె 7-0-30-0, పెరీరా 8-1-36-0, సందకన్ 35-4-132-5, పుష్పకుమార 23-2-82-3.

శ్రీలంక తొలి ఇన్నింగ్స్ : కరుణరత్నె (సి) సాహా (బి) షమి 4, తరంగ (సి) సాహా (బి) షమి 5, మెండిస్ రనౌట్ (అశ్విన్/కుల్‌దీప్) 18, చండిమాల్ (సి) రాహుల్ (బి) అశ్విన్ 48, మాథ్యూస్ (ఎల్బీ) పాండ్య 0, డిక్‌వాలా (స్టంప్డ్) సాహా (బి) కుల్‌దీప్ 29, పెరీరా (సి) పాండ్య (బి) కుల్‌దీప్ 0, పుష్పకుమార (బి) కుల్‌దీప్ 10, సందకన్ (సి) ధావన్ (బి) అశ్విన్ 10, లహిరు కుమార నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 11, **మొత్తం : (37.4 ఓవర్లలో ఆలౌట్) 135.**

వికెట్ల పతనం : 1-14, 2-23, 3-38, 4-38, 5-101, 6-107, 7-125, 8-125, 9-135, 10-135.

బౌలింగ్ : మహ్మద్ షమి 6.5-1-17-2, ఉమేశ్ యాదవ్ 3.1-23-0, హార్దిక్ పాండ్య 6-1-28-1, కుల్‌దీప్ యాదవ్ 13-2-40-4, అశ్విన్ 8.4-2-22-2.

శ్రీలంక రెండో ఇన్నింగ్స్ (ఫాలోఆన్) : కరుణరత్నె నాటౌట్ 12, ఉపుల్ తరంగ (బి) ఉమేశ్ యాదవ్ 7, పుష్పకుమార నాటౌట 0, ఎక్స్‌ట్రాలు : 0, **మొత్తం : (13 ఓవర్లలో 1 వికెట్) 19.**

బౌలింగ్ : మహ్మద్ షమి 4-2-7-0, అశ్విన్ 6-4-5-0, ఉమేశ్ యాదవ్ 2-0-3-1, కుల్‌దీప్ యాదవ్ 1-0-4-0.

వీర పాండ్య వీరంగం. పల్లెకల్‌లో పరుగుల వరద. భారత్‌కు న బసారి పోటీనివ్వగల స్థితిలో నిలిచిన శ్రీలంకను హార్దిక్ పాండ్య మెరుపు సెంచరీతో చితక్కొట్టాడు. సునామీ ఇన్నింగ్స్‌తో లంకేయులను చుట్టుముట్టాడు. 86 బంతుల్లోనే శతకబాది శ్రీలంక చేతుల్లోంచి మ్యాచ్‌ను లాగేసుకున్నాడు. పాండ్య ఫటాఫట్ ప్రదర్శనతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 487 పరుగులు చేసింది. పాండ్య బాదుడుకు కుదేలైన లంకేయులను లంచ్ తర్వాత బౌలర్లు కుప్పకూల్చారు. సీమర్లు, స్పిన్నర్లు కలిసికట్టుగా విజృంభించటంతో శ్రీలంక ఉక్కిరిబిక్కిరైంది. చండిమాల్ పోరాడినా.. 135 పరుగులకే చేతులెత్తేసింది. షమి, కుల్‌దీప్‌లు ఆతిథ్య జట్టుతో ఆటాడుకోవటంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 352 పరుగుల భారీ ఆధిక్యం ఎర్రా ద్ రా ౧1 ఫాలోఆన్‌లో అప్పడే ఓ ఓపెనర్‌ను కోల్పోయిన శ్రీలంక నేడు మూడు సెషన్ల పాటు 9 వికెట్లు కాచుకోవటం) ఖ్టసాధ్యమే!. జోరుమీదున్న భారత్ మూడో టెస్టును ముచ్చటగా మూడో రోజే ముగించేలా కనిపిస్తోంది. ద్వీపదేశంలో తొలి క్లీన్‌స్వీప్ విజయానికి కోహ్లిసేన మరో 9 వికెట్ల దూరంలో నిలిచింది.



గుజరాత్ జోరు

అహ్మదాబాద్ : ప్రొ కబడ్డీలో కొత్త జట్టు గుజరాత్‌ఫార్చ్యూన్‌జెయింట్ దుమ్మురేపుతోంది. వరుస విజయాలతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో దూసుకెళ్తోంది. ఆదివారం జైపూర్ పింక్ పాంథర్స్‌తో జరిగిన పోరులో 27-20తో గుజరాత్ గెలుపొందింది. స్టార్ రైడర్ సచిన్ ఆరు పాయింట్లతో మెరవగా, విదేశీ డిఫెండర్ మిగాని నాల్గు టాకిల్స్ చేశాడు. జైపూర్ కెప్టెన్ మంజిత్ చిల్లార్ రెండు టాకిల్స్‌తో సరిపెట్టగా..పవర్ కుమార్ మూడు రైడ్ పాయింట్లకే పరిమితమయ్యాడు. ఇక పట్నా పైరేట్స్, యూపీ యోధా మధ్య జరిగిన మరో మ్యాచ్ 27-27తో డ్రాగా ముగిసింది. ప్రొ కబడ్డీ సీజన్-5లో నేడు విశ్రాంతి రోజు.

- మనీశ్ పాండేకు చోటు
- అశ్విన్, జడేజాలకు విశ్రాంతి
- శ్రీలంకతో వన్డేలకు భారత జట్టు

యువరాజ్‌పై వేటు



నవతెలంగాణ-ముంబయి

యువరాజ్ సింగ్‌పై వేటు పడింది. చాంపియన్స్ ట్రోఫీ సహా కరీబియన్ పర్యటనలో విఫలమైన యువరాజ్ శ్రీలంకతో వన్డే సిరీస్‌కు జట్టులో చోటు కోల్పోయాడు. గత ఆరు వన్డేల్లో కేవలం 109 పరుగులే చేసిన యువరాజ్‌ను తప్పించి.. మనీశ్ పాండేకు మిడిల్ ఆర్డర్‌లో చోటు కల్పించారు. ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలోని సీనియర్ సెలక్షన్ కమిటీ ఆదివారం భారత జట్టును ప్రకటించింది. సీనియర్ స్పిన్నర్లు అశ్విన్, జడేజా సహా మహ్మద్ షమిలకు ఊహించినట్టే విశ్రాంతి లభించింది. దినేశ్ కార్తీక్, రిషబ్ పంత్‌లు జట్టులో చోటు కోల్పోయారు.

రోహిత్ శర్మ, జస్‌ప్రీత్ బుమ్రాలు వన్డేలకు తిరిగి జట్టులోకి రాగా.. గాయం నుంచి కోలుకున్న లోకేశ్ రాహుల్ మూడో ఓపెనర్‌గా స్థానం సాధించాడు. అశ్విన్, జడేజాల స్థానంలో యుజ్వేందర్ చాహల్, అక్షర్ పటేల్‌లు జట్టులోకి వచ్చారు. మహ్మద్ షమి స్థానంలో షార్దుల్ ఠాకూర్ చోటు దక్కించుకున్నాడు. అయితే కరీబియన్ సిరీస్‌లో నిరూపించుకునే అవకాశమే దక్కని రిషబ్ పంత్ అనూహ్యంగా జట్టులో స్థానం కోల్పోవటం గమనార్హం.

శ్రీలంక సిరీస్‌కు భారత జట్టు

శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, లోకేశ్ రాహుల్, విరాట్ కోహ్లి, అజింక్య రహానె, మనీశ్ పాండే, కేదార్ జాదవ్, ఎం.ఎస్ ధోని, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్, యుజ్వేందర్ చాహల్, కుల్‌దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రా, షార్దుల్ ఠాకూర్, భువనేశ్వర్ కుమార్.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.